www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ముగ్గురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణం



కుంచం మహేశ్వరరావు, టీసీ ధనశేఖర్, చల్లా గుణరంజన్‌తో ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ 14

ఆర్మీ అంబులెన్స్‌పై ఉగ్రదాడి

ఎదురుకాల్పుల్లో ముగ్గురు ముష్కరుల హతం

జమ్మూకశ్మీర్‌లోని అఖ్నూర్ సెక్టారులో ఘటన 2

మంగళవారం | 29-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 194 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి ఉ. 10.32 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఉత్తర రా. 6.34 తదుపరి హస్త; వర్జ్యం: తె. 4.04-5.52; దుర్ముహూర్తం: ఉ. 8.33-9.18 రా. 9.49-10.37; అమృతఘడియలు: ఉ. 10.25-12.13; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.16; సూర్యాస్తమయం: 5.41 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రచ్చ గెలిచి.. ఇంట గెలిచా

'ఏఎన్నార్ నేషనల్ అవార్డు' నాకెంతో ప్రత్యేకం

మా అమ్మ అక్కినేని నాగేశ్వరరావు అభిమాని

సినిమాకు ఆయన సేవలు అనితరసాధ్యం 9

నాగార్జున నా స్నేహితుడు, సోదరుడే కాక.. నాకు ఆరోగ్యసూత్రాలు చెప్పే వైద్యుడు కూడా!

అమితాబ్ నుంచి అవార్డు అందుకున్న చిరు



రెండేళ్లలో 'మేకిన్ ఇండియా' విమానం!

సీ-295 రవాణా విమానం తయారీ ఇక్కడే 2

ఐదారేళ్లలో దేశంలో 1000 వరకు రక్షణ స్టార్టప్‌లు: మోదీ

వడోదరలో సీ-295 విమానాల తయారీ కర్మాగారం ప్రారంభం

మోదీ విజన్‌కు ఈ ప్రాజెక్టు నిదర్శనం: స్పెయిన్ ప్రధాని సాంచెజ్

తొలి విమానాన్ని మోదీయే ప్రారంభించాలి: చంద్రశేఖరన్



సీ-295 నమూనాతో ప్రధాని మోదీ, స్పెయిన్ ప్రధాని సాంచెజ్, టాటా చైర్మన్ చంద్రశేఖరన్

గ్రానైట్ ఫ్యాక్టరీ, గనుల లీజులు లేని కంపెనీకి సర్వే రాళ్లను సరఫరా చేసే కాంట్రాక్టును కట్టబెట్టారు. వైద్య పరికరాలు అమ్ముకునే మరో కంపెనీకి.. సర్వేరాళ్లను పాలిష్ చేసే మిషన్లను చైనా నుంచి కొనుగోలు చేసే కాంట్రాక్టును అప్పగించారు. ఇలా...నియమనిబంధనలు, పారదర్శకత, పద్ధతిని బుట్టదాఖలు చేసి ఆనాడు అడ్డగోలు దందాను ఎండీసీలోని ఉన్నతాధికారులు, అప్పటి ప్రభుత్వ పెద్దలు నడిపించారు. పైగా.. ఈ కంపెనీల్లో ఒకటి ఎండీసీలోని ఓ ఉన్నతాధికారి బంధువులది కాగా, రెండో కంపెనీ మరో ఉన్నతాధికారి బినామీ కంపెనీ. ఇప్పుడు వీటన్నింటిని వెలికితీసేందుకు ఏసీబీ ఒక్కో అంశంపై విచారణ మొదలుపెట్టింది.

'సర్వే రాళ్ల'లో స్వాహాపర్వం

వైద్య పరికరాలు అమ్ముకునే 'ధన్వంతరి' కంపెనీకి రాళ్లతో ఏం పని?

ఫ్యాక్టరీ, గనులలీజు లేని కంపెనీ మరొకటి

దానికి సర్వేరాళ్ల సరఫరా కాంట్రాక్టు ఎలా?

ఈ కంపెనీలను సిఫారసు చేసిందెవరు?

ధన్వంతరికి 140 కోట్ల విలువైన టెండరు

అయినా, న్యాయసమీక్షకు పంపలేదేం?

పైగా రూ.100 కోట్లు అడ్వాన్స్ ఇవ్వాలని ఆర్థిక శాఖపై నాడు వెంకటరెడ్డి ఒత్తిడి

అది ఎవరి బంధువుల కంపెనీ?

విజిలెన్స్ విచారణ ఎవరు వద్దన్నారు?

సర్వేరాళ్ల కొనుగోల్‌మాల్‌పై ఏసీబీ విచారణ

టెండరు కమిటీని ప్రశ్నించిన అధికారులు

ఎండీసీ కార్యాలయం తలుపులు మూసి కీలక ఫైళ్ల పరిశీలన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల శాఖ కేంద్రంగా వైసీపీ హయాంలో సాగిన కొనుగోళ్ల దోపిడీ గుట్టురట్టవుతోంది. అస్మదీయులు, అయినవారితో కంపెనీలు ఏర్పాటుచేయించి వాటికే టెండర్లు కట్టబెట్టి దోచుకున్న ఉల్లంఘనుల బాగోతాలు వెలుగుచూస్తున్నాయి. భూముల

మిగతా 13వ పేజీలో..

గనుల శాఖలో కల్లోలం

నాడు అక్రమాలకు కొమ్ముకాసిన వారిపై చర్యలు

13 మందిని సెలవుపై పంపించిన సర్కారు 2

నలుగురు ఉన్నతాధికారులను మినహాయించడంపై విమర్శలు

తప్పు చేయని అధికారులపై చర్యలు



హే రఘురాం

నాడు జగన్మాయలు ఎన్నెన్నో

నాడు జగన్ పెట్టుబడి 45 కోట్లే

2008కి ఆ విలువ 6,500 కోట్లు

భారతి సిమెంట్స్‌గా పేరు మార్పు

ప్రస్తుత వాటా 20 వేల కోట్లకు పైనే

తండ్రి సీఎంగా ఉన్నప్పుడు 2006లో జగన్ చేతికి రఘురాం సిమెంట్స్

కడప జిల్లాలో అడ్డగోలుగా 2 వేల ఎకరాల సున్నపురాయి గనులు లీజుకు

గతంలోనే సీబీఐ తీవ్ర అభియోగాలు

తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని క్విడ్ ప్రోకోకు పాల్పడినట్టు ఆరోపణలు

దాల్మియాకు 1017 ఎకరాల గనులు లీజుకు

ప్రతిఫలంగా భారతిలో 50 కోట్ల పెట్టుబడి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నాడు తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని జగన్ సంపాదించిన అక్రమాస్తుల్లో రఘురాం సిమెంట్స్ ముఖ్యమైనది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా కడప జిల్లాలో ఈ కంపెనీకి దాదాపు 2 వేల ఎకరాల గనులు కేటాయించారు. వైఎస్ ఆదేశాలతో అన్ని స్థాయుల్లో అధికారులు ఇందుకు సహకరించారు. కడప జిల్లాలో అప్పటికే ప్రాస్పెక్టింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసిన గుజరాత్ కంపెనీ అంబూజా సిమెంట్స్ లిమిటెడ్‌ను బలవంతంగా పక్కకు తప్పించి మరీ కట్టబెట్టారు. ఎవరో స్థాపించిన

మిగతా 13వ పేజీలో..



దాల్మియాతో క్విడ్ ప్రోకో

భారతి సిమెంట్స్‌కు చెందిన షేర్లను దాల్మియా సిమెంట్స్ కొనుగోలు చేయడం వెనుక క్విడ్ ప్రోకో జరిగింది. నాటి రాజశేఖర రెడ్డి ప్రభుత్వందాల్మియా సిమెంట్స్‌కు కడప జిల్లాలో 1017 ఎకరాల సున్నపురాయి గనులను 30 ఏళ్లకు లీజుకు ఇచ్చింది. ఇందుకు ప్రతిఫలంగా భారతి సిమెంట్స్‌లో దాల్మియా రూ.50 కోట్ల పెట్టుబడి పెట్టింది. దాల్మియాకు గనుల లీజు వ్యవహారంపై నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆదేశాలను.. అప్పటి గనుల శాఖ డైరెక్టర్ వి.డి.రాజగోపాల్, కార్యదర్శి వై.శ్రీలక్ష్మి పక్కాగా అమలు చేశారు. గనుల అక్రమాల గురించి సీబీఐ విచారణలో నాటి ఆ శాఖ సంయుక్త కార్యదర్శి ఎ.దయాకర రెడ్డి, ఆ శాఖ సూపరింటెండెంట్ కె.వెంకట్రావు వాంగ్మూలం ఇచ్చారు. ఈ వాంగ్మూలం 'ఆంధ్రజ్యోతి'కి చిక్కింది.

విజయలక్ష్మే ఈ సమస్యను పరిష్కరించాలి

వైఎస్ మరణంలో బాబు పాత్ర ఉందనడం సిగ్గుచేటు: బాలినేని 13

షర్మిలకిచ్చిన 200 కోట్లు జగన్‌కు ఎక్కడివి?

ఎన్‌సీఎల్‌టీలో తల్లి, చెల్లిపై కేసు ఆత్మహత్యా సదృశ్యమే: యనమల

ఓ కంపెనీలో లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే రెండేళ్లలో ఎంత సంపాదించవచ్చు? రెండు లక్షలు.. మూడు లక్షలు..? ప్చ్.. కష్టమే! అలాంటిది.. ఏకంగా 144 రెట్లు సంపాదిస్తే..? కచ్చితంగా 'ఏంతే'. దిగ్గజ పారిశ్రామిక వేత్తలకు సైతం సాధ్యం కాని విధంగా మాజీ సీఎం జగన్ ఇలా ఆస్తులు పోగేసుకున్నారు. ఎలా సాధ్యమో ఆయనకు మాత్రమే తెలుసు!

తండ్రి రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2006లో రఘురాం సిమెంట్స్ జగన్ చేతికి వచ్చింది. ఈ కంపెనీలో 82 శాతం వాటాగా జగన్, ఆయన బంధువులు, స్నేహితులు పెట్టిన పెట్టుబడి రూ.45 కోట్లు. 2008 నాటికి జగన్ అండ్ కో వాటాల విలువ ఏకంగా రూ.6,500 కోట్లకు పెరిగింది. రఘురాం సిమెంట్స్‌నే భారతి సిమెంట్స్‌గా పేరు మార్చారు. ప్రస్తుతం ఈ కంపెనీకి జగన్ ప్రమోటర్ కాగా, ఆయన భార్య భారతి యజమాని. ఇప్పుడు వారి వాటా విలువ 20 వేల కోట్లకు పైనేనని అంచనా!

ఎమ్మార్పీ ఉల్లంఘనకు 5 లక్షల జరిమానా



13

రెండోసారి చేస్తే.. లైసెన్స్ రద్దు

బెల్టు షాపులు పెట్టినా అవే చర్యలు

మద్యం వ్యాపారంపై సీఎం ఆదేశాలు

పక్క రాష్ట్రాలకు ఇసుక వెళ్లకూడదు: బాబు

స్వర్ణాంధ్ర సాకారానికి అదానీ

సీఎం చంద్రబాబుతో ప్రతినిధి బృందం భేటీ

రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు రోడ్‌మ్యాప్

వివిధ రంగాల్లో ప్రాజెక్టులకు ప్రతిపాదనలు

ఉచిత సిలిండర్లకు రూ.895 కోట్లు రాయితీ

నిధుల విడుదలకు ప్రభుత్వ అనుమతి

నేటి నుంచే బుకింగ్‌కు అవకాశం 14

1.48 కోట్ల మందికిపైగా లబ్ధిదారులు

విజిలెన్స్ కమిషనర్‌గా పునేఠా

నియామకానికి గవర్నర్ ఆమోదం 9



అమెరికాలోని డల్లాస్‌లో పెరోట్ గ్రూప్ చైర్మన్ రోస్ పెరోట్, తదితరులతో మంత్రి లోకేశ్

ఈవీల తయారీకి అనంత అనుకూలం

పరిశ్రమలకు సంపూర్ణ సహకారం

ఏపీకి రండి.. పెట్టుబడులు పెట్టండి

టెస్లా కంపెనీకి మంత్రి లోకేశ్ ఆహ్వానం

టెస్లా సీఎఫ్‌ఓ వైభవ్, పెరోట్ చైర్మన్‌తో భేటీ

స్మార్ట్ సిటీలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం కావాలని పిలుపు

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వెహికల్స్(ఈవీ) పరిశ్రమకు అనంతపురం జిల్లా వ్యూహాత్మక ప్రదేశమని, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాలని దిగ్గజ సంస్థ టెస్లాను ఐటీ, మానవవనరుల శాఖ మంత్రి లోకేశ్ ఆహ్వానించారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన సోమవారం పలు కంపెనీల ప్రతినిధులతో

మిగతా 2వ పేజీలో..

నైపుణ్య శిక్షణతో కొలువు

యువతకు ఏడాదికి 1.24 లక్షల ఉద్యోగాలు

సీడాప్ వార్షిక ప్రణాళికలో వెల్లడి

తాడిపత్రిలో అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్

36 స్కిల్ కౌన్సిళ్లతో చర్చలు.. 12 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సులు 14

92 వేల మందికి స్వయం ఉపాధి

పలు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు

స్కిల్ హబ్‌గా ఏపీ: సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి

వచ్చే ఏడాది జనగణన



2025 మొదట్లో షురూ.. 2026లో పూర్తి.. ఆ తర్వాత లోక్‌సభ సీట్ల పునర్విభజన

రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ పదవీకాలం పొడిగింపు

అఖిలపక్ష భేటీ నిర్వహణకు కాంగ్రెస్ డిమాండ్ 2

ఉక్రెయిన్-రష్యా చర్చలు భారత్‌లోనే..



అయితే మా షరతుల ప్రకారం జరగాలి

యుద్ధాన్ని మోదీ ఆపగలరు!

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్య

ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

న్యూఢిల్లీ, అక్టోబరు 28: తమ దేశంపై రష్యా యుద్ధాన్ని ఆపేందుకు భారత ప్రధాని మోదీ కీలక పాత్ర పోషించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఆకాంక్షించారు. ఈ సంక్షోభాన్ని ఆయన ఆపగలరని వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ సోమవారం ఓ జాతీయ ఆంగ్ల పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. 'జనాభా, ఎకానమీ, పలుకుబడి, ప్రభావపరంగా భారత్ అతిపెద్ద దేశం. అంత పెద్ద దేశానికి మోదీ ప్రధానిగా ఉన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆయన ఆపగలరు. తదుపరి శాంతి చర్చలు ఇండియాలో జరుగుతాయని ఆశిస్తున్నాను. యుద్ధాన్ని ఆపే ప్రయత్నాలు మోదీ కచ్చితంగా చేయగలరు. చర్చలకు అందరం సన్నద్ధం కావాలి. అయితే మేం కోరుకుంటున్న ఫార్మాట్లో అంటే మా షరతుల

మిగతా 2వ పేజీలో...

వీసా లేకుండానే రష్యాకు!

భారతీయులకు శుభవార్త

వచ్చే ఏడాది స్ప్రింగ్ సీజన్ నుంచి అమలు?

ఖరము పాలు.. ఖర్మ ఖర్మ

భారీ ఆదాయం వస్తుందని ఆశపెట్టి

తమిళనాడు వ్యక్తి కుచ్చుటోపీ

ఏపీ, తెలంగాణలో కోట్లు వసూలు

రెండు తెలుగు రాష్ట్రాల్లో 350 మంది బాధితుల గోడు 12



బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తిని పునఃప్రారంభిస్తున్న సీఎండీ సక్సేనా

విశాఖ ప్లాంటులో రెండో బ్లాస్ట్ ఫర్నేస్ రెడీ 9

మూతపడ్డ 'గోదావరి' పునఃప్రారంభం

రోజుకు 14 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి లక్ష్యం

ఆర్మీ అంబులెన్స్‌పై ఉగ్రదాడి

» ఎదురుకాల్పుల్లో ముగ్గురు ముష్కరులు హతం

» జమ్మూకశ్మీర్‌లోని అఖ్నూర్ సెక్టారులో ఘటన

శ్రీనగర్, అక్టోబరు 28: జమ్మూకశ్మీర్‌లో వరుస ఉగ్రదాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. సోమవారం ఉదయం జమ్మూలోని అఖ్నూర్ సెక్టారు వద్ద ఆర్మీ అంబులెన్స్‌పై ముగ్గురు ఉగ్రవాదులు మెరుపుదాడి చేశారు. విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో జవాన్లు ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. ఓ పోలీసు జాగిలం మాత్రం చనిపోయిందని చెప్పారు. తక్షణమే స్పందించిన భద్రతా సిబ్బంది ఉగ్రవాదుల కోసం గాలింపు చేపట్టారు. కనీసం ముగ్గురు ముష్కరులను హతమార్చినట్లు, వారి వద్ద నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. మిగతా వారి కోసం ఆర్మీ, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహిస్తున్నారు.

మహారాష్ట్ర ఎన్నికలకు బీజేపీ మూడో జాబితా

ముంబై, అక్టోబరు 28: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ సోమవారం 25 మంది అభ్యర్థులతో మూడో జాబితాను ప్రకటించింది. ఇందులో కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన ఇద్దరికి అలాగే మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడనవీస్ పీఏకు అవకాశం కల్పించింది. 2021 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన జితేశ్ అంతపుర్కార్ ఇటీవల బీజేపీలో చేరగా.. ఆయన్ను దెగ్లూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ బరిలోకి దింపింది.

ప్రియాంక నామినేషన్‌కు ఆమోదమా?

న్యూఢిల్లీ, అక్టోబరు 28: వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకాగాంధీ దాఖలు చేసిన నామినేషన్‌ను ఈసీ ఆమోదించడం పట్ల బీజేపీ ఐటీ సెల్ ఇన్‌చార్జి అమిత్ మాలవియా మండిపడ్డారు. ప్రియాంక... తనతో పాటు తన భర్తకు సంబంధించిన ఆస్తి వివరాలను పూర్తిగా బహిర్గతం చెయ్యలేదని ఆరోపించారు.

వాళ్లందరినీ ముక్కలు ముక్కలుగా నరికేస్తాం: మిథున్

న్యూఢిల్లీ, అక్టోబరు 28: పశ్చిమ బెంగాల్‌లో ముస్లింలందరినీ ముక్కలు ముక్కలుగా నరికి పాతిపెడతామని అని నటుడు, బీజేపీ నేత మిథున్ చక్రవర్తి తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) నేత హుమయూన్ కబీర్ హిందువులపై చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ ఆయన ఈ మాటలు అన్నారు. మే నెలలో ముర్షీదాబాద్ లోక్‌సభ స్థానం ఎన్నికల ప్రచారంలో కబీర్.. "ఇక్కడ మేం(ముస్లింలు)70% మంది, మీరు(హిందువులు) 30% మంది ఉన్నారు. మీరు మసీదులను కూలగొడుతుంటే ముస్లింలు ఊరికే చూస్తూ కూర్చుంటారు అనుకోకండి. అందరినీ భాగీరథి నదిలో పడేస్తాం" అని అన్నారు. బెంగాల్‌లో వచ్చే నెలలో 6 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల ప్రచారంలో మిథున్ చక్రవర్తి పాల్గొన్నారు .ఆయన ఈ వ్యాఖ్యలు చేసేప్పుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పక్కనే ఉన్నారు.

కొత్త గ్రహాన్ని కనుగొన్న భారత శాస్త్రవేత్తలు

» పరిమాణంలో భూమి కన్నా 5 రెట్లు పెద్దది..

న్యూఢిల్లీ, అక్టోబరు 28: విశ్వంలో మరో కొత్త గ్రహాన్ని భారత శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అధునాతన స్పెక్ట్రోగ్రాఫ్‌ను ఉపయోగించి ఆ గ్రహాన్ని గుర్తించామని.. ఇదో అద్భుత ఆవిష్కరణ అని ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (పీఆర్ఎల్) కి చెందిన పరిశోధకులు పేర్కొన్నారు. ఈ గ్రహాన్ని టీఓఐ-6651బీగా పిలుస్తున్నామని తెలిపారు. శని గ్రహం పరిణామంలో ఉన్న ఈ ప్రత్యేక గ్రహం.. సూర్యుడిని పోలిన నక్షత్రం చుట్టూ తిరుగుతోందని వెల్లడించారు. దీని కక్ష్య కొద్దిగా అండాకారంలో ఉందన్నారు. ఇక భూమితో పోలిస్తే ఈ గ్రహం బరువు 60 రెట్లు అధికంగా ఉంటుందని, పరిమాణంలో 5 రెట్లు పెద్దదని వివరించారు. ఈ గ్రహం అధిక సాంద్రతను బట్టి 87% రాతి, ఇనుము పదార్థాలను సూచిస్తుందన్నారు. హైడ్రోజన్, హీలియం వంటి తేలిక వాయువులు గ్రహంపై వ్యాపించి ఉండే అవకాశముందన్నారు. తమ ఈ ఆవిష్కరణ ప్రపంచ అంతరిక్ష పరిశోధనా రంగంలో భారత్ నుంచి పెరుగుతున్న సహకారాన్ని సూచిస్తుందన్నారు.

ఎంపీ పప్పూ యాదవ్‌కు బిష్ణోయ్ ముఠా హెచ్చరిక

» సల్మాన్‌ఖాన్‌కు మద్దతిచ్చినందుకు బెదిరింపు

న్యూఢిల్లీ, అక్టోబరు 28: బిహార్‌లోని పూర్ణియాకు చెందిన ఇండిపెండెంట్ ఎంపీ పప్పూ యాదవ్‌ను గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యుడు ఒకడు బెదిరించాడు. హీరో సల్మాన్‌ఖాన్‌కు మద్దతుగా మాట్లాడినందుకు చంపేస్తామని హెచ్చరిస్తూ ఫోన్ చేశాడు. ఈ విషయాల్లో జోక్యం చేసుకోకూడదని హెచ్చరించాడు. దాంతో పప్పూ యాదవ్ బిహార్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. సల్మాన్‌ఖాన్ మిత్రుడైన ఎన్‌సీపీ నాయకుడు సిద్దిఖీని బిష్ణోయ్ అనుచరులు కాల్చి చంపారు. దీనిపై పప్పూ యాదవ్ ట్వీట్ చేస్తూ సల్మాన్ తరఫున తాను ఉన్నానని చెప్పారు. లారెన్స్‌ను పైసాకు పనికిరాని గ్యాంగ్‌స్టర్ అని విమర్శిస్తూ తనకు అవకాశం ఇస్తే 24 గంటల్లో ఆ ముఠాను రూపుమాపుతానంటూ బహిరంగంగా సవాలు విసిరారు.

నేతలు,జడ్జీలు కలవడం మామూలే: సీజేఐ

న్యూఢిల్లీ, అక్టోబరు 28: ముఖ్యమంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు తరచూ కలుసుకోవడం, మాట్లాడుకోవడం మామూలేనని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ఆ సమయంలో న్యాయ సంబంధ విషయాల ప్రస్తావన వారి మధ్య రాదని, అటువంటి సందర్భం తనకు ఒక్కటి కూడా గుర్తు లేదని తెలిపారు. తమ ఇంట్లో గణపతి పూజా కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించడంపై రాజకీయ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో... ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మరికొద్ది రోజుల్లో పదవీవిరమణ చేయనున్న ఆయన ఈ వివాదంపై లోక్‌సత్తా వార్షిక సమావేశంలో స్పందించారు. "రాజకీయ నాయకులు, న్యాయమూర్తులు ఎందుకు కలుసుకుంటారో తెలుసుకోవాలని ప్రజలకు ఉంటుంది. న్యాయవ్యవస్థతోపాటు రాజకీయ వ్యవస్థకు కూడా పరిణతి ఉంది. న్యాయ వ్యవస్థకు అవసరమైన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. అది న్యాయమూర్తుల కోసం కేటాయించే బడ్జెట్ కాదు. నూతన కోర్టు భవనాలు, జిల్లాల్లో న్యాయమూర్తులకు కొత్త నివాస సముదాయాల ఏర్పాటు కోసం ఆ బడ్జెట్‌ను వినియోగిస్తారు. ఇలాంటి అవసరాలు తీరాలంటే ప్రధాన న్యాయమూర్తులు, ముఖ్యమంత్రి కలిసి మాట్లాడుకోవడం అవసరం" అని వివరించారు.

ట్రంప్‌వైపు భారతీయ అమెరికన్ల మొగ్గు!

వాషింగ్టన్, అక్టోబరు 28: వచ్చే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భారతీయ అమెరికన్లు రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్‌కు ఓటేసేందుకు గతంలో కంటే ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు ఓ సర్వే వెల్లడించింది. స్వతహాగా డెమోక్రాట్లకు మద్దతుగా ఉండే వీరిలో మార్పు రావడం ఆ పార్టీకి ఓ హెచ్చరికగా పేర్కొంది. "2024 ఇండియన్-అమెరికన్ యాటిట్యూడ్స్" పేరుతో పరిశోధన, విశ్లేషణ సంస్థ యుగవ్ భాగస్వామ్యంతో కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ సంస్థ ఈ సర్వే చేసింది. సెప్టెంబరు 18 నుంచి అక్టోబరు 15 మధ్య 714 మంది అభిప్రాయాలు సేకరించింది. దీనిప్రకారం.. 61% భారతీయ అమెరికన్లు డెమోక్రాట్ల అభ్యర్థి కమలా హ్యారిస్‌కు ఓటేయనున్నారు. 32% మంది ట్రంప్‌కు జై కొట్టారు. నాలుగేళ్ల క్రితం అధ్యక్ష ఎన్నికల్లో భారతీయ అమెరికన్లు 22 శాతం మందే ట్రంప్‌కు ఓటేయగా.. అప్పట్లో జో బైడెన్‌కు 68 శాతం మంది మద్దతు తెలిపారు. 2020 నుంచి ట్రంప్‌వైపు భారతీయ అమెరికన్లు మొగ్గు చూపుతున్నారు. ఇక భారతీయ అమెరికన్ మహిళల్లో 67 శాతం, పురుషుల్లో 53 శాతం హ్యారిస్‌కు ఓటేస్తామని చెప్పారు.

నా ఫోన్ నంబర్ గుర్తులేదు: బోరుగడ్డ

» వేర్వేరు కేసుల్లో ముగిసిన అనిల్, చైతన్య కస్టడీ

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు విచారణకు రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్ ఏ మాత్రం సహకరించలేదు. తన సెల్ ఫోన్ నంబరేంటో తనకే గుర్తులేదని.. మొబైల్ ఎక్కడో పోయిందని చెప్పాడు. గుంటూరులో చర్చి కోశాధికారిని కత్తితో బెదిరించి రూ.50 లక్షలు డిమాండ్ చేసిన కేసులో నిందితుడైన అనిల్‌కు కోర్టు విధించిన మూడ్రోజుల పోలీసు కస్టడీ సోమవారం ముగిసింది. అలాగే టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ప్రధాన నిందితుడైన పానుగంటి చైతన్య కూడా సరైన జవాబులు చెప్పలేదని.. కేసును తప్పుదోవ పట్టించేలా వ్యవహరించాడని సీఐడీ వర్గాల ద్వారా తెలిసింది. కస్టడీ ముగియడంతో బోరుగడ్డను మంగళవారం మధ్యాహ్నం రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించనున్నారు. అలాగే సీఐడీ కస్టడీలో ఉన్న చైతన్యను సోమవారం గుంటూరులోని న్యాయాధికారి ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. అతడిని తిరిగి జిల్లా జైలుకు తరలించారు. విచారణలో చైతన్య పలు కీలక వివరాలు వెల్లడించినట్లు తెలుస్తోంది.

రెండేళ్లలో

మేకిన్ ఇండియా విమానం!

సీ-295 రవాణా విమానం అందుబాటులోకి.. భవిష్యత్తులో ఇక్కడ్నుంచి ఎగుమతులుంటాయ్

» వడోదరలో సీ-295 విమానాల తయారీ కర్మాగారం ప్రారంభోత్సవంలో మోదీ

వడోదర, అక్టోబరు 28: దేశ రక్షణ రంగంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. సైనిక రవాణా విమానాలను తయారు చేసే తొలి ప్రైవేటు కర్మాగారం ప్రారంభమైంది. గుజరాత్‌లోని వడోదరలో సీ-295 రవాణా విమానాల తయారీ కేంద్రాన్ని ప్రధాని మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. టాటా సంస్థ భాగస్వామ్యంతో స్పెయిన్‌కు చెందిన ఎయిర్‌బస్ ఈ ప్యాక్టరీని నిర్మించింది. ఎయిర్‌బస్ ఇతర దేశాల్లో ఇలాంటి విమానాలను తయారు చేయడం ఇదే తొలిసారి. కర్మాగారం ప్రారంభోత్సవం సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఈ పరిశ్రమ భారత్-స్పెయిన్ మధ్య సంబంధాలతో పాటు 'మేకిన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' మిషన్‌ను బలోపేతం చేస్తుందని చెప్పారు.భారత్-స్పెయిన్ భాగస్వామ్యాన్ని పెడ్రో సాంచెజ్‌తో కలిసి సరికొత్త మార్గంలో తీసుకెళుతున్నామని తెలిపారు. సరికొత్త భారతదేశంలో పని సంస్కృతి ఎంత వేగంగా మారిందనడానికి సీ-295 విమానాల తయారీ కేంద్రం ప్రారంభోత్సవమే నిదర్శనమన్నారు. రెండేళ్ల కిందట ఈ కర్మాగారం నిర్మాణ పనులు ప్రారంభించామని.. ఇప్పుడది విమానాల ఉత్పత్తికి సిద్ధమైందని చెప్పారు. రెండేళ్లలో తొలి విమానం అందుబాటులోకి వస్తుందన్నారు. భవిష్యత్తులో ఇక్కడ తయారయ్యే విమానాలను ఇతర దేశాలకు ఎగుమతి కూడా చేస్తారన్న విశ్వాసం తనకుందన్నారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం తీసుకున్న పటిష్ఠ చర్యలతో దేశంలో రక్షణ తయారీ రంగం సరికొత్త శిఖరాలకు చేరిందని తెలిపారు. గడిచిన ఐదారేళ్లలో దేశంలో దాదాపు 1000 రక్షణ స్టార్టప్‌లు ప్రారంభమయ్యాయని.. గత పదేళ్లలో దేశ రక్షణ ఎగుమతులు 30 రెట్లు పెరిగాయని తెలిపారు. ప్రస్తుతం 100కు పైగా దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తున్నామన్నారు. "ఇటీవల భారత ముద్దు బిడ్డ రతన్ టాటాను కోల్పోయింది. ఆయన బతికి ఉంటే.. ఈ రోజు ఇక్కడ మన మధ్యే ఉండేవారు. ఎక్కడ ఉన్నా ఆయన ఈ కార్యక్రమాన్ని చూసి సంతోషిస్తారు" అని మోదీ నివాళి అర్పించారు. భారత్‌ను వైమానిక హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మేడిన్ ఇండియా పౌర విమానం కూడా తయారవుతుందని, దానికి ఇలాంటి కర్మాగారాలు దారి చూపుతాయని చెప్పారు.



వడోదరలో సీ-295 విమానాల తయారీ కర్మాగారం ప్రారంభోత్సవంలో మోదీ, సాంచెజ్

రోడ్ షో..

కర్మాగారం ప్రారంభోత్సవం సందర్భంగా మోదీ, సాంచెజ్‌లో వడోదరలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ వరకూ 2.5 కి.మీ. మేర సాగిన ఈ రోడ్ షోలో ఇద్దరు నేతలు ప్రజలకు అభివాదం చేస్తూ ఉత్సాహంగా ముందుకు కదిలారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్‌ను వీరిద్దరూ కలిసి ప్రారంభించారు.

మోదీ దూరదృష్టికి ఈ ప్రాజెక్టు నిదర్శనం

వడోదర కర్మాగారం నుంచి రెండేళ్లలో తొలి సీ-295 విమానం అందుబాటులోకి వస్తుందని స్పెయిన్ ప్రధాని సాంచెజ్ చెప్పారు. భారత్‌ను పారిశ్రామిక పవర్ హౌస్‌గా మార్చాలని, పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు గమ్యస్థానంగా మార్చాలన్న ప్రధాని మోదీ సంకల్పం, దూరదృష్టికి ఈ ప్రాజెక్టు నిదర్శనమని కొనియాడారు. తమ దేశం భారత్‌కు నమ్మకమైన, వ్యూహాత్మకమైన భాగస్వామి అని చెప్పారు. టాటా సంస్థ దిగ్గజాలకే దిగ్గజమని కొనియాడారు. టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ.. రెండేళ్లలోనే తొలి విమానాన్ని అందజేస్తామని ప్రధాని మోదీకి హామీ ఇచ్చారు. తొలి విమానాన్ని కూడా మోదీ చేతుల మీదుగానే ప్రారంభిస్తామని, అందుకోసం ఆయన సమయం కూడా తీసుకుంటామని చెప్పారు. ఇది రతన్ టాటా కలల ప్రాజెక్టు అన్నారు. ఇది టాటా గ్రూప్‌కే కాదని, యావత్ దేశానికే చరిత్రాత్మకమైన రోజని పేర్కొన్నారు. 56 సీ-295 విమానాల కొనుగోలుకు 2021 సెప్టెంబరులో భారత్ ఎయిర్‌బస్‌తో రూ.21 వేల కోట్ల విలువైన ఒప్పందం చేసుకుంది. ఇందులో 16 విమానాలు ఇప్పటికే భారత్‌కు చేరుకున్నాయి. మిగిలిన 40 విమానాలు వడోదరలోని కర్మాగారంలో తయారు చేస్తారు. ఈ విమానాల్లో 40-45 మంది పారాట్రూపర్లు లేదా 70 మంది పౌరులు ప్రయాణించొచ్చు. 5-10 టన్నుల వస్తువులను రవాణా చేసే సామర్థ్యంతో వీటిని రూపొందిస్తున్నారు.

నాగ్‌పూర్‌లో పెట్టాల్సినదాన్ని వడోదరకు తరలించారు

టాటా ఎయిర్‌బస్ ప్రాజెక్టుపై విపక్షాలు

గుజరాత్‌లోని వడోదరలో మోదీ సోమవారం టాటా ఎయిర్‌బస్ సీ295 విమానాల నిర్మాణ ప్రాజెక్టును ప్రారంభించడంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. నిజానికి దీన్ని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఏర్పాటు చేయాల్సి ఉండగా, గుజరాత్‌కు తరలించుకుపోయారని ఆరోపించాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రయోజనాలను కాదని ప్రధాని సూచనల మేరకు ఈ ప్రాజెక్టును గుజరాత్‌కు తీసుకెళ్లారని ఆరోపించారు. ఇందుకు మహారాష్ట్ర ప్రజలు గట్టి సమాధానం ఇస్తారని చెప్పారు.

లోకం తీరు



మరో 60 విమానాలకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ, అక్టోబరు 28 : దేశంలో విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం 60కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. గత 15 రోజుల్లో 410 దేశీయ, అంతర్జాతీయ విమానాలకు ఉత్తుత్తి బాంబు బెదిరింపులు వచ్చాయి. వీటిలో చాలావరకు సోషల్ మీడియా ద్వారానే వచ్చాయి. సోమవారం ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలకు చెందిన చెరో 21 విమానాలకు, విస్తారాకు చెందిన 20 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. తమ సంస్థకు చెందిన పలు విమానాలకు సోమవారం సోషల్ మీడియా ద్వారా బెదిరింపులు వచ్చినట్లు ఎయిర్ ఇండియా అధికార ప్రతినిధి చెప్పారు. నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులను వెంటనే అప్రమత్తం చేసినట్లు చెప్పారు. అన్ని భద్రతా నియమాలను తుచ తప్పకుండా పాటించినట్లు వెల్లడించారు. ఇటువంటి ఉత్తుత్తి బెదిరింపులకు సంబంధించి నిబంధనల మేరకు వ్యవహరించాలని, వాటిని తొలగించాలని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను కేంద్ర ఐటీ శాఖ కోరింది.

వచ్చే ఏడాది జనగణన

2025 మొదట్లో షురూ.. 2026లో పూర్తి!



న్యూఢిల్లీ, అక్టోబరు 28: చాలాకాలంగా ఆలస్యమవుతూ వస్తున్న జనగణన ప్రక్రియను కేంద్రం వచ్చే ఏడాది మొదట్లోనే చేపట్టి.. 2026కల్లా జాతీయ జనాభా పట్టికను నవీకరించి, ఆ వివరాలను ప్రజలకు వెల్లడించే అవకాశం ఉన్నట్టు సమాచారం. అయితే, విపక్షాలు డిమాండ్ చేస్తున్న కుల గణన విషయంపై మాత్రం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో జనగణన చక్రం 2035, 2045.. అలా మారుతుందని ఆ వర్గాలు వివరించాయి. వచ్చే ఏడాది చేపట్టే జనగణన పూర్తయ్యాక.. 2026లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశం ఉంది. కాగా.. 1951 నుంచి ప్రతి పదేళ్లకొకసారి మనదేశంలో జనగణన జరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే, 2021లో కరోనా కారణంగా జరగలేదు. అప్పట్నుంచీ ఆలస్యమవుతూ వస్తోంది. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ సహా పలు పార్టీలు ఈసారి కులగణన కూడా చేపట్టాలని, దాని వల్ల దేశంలో ఓబీసీ జనాభా ఎంతో తెలుస్తుందని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

స్పష్టత ఇవ్వండి..


జనగణనకు సంబంధించిన కసరత్తు మొదలైందన్న వార్తలతోపాటు.. రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియాగా వ్యవహరిస్తున్న మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ పదవీకాలాన్ని 2026 ఆగస్టు దాకా పొడిగించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. జనాభా లెక్కలను సేకరించే ప్రక్రియలో భాగంగా కులగణన చేపడతారా? లేదా? వివిధ రాష్ట్రాల లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించడానికి ఈ సెన్సస్ వివరాలను ఉపయోగించుకుంటారా? అనే రెండు కీలక అంశాలపై స్పష్టత ఇవ్వాలని, ఇందుకోసం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. ఒకవేళ ఈ లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరిపితే అది.. కుటుంబనియంత్రణను సమర్థంగా పాటించిన రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కాదా? అని ఆయన ప్రశ్నించారు.

క్షీణించిన ఖమేనీ ఆరోగ్యం

» తీవ్రమైన కడుపునొప్పి, జ్వరం

» ఆయన పేగుకు శస్త్రచికిత్స!

» ఖమేనీ ఎక్స్ ఖాతా తొలగింపు



టెహ్రాన్, బీరుట్, అక్టోబరు 28: ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఆరోగ్యం క్షీణించిందని ఇరాన్ మీడియా సంస్థలు ఆదివారం కథనాలు ప్రచురించాయి. తీవ్రమైన కడుపునొప్పి, జ్వరంతో బాధపడగా ఇంటి వద్దే ఆయన పేగుకు శస్త్రచికిత్స చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని వెల్లడించాయి. హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లాను ఇజ్రాయెల్ బలగాలు మట్టుబెట్టాక అక్టోబరు నాలుగున టెహ్రాన్ గ్రాండ్ మసీదు నుంచి సందేశమిచ్చినప్పుడు ఖమేనీ ఆరోగ్యంగానే కనిపించారు. మరోవైపు, ఖమేనీ వినియోగిస్తున్న ఖాతాను ఎక్స్ సస్పెండ్ చేసింది. శనివారం తెల్లవారుజామున ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి తర్వాత ఖమేనీ కొత్త ఖాతా తెరిచి హిబ్రూ భాషలో పోస్ట్ పెట్టారు. ఇరాన్‌ను తక్కువ అంచనా వేసి జియోనిస్ట్ పాలన తప్పు చేసిందని, తమకు ఎలాంటి సత్తా ఉందో చూపిస్తామంటూ ఇజ్రాయెల్‌ను బెదిరించేలా ఆయన పోస్ట్ పెట్టారు. ఆ వెంటనే కారణాలేమీ చెప్పకుండానే ఆయన ఖాతాను ఎక్స్ సస్పెండ్ చేసింది. అయితే ఆయన పేరిట ఉన్న మరో అధికారిక ఖాతా యథావిధిగా కొనసాగుతోంది. 2023 అక్టోబరు 7న హమాస్ దాడిని సమర్థించినందుకు నాడు ఖమేనీ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లను మెటా తొలగించింది.

ఇజ్రాయెల్‌కు తగిన రీతిలో బదులిస్తాం

శనివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ జరిపిన దాడిపై ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్పందించారు. తాము యుద్ధం కోరుకోవడం లేదని, అయితే దేశ ప్రజల హక్కులను కాపాడేందుకు తగిన రీతిలో బదులిస్తామని హెచ్చరించారు. అమెరికా అండతోటే ఇజ్రాయెల్ అఘాయిత్యాలకు పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. మరోవైపు ఇజ్రాయెల్ జరిపిన దాడిలో నలుగురు సైనికులు చనిపోయారని ఇప్పటికే ప్రకటించిన ఇరాన్ మరో పౌరుడు కూడా చనిపోయాడని వెల్లడించింది.

43 వేలు దాటిన గాజా మృతులు

2023 అక్టోబరు 7న తమపై హమాస్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ ఏడాదిగా గాజాపై జరుపుతున్న దాడుల్లో మరణించిన వారి సంఖ్య 43 వేలు దాటింది. లక్షమందికి పైగా గాయపడ్డారు. గడచిన 48 గంటల్లో 96 మంది చనిపోయారు. 277 మంది గాయపడ్డారు.

వందమంది హమాస్ మిలిటెంట్ల అరెస్ట్

గాజాలోని కమల్ అద్వాన్ ఆసుపత్రిపై దాడి చేసిన ఐడీఎఫ్ వందమంది హమాస్ మిలిటెంట్లను అరెస్ట్ చేసింది. ఆసుపత్రి నుంచి ఆయుధాలను, కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐడీఎఫ్ ప్రకటించింది.

వీసా లేకుండానే రష్యాకు!

న్యూఢిల్లీ, అక్టోబరు 28: భారతీయులు వీసా లేకుండానే రష్యాలో పర్యటించే సదుపాయం త్వరలో అందుబాటులోకి రానుంది. ఆ మేరకు వచ్చే ఏడాది స్ప్రింగ్ సీజన్(మార్చి) నుంచి ప్రయాణ నిబంధనలను సరళతరం చేసేందుకు భారత్, రష్యా ప్రణాళికలు రూపొందించాయని సోమవారం ఒక ఆంగ్ల దినపత్రిక ప్రచురించింది. వీసా నిబంధనలపై ద్వైపాక్షిక ఒప్పందం చేసుకునేందుకు ఈ ఏడాది జూన్‌లోనే ఇరుదేశాలూ చర్చలు జరిపినట్టు తెలిపింది. భారత్ నుంచి రష్యాకు పర్యాటకుల సంఖ్యను పెంచే లక్ష్యంతో ఈ ఒప్పందం చేసుకున్నట్టు పేర్కొంది. 'ఈ ఒప్పందం వల్ల భారత్ నుంచి రష్యా రాజధానికి వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరగనుంది' అని మాస్కో సిటీ టూరిజం కమిటీ ఛైర్మన్ ఎవ్‌గనీ కోజ్లోవ్ చెప్పినట్టు తెలిపింది. గతేడాది 60 వేల మందికిపైగా భారత్ నుంచి రష్యా రాజధానికి వచ్చారని ఎవ్‌గనీ కోజ్లోవ్ చెప్పారు. ప్రస్తుతం చైనా, ఇరాన్ నుంచి రష్యా పర్యటనకు వెళ్లే వారికి మాత్రమే వీసా రహిత ప్రయాణం అందుబాటులో ఉంది. కాగా, నాలుగు రోజుల్లోనే జారీ అయ్యే ఈ-వీసా రష్యాలో పర్యటించే భారతీయులకు గతేడాది ఆగస్టు నుంచి అందుబాటులోకి వచ్చింది. దీంతో ఆ ఏడాది చివరి ఐదు నెలల్లోనే భారతీయులకు 9,500 ఈ-వీసాలను రష్యా జారీ చేసింది. రష్యా జారీ చేసిన మొత్తం ఈ-వీసాల్లో ఇది 6%. తద్వారా గతేడాది అత్యధిక ఈ-వీసాలు జారీ అయిన తొలి 5దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచింది. ఈ ఏడాది జనవరిలో 1,700 మంది భారతీయులకు ఈ-వీసాలను రష్యా జారీ చేసింది.



ఉక్రెయిన్ - రష్యా చర్చలు

భారత్‌లోనే..

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం ఇవి జరగాలి. ఎందుకంటే యుద్ధం మా భూభాగంలో మాపై జరుగుతోంది' అని తెలిపారు. తమ ఇంధన మౌలిక వసతులపై రష్యా దాడులు.. తమ భూభాగంలోకి చొచ్చుకొస్తుండడం.. శీతాకాలం సమీపిస్తుండడం.. వంటి పరిణామాలు తమ దేశానికి పెను సవాల్‌గా మారాయని చెప్పారు. అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో అమెరికా సహకారంపై అనిశ్చితి నెలకొందని.. డొనాల్డ్ ట్రంప్ విజయం సాధిస్తే తమకు సైనిక సాయం గందరగోళంలో పడుతుందని అన్నారు. తాము రూపొందించిన 'విజయ ప్రణాళిక, నాటో సభ్యత్వం ఇవ్వాలని కోరడం.. రష్యాతో చర్చల్లో బేరసారాల కోసం కాదని చెప్పారు. భవిష్యత్‌లో పశ్చిమ దేశాలు తమ అభిప్రాయం మార్చుకోకుండా ఉండేందుకే ఉక్రెయిన్‌ను నాటోలోకి ఆహ్వానించాలని కోరుతున్నామన్నారు. యుద్ధం ఆగిపోవాలని మోదీ ఊరికే మాటలు చెప్పడం కాదని.. నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈవీల తయారీకి అనంత అనుకూలం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశమయ్యారు. ఆస్టిన్ నగరంలోని టెస్లా కేంద్ర కార్యాలయాన్ని లోకేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఈవీల తయారీ రంగంలో దిగ్గజ సంస్థగా ఉన్న టెస్లా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్(సీఎఫ్ఓ) వైభవ్ తనేజాతో భేటీ అయ్యారు. టెస్లా తన యూనిట్‌ను ఏపీలో స్థాపించే అవకాశాలపై చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులకున్న అవకాశాలు, అమరావతి నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై మంత్రి వివరించారు. ఈవీ తయారీ, బ్యాటరీ ఉత్పత్తుల యూనిట్ల స్థాపనకు అనంతపురం వ్యూహాత్మక కేంద్రమని వెల్లడించారు. బెంగళూరు, చెన్నై నగరాలకు సమీపంలో ఉన్న ఈ జిల్లా పెట్టుబడులు పెట్టేందుకు అనువైన ప్రదేశమని తెలిపారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం

రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నామని, పెట్టుబడులతో రావాలని లోకేశ్ ఆహ్వానించారు. 2029 నాటికి ఏపీలో 72 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తనేజాకు వివరించారు. ఈ లక్ష్య సాధనలో టెస్లా భాగస్వామి కావాలని ఆహ్వానించారు. కియా, హీరో మోటార్స్ వంటి కంపెనీలను చంద్రబాబు రాష్ట్రానికి తీసుకొచ్చారని, ఇప్పుడు ఈవీల తయారీ, రెన్యువబుల్, గ్రీన్ ఎనర్జీ రంగాలపై దృష్టి సారించారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సౌరశక్తి నిల్వ వ్యవస్థలు, ముఖ్యంగా స్మార్ట్ సిటీలు, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం కావాలని టెస్లాను ఆహ్వానించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల అమలులో భాగస్వామ్యం కావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో టెక్నాలజీ పార్కులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి వెంట సీఎంఓ కార్యదర్శి కార్తికేయ మిశ్రా, సాయికాంత్‌వర్మ ఉన్నారు.

ఏవియేషన్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టండి

పెరోట్ గ్రూప్ అండ్ హిల్‌వుడ్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ రాస్ పెరోట్ జూనియర్‌తో డల్లాస్‌లో లోకేశ్ భేటీ అయ్యారు. రియల్ ఎస్టేట్, టెక్నాలజీ, డేటా సెంటర్, ఎనర్జీ రంగాల్లో భిన్నమైన పోర్ట్‌ఫోలియోలను పెరోట్ నిర్వహిస్తున్నారు. పబ్లిక్ ప్రైవేటు ప్రాజెక్టుల్లో భాగస్వామిగా ఉన్నారు. రియల్ ఎస్టేట్, లాజిస్టిక్స్, ఏవియేషన్స్ రంగాల్లో పెరోట్ రూపొందించిన వెంచర్లు అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపాయి. ఇన్నోవేటివ్ రియల్ ఎస్టేట్, పబ్లిక్-ప్రైవేటు ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం కావాలని, ఏపీలో పెట్టుబడులు పెట్టాలని పెరోట్‌ను లోకేశ్ కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాజెక్టులు టెక్సాస్ తరహాలోనే ఏపీలోనూ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయల కల్పన రంగంలో పెట్టుబడులకు అనువైన వాతారణం ఉందని, స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు, పట్టణాల అభివృద్ధిలో సహకారం అందించాలని కోరారు. విశాఖలో ఏవియేషన్ వర్సిటీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని, ఏరోస్పేస్ టెక్నాలజీలో ఏపీ ఆకాంక్షలు నెరవేర్చడం, ఏవియేషన్ హబ్ ఏర్పాటులో సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌ను ఏర్పాటు చేయడానికి భాగస్వామ్యం వహించే అంశాన్ని పరిశీలించాలన్నారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు అవసరమైన ఎకో సిస్టమ్ ఉందన్నారు. హైవేలు, పోర్టులు, పట్టణాభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టే అవకాశాలు పరిశీలించాలని పెరోట్‌ను లోకేశ్ కోరారు.

గనుల శాఖలో కల్లోలం

» నాడు అక్రమాలకు కొమ్ముకాసిన వారిపై చర్యలు

» 13 మందిని సెలవుపై పంపించిన సర్కారు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాడు జగన్ ప్రభుత్వంలో గనుల శాఖలో అక్రమాలకు కొమ్ముకాసిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా 13 మంది అధికారులను తప్పనిసరి సెలవుపై పంపించింది. వీరిలో గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, సూపరింటెండెంట్ కేడర్ అధికారులున్నారు. నాటి గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి పేషీలో పనిచేసిన ఇద్దరు మినరల్ రెవెన్యూ అధికారులను కూడా సెలవుపై పంపించినట్లు తెలిసింది. ఈ పరిణామం గనుల శాఖలో పెద్ద కల్లోలాన్ని రాజేసింది. పక్క అక్రమాలతో సహజీవనం చేసిన నలుగురు అధికారులను వదిలేసి, ఏ తప్పూ చేయని అధికారిపై చర్యలు తీసుకోవడం దుమారం రేపుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం కూటమి ప్రభుత్వం కొలువు తీరిన కొత్తలో గనుల శాఖకు సంబంధించి ఇద్దరు అధికారులను సెలవుపై పంపింది. ఆ ఇద్దరూ దళిత వర్గాలకు చెందినవారు. దీంతో దళితులపైనే చర్యలా? అన్న విమర్శలు వచ్చాయి. ఇప్పుడు రెండో దఫా గట్టిగానే చర్యలు తీసుకున్నారు. ఇసుక, బెరైటీస్, క్వార్ట్జ్, సర్వే రాళ్ల కొనుగోలు, ఇతర అంశాల్లో నాటి జగన్ ప్రభుత్వ పెద్దల దోపిడీకి అడ్డగోలుగా సహకరించారని, అందినకాడికి దండుకున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో 16 మంది అధికారులపై విచారణ జరిపి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం గనుల శాఖను ఆదేశించింది. ఆ 16 మందిపై వచ్చిన ఆరోపణలు తీవ్రమైనవి. అందులో ఆరుగురు అధికారులు వెంకటరెడ్డితో పాటు అరెస్ట్ కావాల్సిన వారే ఉన్నారు. కానీ తెరవెనక ఏం జరిగిందో కానీ విచారణను పక్కన పెట్టేశారు. వ్యూహాత్మకంగా వారిని సెలవుపై పంపించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఈ చర్యలకు ముందు ఆ 16 మంది జాబితాలో కొత్తగా ఓ అధికారి పేరును చేర్చి, నలుగురి పేర్లను తొలగించారని తెలిసింది. జగన్ ప్రభుత్వంలో వివిధ హోదాల్లో పనిచేసిన 12మంది అధికారులను సెలవుపై పంపించారు. వివాదాలతో సంబంధం లేని సాయిరామ్ సింగ్ అనే అధికారిని కూడా సెలవుపై పంపించారు. ఉద్దేశపూర్వకంగానే ఎవరో ఆయన పేరును చేర్చి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వెంకటరెడ్డితో పాటు తీవ్ర ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొన్న నలుగురు అధికారులను ఈ జాబితా నుంచి మినహాయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఇంట్లో పేలిన బాణసంచా


పేలుడు ధాటికి ధ్వంసమైన ఇల్లు

పేలుడు ధాటికి కుప్పకూలిన పెంకుటిల్లు

ఒకరు దుర్మరణం.. ముగ్గురికి గాయాలు

మండపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి కోసం ఇంట్లో నార బాంబులు తయారు చేస్తుండగా పేలుడు సంభవించి ఒకరు మృతిచెందగా ముగ్గురు గాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన కల్లి వెంకటకృష్ణ (30) తన ఇంట్లో భార్య జయశ్రీతో కలిసి దీపావళికి సొంత అవసరం నిమిత్తం నార బాంబులు తయారు చేస్తున్నాడు. పెంకుటిల్లులోని ఒక పోర్షన్‌లో వెంకటకృష్ణ, అతని భార్య బాంబులు తయారు చేస్తుండగా, మరో పోర్షన్‌లో అతని తల్లిదండ్రులు ఉన్నారు. ఈ సమయంలో మందుగుండు ఒక్కసారిగా పేలింది. పేలుడు ధాటికి ఇంటిపైకప్పు కూలిపోయింది. వెంకటకృష్ణ, జయశ్రీ తీవ్ర గాయాలపాలవ్వగా, తల్లిదండ్రులు స్వల్పంగా గాయపడ్డారు. వారిని మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వెంకటకృష్ణ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జయశ్రీని మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటకృష్ణ, జయశ్రీ దంపతులకు ఏడాది బాబు ఉన్నాడు. ప్రమాద సమయంలో బాబు ఇంటి బయట ఆడుకోవడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

ఆ వైసీపీ డీఎస్పీపై చర్యలు తీసుకోండి

సీఎం పర్యటన వివరాలు విపక్ష నేతలకు అందిస్తున్నారు.. బుర్రా మధుసూధన్ అనుచరులు మా పొలం కంచె తొలగించారు

కేబుల్ ఆపరేటర్లను ఆదుకోండి.. టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ


వినతులు స్వీకరిస్తున్న మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, బుచ్చి రాంప్రసాద్

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వైవీ సుబ్బారెడ్డి సహకారంతో డీఎస్పీగా పదోన్నతి పొంది.. పేదల ఇళ్ల స్థలాల కబ్జా, కాల్‌మనీ వ్యాపారిలా ప్రజలను ఇబ్బందులకు గురిచేసి.. వైసీపీ తొత్తుగా వ్యవహరించిన ఓ పోలీసు అధికారిపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆ అధికారే ఇప్పుడు సీఎం చంద్రబాబు పర్యటనలు, ఇతర మంత్రులు, అధికారుల సమాచారాన్ని వైసీపీ నేతలకు అందజేస్తున్నారని.. ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన జె సుధీర్ టీడీపీ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. అర్జీ స్వీకరించిన మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, బుచ్చిరాంప్రసాద్.. విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో అర్జీలు స్వీకరించారు. తాను ఎస్సీ కులానికి చెందినవాడినని, నాటి కనిగిరి వైసీపీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్, ఆయన అనుచరులు బలవంతంగా తన పొలం కంచె తొలగించి దౌర్జన్యానికి దిగారని ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలం నల్లమడుగుకు చెందిన శామ్యూల్ నేతల దృష్టికి తీసుకెళ్లారు. కేబుల్ నెట్‌వర్క్ ఆపరేటర్లను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట మండలం వాడపాలెంకు చెందిన నరసింహమూర్తి విజ్ఞప్తి చేశారు. తెనాలి మండలంలోని సంగమేశ్వర స్వామి దేవస్థాన భూములను వైసీపీ నేతలు కబ్జా చేశారని.. రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు వారికి సహకరించారని తెనాలికి చెందిన కామేశ్వరరావు ఫిర్యాదు చేశారు. భూమి ఆక్రమణపై బీజీవీ కండ్రిక గ్రామస్తులు బిట్రగుంట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని నెల్లూరు జిల్లాకు చెందిన కోటయ్య తెలిపారు. ప్రకాశం జిల్లా సీఎస్ పురం నుంచి నెల్లూరుకు బతుకుదెరువు కోసం వెళ్తే.. తమ భూమిని కబ్జా చేశారని, తమకు న్యాయం చేయాలని సోంపల్లి బుజ్జినారాయణ కోరారు. రజకుల అభివృద్ధికి జీవో 25 ప్రకారం రజక సంఘం కమిటీలు ఏర్పాటు చేసి తమ సంక్షేమానికి తోడ్పడాలని ఏపీ రజక ఎస్సీ సాధన సమితి అధ్యక్షుడు నందవరం శ్రీనివాసులు వినతి పత్రం సమర్పించారు.

పరాకాష్ఠకు జగన్ అధికార పిచ్చి

» శ్రీనివాసరెడ్డి

జగన్ అవినీతి, ధన దాహం, అధికార పిచ్చి పరాకాష్ఠకు చేరాయని శ్రీనివాసరెడ్డి విలేకరుల సమావేశంలో విమర్శించారు. 2004లో జగన్ ఐటీ డిక్లరేషన్ కేవలం రూ.9 లక్షలేనని, నేడు జగన్ ఆస్తులు రూ.8 లక్షల కోట్లని.. ఇవన్నీ ఎలా వచ్చాయో ఆయన సమాధానం చెప్పాలన్నారు.

వైసీపీ మున్సిపల్ చైర్‌పర్సన్ కోడలు ఆత్మహత్యాయత్నం

» పరిస్థితి విషమం.. కేసు నమోదు చేయని పోలీసులు

అమలాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ కోడలు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కోడలు విషమ పరిస్థితిలో ఉన్నప్పటికీ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశానికి చైర్‌పర్సన్ హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. అల్లవరం మండలం బోడసకుర్రులో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యానాగేంద్రమణి కుమారుడు నరేంద్రకుమార్ కుటుంబంతో నివాసం ఉంటున్నారు. రాజానగరానికి చెందిన బొంతు సత్తిబాబు కుమార్తె సాయిలలితతో 2017 ఏప్రిల్‌లో ఆయనకు వివాహమైంది. తరచూ భార్యాభర్తల మధ్య వివాదాలు రేగుతున్నాయి. సోమవారం కూడా సాయిలలిత, నరేంద్రకుమార్ మధ్య వాగ్వాదం జరిగింది. నరేంద్రకుమార్ పిల్లలను తీసుకుని బయటకు వెళ్లారు. ఆ సమయంలో సాయిలలిత తన స్నేహితురాలికి ఫోన్ చేసి, భర్త పెట్టే ఇబ్బందులను చెప్పి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్నేహితురాలు ఇచ్చిన సమాచారంతో పక్క ఫ్లాట్లలో ఉన్నవారు ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. అయితే ఈ విషయాలన్నీ తెలిసినప్పటికీ మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యానాగేంద్రమణి సోమవారం ఉదయం జరిగిన కౌన్సిల్ సమావేశానికి హాజరు కావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. లలిత భర్త నరేంద్రకుమార్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈ విషయంపై అల్లవరం ఎస్‌ఐను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆత్మహత్యాయత్నంపై కేసు ఉండదని, ఆమె కోలుకున్న తర్వాత స్టేట్‌మెంట్ రికార్డు చేస్తామన్నారు.

టీటీడీ అదనపు ఈవోను తక్షణమే తొలగించాలి



» శ్రీనివాసానంద సరస్వతి

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరిని కూటమి ప్రభుత్వం తక్షణమే తొలగించాలని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ కంపెనీలు, అర్హతలు లేని వ్యక్తులకు ప్రొటోకాల్ దర్శనాల వెనుక వెంకయ్య చౌదరి భారీ అవినీతి ఉందని ఆరోపించారు. కనీసం గోవింద నామాలు తెలియని వ్యక్తి అని, మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలంటే ఆయనకు లెక్కలేనితనమన్నారు. తిరుపతిలో 26వ తేదీన 300 మంది స్వామీజీలు, మాతాజీలు పలురాష్ట్రాల నుంచి వచ్చి జాతీయ హిందూ ధార్మిక సదస్సు నిర్వహించారని, 27వ తేదీన శ్రీవారి దర్శనానికి రూ.300 టికెట్లతో దర్శనం కల్పించాలని కోరితే అదనపు ఈవో అమర్యాదగా మాట్లాడారన్నారు. కుట్రపూరితంగా గత ప్రభుత్వం కనుమరుగు చేసిన తిరుమల జేఈవో పోస్టును కూటమి ప్రభుత్వం పునరుద్ధరించి, హిందూమతం మీద పూర్తి విశ్వాసం ఉన్న ఐఏఎస్ అధికారిని తక్షణమే నియమించాలన్నారు.

అడిగినన్ని టిక్కెట్లు ఇవ్వలేదని ఆరోపణలు: టీటీడీ

తిరుమల, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): టీటీడీ అధికారులపై శ్రీనివాసానంద సరస్వతి ఆరోపణలు సరికావని ఓ ప్రకటనలో టీటీడీ ఖండించింది. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తాము అడిగిన దర్శనం టికెట్లు ఇవ్వలేదని, తమను అవమానించారని శ్రీనివాసానంద సరస్వతి చేసిన ఆరోపణలపై టీటీడీ స్పందించింది. 'వాస్తవంగా స్వామీజీ 50 మందికి వీఐపీ బ్రేక్ దర్శనం, 550 మందికి ప్రత్యేక ప్రవేశ దర్శనంతో పాటు తిరుమలలో వసతి కల్పించాలని టీటీడీ అధికారులను కోరారు. ఆ మేరకు వసతి కల్పించేందుకు అంగీకరించాం. సాధారణంగా తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఆ రోజున దర్శనం ఇంతమందికి ఇవ్వడం సాధ్యం కాదని, 600 మంది సభ్యుల సంఖ్యను తగ్గించాలని అదనపు ఈవో కోరారు. అయితే స్వామీజీ మాత్రం 600 మందికి దర్శనం కల్పించాలని పట్టుబట్టారు. తాము అడిగినంతమందికి శ్రీవారి దర్శనం టికెట్లు ఇవ్వలేదనే కోపంతో మీడియా సమక్షంలో టీటీడీ అధికారిని కించపరుస్తూ మాట్లాడటం స్వామీజీ స్థాయికి తగదని తెలియజేస్తున్నాం' అంటూ ఆ ప్రకటనలో టీటీడీ పేర్కొంది.

ముంబై విమానానికి బాంబు బెదిరింపు

» టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ల్యాండింగ్.. క్షుణ్ణంగా తనిఖీ

గోపాలపట్నం (విశాఖపట్నం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వచ్చి, ఇక్కడి నుంచి ముంబై బయలుదేరిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు కాల్ రావడంతో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ల్యాండ్ అయింది. ఆగంతకుడి నుంచి హైదరాబాద్ విమానాశ్రయానికి కాల్ వచ్చింది. దాంతో వారు విశాఖ విమానాశ్రయ అధికారులను అప్రమత్తం చేశారు. ఇక్కడి అధికారులు పైలట్‌కు సమాచారం అందించి, విమానాన్ని ల్యాండ్ చేయించారు. భద్రతాదళ సిబ్బంది ప్రయాణికులందరినీ కిందకు దించి, విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి బాంబు లేదని నిర్ధారించుకున్న తరువాత సాయంత్రం ఆరు గంటల సమయంలో విమానం తిరిగి ముంబై బయలుదేరింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కాలుష్యం-రాజకీయం

దీపావళి రాకముందే ఢిల్లీలో వాయుకాలుష్యం తీవ్రంగా ఉంది. ఢిల్లీ వాసులు ఏటా అనుభవించే నరకమే, చూసే రాజకీయమే ఎప్పటిలాగా కొనసాగుతోంది. కేజ్రీవాల్ స్థానంలో కూర్చున్న ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశి తనకు వీలైన చర్యలేవో తీసుకుంటున్నారు. ఢిల్లీ ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థలు ఎంతో హడావుడి చేస్తున్నాయి. ఆ కలుషితవాతావరణంలో కాస్తంత హెచ్చుతగ్గులు కనిపిస్తున్నప్పుడల్లా ఏ రోజుకారోజు ప్రజలు సంతోషమో, దుఃఖమో పడవలసి వస్తున్నది. దీపావళి సమీపిస్తున్నప్పటికే కాలుష్యం దారుణంగా పెరిగిపోవడం ఢిల్లీ వాసులను ఆందోళనకు గురిచేస్తోంది.

వారంరోజుల వ్యవధిలోనే గాలినాణ్యత బాగా పడిపోవడంతో, వాలంటీర్లను మళ్ళీ ప్రభుత్వం రంగంలోకి దింపబోతున్నది. కాలుష్యాన్ని అరికట్టడానికికంటూ ఉన్న పదివేలమందిని గత ఏడాది తొలగించిన ప్రభుత్వమే ఇప్పుడు మళ్ళీ వారిని నియమించుకొని బాధ్యతలు అప్పగించబోతోంది. భారీ వాహనాల రాకపోకలను నియంత్రించడం, అన్ని రకాల నిర్మాణకార్యక్రమాలను నిలిపివేయడం, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ మాత్రమే వినియోగించేట్టుగా ప్రజలపై ఒత్తిడితేవడం వంటి చర్యలు ఎప్పటిలాగానే ఇప్పుడూ ఢిల్లీ ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఇక, టపాసులు కాల్చడం మీద ఢిల్లీలో ఎప్పటినుంచో నిషేధం ఉంది. ఆరంభంలో గ్రీన్ క్రాకర్స్, అంటే తయారీలో బేరియం లవణాలను వినియోగించని టపాసులకు అనుమతి ఇచ్చినప్పటికీ, ఆ తరువాత ఆ మినహాయింపు కూడా దుర్వినియోగం కావడంతో పూర్తి నిషేధం వచ్చిపడింది. పాలకుల చొరవవల్లనో, న్యాయస్థానాల ఆదేశాలవల్లనో, చేజేతులా వాతావరణాన్ని కలుషితం చేయడమెందుకన్న భావన వల్లనో, దేశరాజధానివాసుల్లో టపాసుల మోజు ఇటీవలి సంవత్సరాల్లో బాగా తగ్గిపోయింది. అయినప్పటికీ, ఢిల్లీ రాజధాని ప్రాంతంలోకి టపాసుల సరఫరా ఎంతోకొంత మేరకు అక్రమంగా సాగుతూనే ఉంది. దీపావళి నాడు వాటిని కాల్చి ఆనందించేవారిని నిరుత్సాహపరచేందుకు, వారిలో చైతన్యం పెంచేందుకు 'దియాజలావ్' కార్యక్రమాన్ని ఆరంభించబోతున్నట్టు ఢిల్లీ పర్యావరణ మంత్రి ప్రకటించారు. రాబోయే పదిహేనురోజుల్లో కాలుష్యం మరింత పెరుగుతుంది కనుక, జనం టపాసులను పూర్తిగా దూరం పెట్టాలన్నారు ఆయన. అంతవరకూ బాగున్నది కానీ, ఇంతటి తీవ్రమైన పరిస్థితులను, సందర్భాలను సైతం రాజకీయం చేయడమే సముచితంగా లేదు. వాయుకాలుష్యాన్ని నియంత్రించడానికి తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలన్నింటినీ ఆయన గొప్పగా చెప్పుకోవడం తప్పుకాదు. కానీ, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలనుంచి, అంటే, బీజేపీ పాలిత పొరుగురాష్ట్రాలనుంచి టపాసుల స్మగ్లింగ్ భారీగా జరుగుతోందని ఈ ఆప్ మంత్రి ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వాలు అంటూ కేంద్రాన్ని కూడా కలిపి విమర్శించారు. టపాసుల స్మగ్లింగ్ నివారించాల్సిందిగా లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఓ లేఖకూడా రాశారు. ఢిల్లీ కాలుష్యానికి యూపీ, హర్యానా రైతులు పంటపొలాల్లో వ్యవసాయ వ్యర్థాలు పెద్ద ఎత్తున తగలబెట్టడమే కారణమని ముఖ్యమంత్రి ఆతిశీ ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. ఇది ఎప్పటి నుంచో ఉన్న సమస్య, ఇందులో అసత్యమేమీ లేదు. కానీ, ఢిల్లీ ప్రజల అనారోగ్యానికి బీజేపీ పాలిత రాష్ట్రాలే కారణమంటూ ఆమె వ్యాఖ్యానించడం సరికాదు. ఆప్ పాలిత పంజాబ్ రాష్ట్రంలో వ్యవసాయ వ్యర్థాలను తగలబెట్టడం గణనీయంగా తగ్గిందని కూడా ఆమె సమర్థించుకున్నారు. ఆప్ మంత్రులంతా అవే మాటలు వల్లిస్తున్నారు. సహజంగానే బీజేపీ నాయకులు ఈ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందిస్తున్నారు. రెండుపార్టీల నాయకులు కాలుష్యం కేంద్రంగా విమర్శలు ప్రతివిమర్శలు చేసుకుంటూ రాజకీయ కాలుష్యాన్ని మరింత పెంచేస్తున్నారు.

గ్యాస్ చాంబర్‌లాగా మారిపోయిన ఢిల్లీలో ప్రజలు పలు ఆరోగ్య సంబంధమైన సమస్యలతో బాధపడుతున్నారు. విపరీతమైన వాయు కాలుష్యం వారిని నిలువనివ్వడం లేదు. ప్రధానంగా వృద్ధులను, పిల్లలను దగ్గు, గొంతునొప్పి, ఆయాసం, ఊపిరాడకపోవడం వంటి సమస్యలు వేధిస్తున్నాయి. కళ్ళు, ముక్కు మండిపోతుంటే వాయురూపంలో ఉన్న విషాన్ని దిగమింగుతున్నట్టుగా వారికి అనిపిస్తోంది. కేంద్రప్రభుత్వం సహాయ సహకారాలతో ఢిల్లీ, దాని పొరుగు రాష్ట్రాలు కలసికట్టుగా కాలుష్యనివారణకు కృషిచేయాల్సిన తరుణమిది. ఈ కష్ట కాలంలో పార్టీలకు అతీతంగా నిలిచి, ప్రజల మేలుచేకూర్చాల్సినవారు వాతావరణాన్ని మరింత విషపూరితం చేయడం సముచితం కాదు.

భారత్–జర్మనీ హరిత భాగస్వామ్యం

జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ ఈ నెల 25, 26, 27 తేదీలలో భారత్‌లో పర్యటించిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలను సమగ్రంగా పెంపొందించుకునే లక్ష్యంతో విస్తృత చర్చలు జరిపారు. ఆసియా–పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్ 2024 సదస్సును ఇరువురూ సంయుక్తంగా ప్రారంభించారు. 7వ ఇండో–జర్మన్ కన్సల్టేషన్స్‌ను ఆరంభించారు.

ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ నాయకత్వంలో జర్మన్ కేబినెట్ ఈ నెల 16న సమున్నత ఆశయాలు, లక్ష్యాలతో కూడిన 'ఫోకస్ ఆన్ ఇండియా' వ్యూహాన్ని ఆమోదించింది. ఇది భారత్–జర్మనీ సంబంధాలలో గుణాత్మక మార్పులకు దోహదం చేయగలదనే ఆశాభావం ఇరు దేశాలలోనూ వ్యక్తమవుతోంది. భారత్–జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఈ ఏడాదితో 25 సంవత్సరాలు పూర్తవుతాయని, రాబోయే 25 ఏళ్లలో ఈ భాగస్వామ్యం మరిన్ని శిఖరాలను అధిరోహించి, మరింత ఔన్నత్యాన్ని సంతరించుకోగలదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రెండు శక్తిమంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థలు, అగ్రగామి ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ శ్రేయస్సుకు పరస్పరం ఎలా సహకరించుకోగలవో 'ఫోకస్ ఆన్ ఇండియా' వ్యూహ ప్రణాళిక విశదం చేస్తుందని ఆయన అన్నారు.



భారత్–జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యంలో, 2022లో ఇరుదేశాలు ఆమోదించిన భారత్–జర్మనీ హరిత, సుస్థిరాభివృద్ధి భాగస్వామ్యం ఒక ప్రధాన అంతర్భాగంగా ఉన్నది. ఈ హరిత భాగస్వామ్యంలో భాగంగా భారత్‌లో ఇంధన పరివర్తనకు గాను జర్మనీకి చెందిన కెఎఫ్‌డబ్ల్యు బ్యాంక్ 100 కోట్ల యూరోల ఆర్థిక సహాయాన్ని అందించింది. ఫోటోవోల్టాయిక్ సిస్టమ్స్, పవర్‌లైన్స్, ఓపెన్ స్పేస్ ఫెసిలిటీస్‌ను అభివృద్ధిపరిచేందుకు ఈ నిధులను మదుపు చేశారు.

ధరిత్రి జీవ వైవిధ్యాన్ని, వాతావరణాన్ని సంరక్షించడంలోను ఐక్యరాజ్యసమితి 2020 ఎజెండా నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పరిపూర్తిలోను భారత్ ఒక కీలక పాత్ర నిర్వహించిందని 'ఫోకస్ ఆన్ ఇండియా' వ్యూహ ప్రణాళిక మున్నుడి పేర్కొన్నది. అంతర్జాతీయ న్యాయ నియమాలు, శాసనవిహిత అంతర్జాతీయ వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న ప్రాంతంలో భారత్ ఒక స్థిరీకృత శక్తిగా ఉన్నదని ఆ వ్యూహ పత్రం పేర్కొంది. జర్మనీకి భారత్ నిపుణ కార్మిక శక్తిని విశేష స్థాయిలో సమకూర్చుతుందని కూడా 'ఫోకస్ ఆన్ ఇండియా' ప్రశంసించింది.

భారత్–జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యంలో, 2022లో ఇరుదేశాలు ఆమోదించిన భారత్–జర్మనీ హరిత, సుస్థిరాభివృద్ధి భాగస్వామ్యం ఒక ప్రధాన అంతర్భాగంగా ఉన్నది. ఈ హరిత భాగస్వామ్యంలో భాగంగా భారత్‌లో ఇంధన పరివర్తనకు గాను జర్మనీకి చెందిన కెఎఫ్‌డబ్ల్యు బ్యాంక్ 100 కోట్ల యూరోల ఆర్థిక సహాయాన్ని అందించింది. ఫోటోవోల్టాయిక్ సిస్టమ్స్, పవర్ లైన్స్, ఓపెన్ స్పేస్ ఫెసిలిటీస్‌ను అభివృద్ధి పరిచేందుకు ఈ నిధులను మదుపు చేశారు.

ఈ హరిత భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లే లక్ష్యంతో ఇటీవల గుజరాత్‌లోని గాంధీనగర్‌లో 'రి–ఇన్వెస్ట్' పునరుద్ధరణీయ ఇంధన మదుపుదారుల సమావేశం నొకదాన్ని నిర్వహించారు. జర్మనీతో సహా పలుదేశాల ఉన్నత స్థాయి రాజకీయ, పారిశ్రామిక ప్రతినిధులు ఆ సదస్సులో పాల్గొన్నారు. 'భారత్ ఒక అభివృద్ధి చెందుతున్న దేశమే అయినప్పటికీ తొమ్మిదేళ్ల క్రితం పారిస్ వాతావరణ సదస్సు నిర్దేశించిన వాతావరణ పరిరక్షణ లక్ష్యాల పరిపూర్తిలో ముందంజలో ఉందని' ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన ప్రారంభోపన్యాసంలో అన్నారు. హరిత పరివర్తనను ఒక ప్రజా ఉద్యమంగా భారత్ పరిగణిస్తుందని అంటూ పిఎమ్ సూర్యఘర్ మఫ్త్ బిజలి యోజనతో భారత్‌లో ప్రతి గృహమూ ఒక విద్యుత్ ఉత్పత్తిదారుగా రూపొందనున్నదని నరేంద్ర మోదీ అన్నారు. 'ఇంధన పరివర్తన లక్ష్యాలను భారత్ సాధించగలిగితే అంతిమంగా సమస్త ప్రపంచమూ లబ్ధి పొందుతుందని జర్మన్ ప్రభుత్వ ఆర్థిక సహకార మంత్రి స్వెన్జ షుల్జె అన్నారు. 140 కోట్ల మందికి పైగా ఉన్న భారతీయులు తమ విద్యుత్ అవసరాలను పవన, సౌరశక్తి నుంచి సమకూర్చుకోగలిగినప్పుడే వాతావరణ మార్పు సంక్షోభం నిలిచిపోగలదని జర్మన్ మంత్రి అన్నారు.

భారత్-జర్మనీ హరిత భాగస్వామ్యంలో భాగంగా వాతావరణ మార్పు సంబంధిత అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక పాలనా సంస్థలు, మరీ ముఖ్యంగా పౌర సమాజ సంస్థలతో ప్రభావశీల, పారదర్శక చర్చలు జరపవలసిన అవసరమున్నది. శిలాజ ఇంధనాల వినియోగం వల్ల వాతావరణ సంక్షోభం ఏర్పడుతున్న నేపథ్యంలో ఇంధన వినియోగంలో మౌలిక మార్పులు రావలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆ మార్పులు కర్బన ఉద్గారాలు సాధ్యమైనంత తక్కువ స్థాయిలో ఉండేందుకు తప్పక దోహదం చేయాలి. ఇందుకు అనేక రంగాలలో ముఖ్యంగా ఇంధన ఉత్పత్తి, చలనశీలత, ఆహారోత్పత్తి, చిన్న పరిశ్రమలు, గృహ అవసరాలకు ఇంధన వినియోగం, మరీ ముఖ్యంగా జీవన శైలీ రీతుల్లోను మౌలిక మార్పులు సాధించవలసిన అవసరమున్నది. ఇంధన వ్యవస్థల పరివర్తనలో పౌరులు చొరవతో కీలకపాత్ర వహించడం చాలా ముఖ్యం.

పునరుద్ధరణీయ ఇంధన ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా ప్రథమ స్థానంలో ఉండగా జర్మనీ ద్వితీయ స్థానంలో ఉన్నది. భారత్ ఈ విషయంలో జర్మనీకి దరిదాపుల్లో ఉన్నది. అయితే జర్మన్ విద్యుత్ వినియోగదారులు ప్రొజ్యూమర్స్ (ఇంధన వినియోగదారులే ఇంధనాన్ని ఉత్పత్తి చేసుకునేవారుగా ఉండడం)గా పరిణమించడం అంతకంతకూ అధికమవుతోంది. అంతే కాదు సమష్టిగా ఇంధనాన్ని ఉత్పత్తి చేసుకునే కార్యకలాపాలలో భాగస్వాములు అవుతున్నారు. జర్మనీలో ఇప్పుడు 847 ఇంధన సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 2,20,000 మంది పౌరులు భాగస్వాములుగా ఉన్నారు. ఈ ఇంధన సహకార సంఘాలలో 80 శాతానికి పైగా ఫోటో వొల్టాయిక్ వ్యవస్థలను నిర్వహిస్తున్నారు ఈ ఇంధన సహకార సంఘాలు 2020 సంవత్సరంలో 8.8 టెరావాట్ హరిత విద్యుత్‌ను ఉత్పత్తి చేశాయి.

◆ రమేష్ చెన్నమనేని
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు

భారతీయ దృక్కోణంలో శ్వేతసౌధ పోటీ

నవంబర్ 5.. సరిగ్గా వారం రోజులు ఉంది. ఆ రోజున ప్రపంచ పరిణామాలను అమితంగా ప్రభావితం చేసే నిర్ణయాన్ని అమెరికా ప్రజలు తీసుకోనున్నారు. అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికల గురించి నేను ప్రస్తావిస్తున్నాను. అవును, ప్రపంచ అగ్రరాజ్య ప్రభుత్వాధినేతగా ఎవరు ఎన్నికవనున్నారు? ఇదే సర్వత్రా అందరూ ఆసక్తి దాయకంగా, ఉత్కంఠభరితంగా చర్చించుకుంటున్న అంశం. డెమొక్రాట్లు, రిపబ్లికన్లు మధ్యనే దోబూచులాడుతూ ఉండే ఈ అత్యున్నత, మహా శక్తిమంతమైన అధ్యక్ష పీఠం ఈసారి ఎవరికి దక్కనున్నది? ఈ రెండు పార్టీలు కూడా తమ తమ సంప్రదాయ సిద్ధాంత భావజాలం నుంచి కొద్దిగా పక్కకు జరిగి, కొత్త ఓటర్లను కూడా తమకు అనుకూలంగా మలుచుకోవాలనే దృష్టితో వ్యవహరిస్తున్న సమయంలో విజయంపై అనిశ్చితి నెలకొని ఉంది. గతంలో ఎన్నడూ లేనంత పోటాపోటీగా ఈ దఫా అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ఎవరు విజయం సాధిస్తారనేది– కేవలం ఆ దేశ ప్రజలకు మాత్రమే కాదు, తమ భవిష్యత్తు పట్ల ఎన్నో ఆశలను అమెరికాతో ముడిపెట్టుకుంటున్న కొన్ని లక్షల మంది భారతీయులు, ప్రత్యేకించి తెలుగు యువతరం కుటుంబాలకు కూడా చెందిన వ్యవహారం!



వ్యక్తిగా డొనాల్డ్ ట్రంప్ మీద ఎలాంటి అభిప్రాయాలు, పలుచన భావం ఉన్నప్పటికీ గతంలో ఆయన అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అనుసరించిన సరళీకృత ఆర్థిక విధానాల పట్ల అందరికీ ఏకీభావం ఉంది. ట్రంప్ మళ్లీ అధ్యక్షుడు అయితే తమకు ప్రధాన ఆలంబనగా ఉన్న ఐటీ రంగం తిరిగి గాడిన పడి పరుగులు పెడుతుందని అమెరికాలోని భారతీయులు నమ్ముతున్నారు. జాబ్ మార్కెట్ పడిపోవడానికి గత నాలుగు సంవత్సరాలుగా డెమొక్రాట్లు అధికారంలో ఉండడమే కారణమని భావిస్తున్న భారతీయులూ ఎంతోమంది ఉన్నారు.

సంప్రదాయంగా భారతీయ అమెరికన్లు డెమొక్రాట్ పార్టీకి అనుకూలంగా ఉంటారు. ఇప్పుడు ఈ పరిస్థితులు మారుతున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య సన్నిహిత స్నేహ సంబంధాలు ఉన్నాయి. ఇరువురి పాలన కాలంలో భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలలో సంభవించిన అనేక పరిణామాల నేపథ్యంలో నేపథ్యంలో ఈ సారి ఏకపక్షమైన మొగ్గు డెమొక్రాట్ల వైపు లేదు. 'ట్రంప్ ఈజ్ మై ఫ్రెండ్' అని ప్రకటించిన మోదీ అమెరికాలోని భారతీయ సమాజాన్ని ఎంతో కొంత ప్రభావితం చేయగలరు. ఆయనను అమితంగా ఆరాధించే అమెరికాలోని ఉత్తరాది భారతీయులు ట్రంప్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా వ్యాపార రంగంలో ఎక్కువగా ఉండే గుజరాతీలు నరేంద్ర మోదీ మీద అభిమానంతో ట్రంప్‌కు మద్దతు పలుకుతున్నారు. సాధారణంగా మధ్యతరగతి, పేద వర్గాలు డెమొక్రాట్ల వైపు ఉంటారు. భారతీయుల సంప్రదాయ మొగ్గు అటువైపు ఏర్పడడానికి కారణం కూడా అదే. అయితే ఇటీవలి కాలంలో ప్రవాస భారతీయుల్లో సంపన్నులు పెరుగుతున్నారు. వీరు అమెరికన్ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వాన్ని కోరుకుంటారు. మొగ్గు రిపబ్లికన్ల వైపు మారడానికి ఇది ఒక కారణం. భారతీయుల్లో ప్రత్యేకించి డాక్టర్లు, ఐటీ రంగంలో ఉన్న వారు, పారిశ్రామికవేత్తలు రిపబ్లికన్ల వైపు మొగ్గే అవకాశం కనిపిస్తోంది. వ్యక్తిగా ట్రంప్ మీద ఎలాంటి అభిప్రాయాలు, పలుచన భావం ఉన్నప్పటికీ గతంలో ఆయన అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అనుసరించిన సరళీకృత ఆర్థిక విధానాల పట్ల అందరికీ ఏకీభావం ఉన్నది. డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అధ్యక్షుడు అయితే అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందనే విశ్వాసం చాలా మందిలో ఉన్నది. ఇప్పుడున్న సంక్షోభ పరిస్థితులు తొలగిపోతాయని నమ్ముతున్నారు. భారతీయులకు సంబంధించినంత వరకు ప్రధానంగా ఆధారపడే ఐటీ రంగం తిరిగి గాడిన పడి పరుగులు పెడుతుందని నమ్ముతున్నారు.

తెలుగువారి అభిప్రాయాలూ భిన్న రీతుల్లో ఉన్నాయి. సంప్రదాయిక డెమొక్రాట్ అనుకూలత పలచబడింది. కొన్ని వర్గాలు మాత్రం ట్రంప్ అధ్యక్షుడు అయితే అమెరికన్ ఎకానమీ బాగుపడుతుందని, జాబ్ మార్కెట్ మళ్లీ పుంజుకుంటుందనే ఆశతో ఉన్నారు. కేవలం తెలుగువారే కాదు.. మొత్తంగా అమెరికాలోని భారతీయ సమూహాన్నే పరిగణనలోకి తీసుకున్నప్పుడు.. ఇక్కడి అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసే స్థాయిలో మన బలం లేదు. సమస్త భారతీయ ఓటర్లు 1 శాతం కంటే తక్కువ మందే ఉంటారు. వారందరూ కూడా కచ్చితంగా ఓటింగుకు వస్తారనే నమ్మకం లేదు. ఇటీవలి కాలంలో అమెరికాలో బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారతీయ సమాజం ఓట్ల పరంగా గెలుపును శాసించలేకపోవచ్చు గానీ.. పార్టీలకు ఆర్థిక దన్నుగా నిలవగల స్థితికి చేరుకుంది. అంతో ఇంతో భారతీయ సమాజానికి ఆశావహ పరిణామం ఇది.

భారతీయ సమూహంతో ఉన్న మరో ఇబ్బంది ఏమిటంటే.. అమెరికాలో స్థిరపడిన వారిలో చాలా మందికి అర్హతలు ఉన్నప్పటికీ.. ఓటరుగా నమోదు చేయించుకోరు. ఓటరుగా నమోదు అయిన వారిలో కూడా అనేకమంది ఓటు వేయడానికి వెళ్లరు. కేవలం భారతీయులే కాకుండా.. మొత్తంగా చూసినా ఓటింగ్ శాతం తక్కువగానే ఉంటుంది. తెలుగువాళ్లు ఓటింగును ఏ రకంగానూ ప్రభావితం చేయలేరు. సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటారు. విద్యావంతుల దేశమైన అమెరికాలో సైతం ఓటింగ్ శాతం ఎక్కువ స్థాయిలో నమోదు కాదు. అగ్రరాజ్యం, విద్యావంతులు ఉండే పెద్ద దేశం అనుకునే అంచనాలకు తగినంత ఓటింగ్ జరగదు. తమ ఓటు కేవలం దేశభవిష్యత్తునే కాకుండా, యావత్తు ప్రపంచాన్నీ శాసించే నిర్ణయం అవుతుందని అమెరికన్ ఓటర్లకు బాగా తెలిసినా ఓటింగ్ శాతం తక్కువే నమోదు అవుతుంది. ఎక్కువగా ఓటింగ్ ఉండే గ్రామీణ ప్రాంతాల్లో ట్రంప్‌కు అనల్పమైన ఆదరణ ఉంటుంది. డెమొక్రాట్లను ఆదరించే నగరజీవుల్లో ఓటింగుకు గైర్హాజరీలు ఎక్కువ.

డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ తల్లి భారతీయురాలు. ఈ ఎన్నికలో ఆమెకు ఆ కారణం గొప్ప సానుకూలత అవుతుందని చెప్పలేం. ముందే చెప్పుకున్నట్టు భారతీయ ఓటర్లు డెమొక్రాట్లను అభిమానించే వారే అయినా.. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. దక్షిణ భారతదేశానికి చెందిన ఎన్నారైలలో కమలాహారిస్‌కు కచ్చితంగా మొగ్గు కనిపించే అవకాశం ఉంది. మెజారిటీ తమిళులు ఆమెను తమ సొంత మనిషిగా చూస్తున్నారు. కేరళ కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారిలో సానుకూలత పరవాలేదు. కానీ ఈ వర్గాల ఓటింగ్ శాతం చాలా చాలా తక్కువ. డెమొక్రాట్లు అనుసరిస్తున్న వలస విధానాలు భారతీయులకు ప్రతిబంధకంగా మారుతున్నాయి. చట్టబద్ధంగా ఇక్కడకు వచ్చిన భారతీయులు కూడా కొన్ని సందర్భాలలో ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి భారతీయులను కూడా చట్టవిరుద్ధంగా వచ్చిన వలస దారులుగా పొరబడుతున్న సందర్భాలు ఉన్నాయి. మరి వలసదారుల విషయంలో ట్రంప్ విధానాలకే ఆదరణ ఉంది.

కరోనా ఉపద్రవం తరువాత ఐటీ రంగం ఒడిదుడుకులకు లోనవ్వడం భారతీయులకు ఆందోళన ఎంతైనా కలిగిస్తోంది. ముఖ్యంగా జాబ్ మార్కెట్ ఎన్నడూ లేని రీతిలో అథమ స్థాయికి పడిపోయింది. లక్షలాది భారతీయులు ఉద్యోగాలు కోల్పోయారు. అదే విధంగా వేలాది విద్యార్థులు ఎంఎస్ చదువులు పూర్తిచేసి ఉద్యోగాలు లేక రకరకాల ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వాతావరణం ఏర్పడడానికి గత నాలుగు సంవత్సరాలుగా డెమొక్రాట్లు అధికారంలో ఉండడం కూడా ఒక కారణం అని భావిస్తున్నవారు లేకపోలేదు.

స్థూలంగా చూసినప్పుడు.. ఈసారి అమెరికా అధ్యక్ష పదవీ ఎన్నిక చాలా క్లిష్టంగా ఉంది. ఏడు స్వింగ్ రాష్ట్రాల ప్రభావం చాలా ముఖ్యం. అందునా పెన్సిల్వేనియా కీలకం. ఆ ఒక్క రాష్ట్రంలో 19 ఎలక్టోరల్ ఓట్లు ఉండడం ప్రధానంగా గమనించాలి. ఏడు స్వింగ్ స్టేట్స్‌లో అందరూ పెన్సిల్వేనియా మీదనే దృష్టి పెడుతున్నారు. ప్రజల ఓట్లతో సంబంధం లేకుండా ఎలక్టోరల్ కాలేజీ ఓట్లే గెలిపించే ఎన్నికలు ఇవి. మరో కీలకాంశం ఏమిటంటే.. డెమొక్రాట్ అభ్యర్థిగా బైడెన్ తప్పుకున్నాక కమలా హారిస్‌కు బాగా బలం పెరిగింది. కేవలం ఓట్ల పరంగా కాకుండా, ధనరూపంగా కూడా సాయం పెరిగింది. కానీ ఈ బలాన్ని ఆమె ఎంత మేరకు విజయం దిశగా నడిపించగలరనే సందేహాలు పలువురిలో ఉన్నాయి. శ్వేత సౌధం (అమెరికా అధ్యక్షుని అధికార నివాసం) ఆసామీగా ఎవరు వచ్చినప్పటికీ భారతీయ సమాజం కోరుకునేది ఒక్కటే. భారత్– అమెరికా సంబంధాలు కుదురుగా ఉండాలి. అమెరికాలోని భారతీయ సమాజానికి, అమెరికా మీద ఆశలు పెంచుకుంటున్న భారతీయ యువతరానికి ప్రోత్సాహకరంగా, సహాయకరంగా ఉండాలి. ఇందుకు ఎవరు కృషిచేస్తారో వారికే భారతీయ సమూహం మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉంది.

• కృష్ణమోహన్ దాసరి
డల్లాస్, అమెరికా

జగన్ మార్కు 'నిజాలు'..!

ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నోట అన్నీ 'నిజాలే' వస్తున్నాయి. ఇన్నేసి నిజాలు పలుకుతున్నా, వైసీపీ నాయకుల వలసలు ఆగటం లేదు. వారి చెవికెక్కటంలేదు. ఎవ్వరూ వినిపించుకోవటం లేదు. సినీ రచయిత త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నట్లు చాలా మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు రెండు చేతులూ జేబుల్లో పెట్టుకొని అలా నడుచుకుంటూ జనసేన పార్టీలోకో, తెలుగుదేశం పార్టీలోకో, బీజేపీ పార్టీలోకో వెళ్లిపోతున్నారు. వెనక్కి తిరిగి చూడటం లేదు. జగన్‌ను నమ్ముకొని దశాబ్దాలుగా సేవలు చేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను, కిలారి రోశయ్య, మోదుగుల వెంకటరమణ, బీదా మస్తాన్‌రావు, ఆర్. కృష్ణయ్య లాంటి నాయకులు కూడా పార్టీ వీడారు. ఇంతకూ ఆయన చెప్తున్న నిజం ఏమిటి? అవి నిజంగా నిజాలేనా? అబద్ధాలకు ముసుగులా? అంటే రెండవదే అని ఎవరికైనా అర్థం అవుతోంది.

ఉన్నట్టుండి "నేను మళ్ళీ అబద్ధం చెప్పినట్లయితే అధికారంలోకి వచ్చేవాడ్ని" అన్నారు. అంటే 2019లో తాను చెప్పినవన్నీ అబద్ధాలే అనీ, 2024లో మరోమారు చెప్పలేక పోయా అని అంగీకరించారు. నిజానికి 2019 ఎన్నికల్లో అబద్ధాలే చెప్పారు. అమరావతి ఉంటుంది అన్నారు. లేకుండా చేశారు. ప్రత్యేక హోదా తెస్తామన్నారు. ఊసే మరిచారు. దశల వారీ మద్య నిషేధం అన్నారు. రేట్లు పెంచి ప్రభుత్వమే మద్యం అమ్మేలా చేశారు. పోలవరం పూర్తి చేస్తామన్నారు. బస్తా సిమెంట్ వేయలేకపోయారు. అమ్మ ఒడి ఇద్దరు బిడ్డలకు అన్నారు. ఒక్కరికే ఇచ్చారు. రైతు భరోసా రూ.12వేలు అన్నారు. రూ.7,500 ఇచ్చారు. జాబ్ కాలెండర్ అన్నారు. లేకుండా చేశారు. బాబాయ్ వివేకానందరెడ్డి హత్యపై సీబీఐ దర్యాప్తు అన్నారు. తరువాత అక్కర్లేదు అన్నారు. పరిశ్రమలు తెస్తామన్నారు. 'పాకుడు రాళ్ళు' శుభ్రం చేస్తామన్నారు. ఇలా ఎన్నో నమ్మ పలికారు. నమ్మించి మోసం చేశారు. ఆయన అధికారంలో ఉన్న ఐదేళ్ళూ జపించిన తారక మంత్రం 'వైనాట్ 175'. ముప్పై ఏళ్ళు అధికారంలో ఉంటాం అన్నదే ఆయన పొలిటికల్ స్లోగన్. ఈ వాపు ఎంత వరకు వెళ్ళిందంటే, తన తల మీద చెయ్యి పెట్టుకొని వెంట్రుకలను పీకి చూపించే దాకా వెళ్ళింది. చొక్కాలు మడతెయ్యండి అని చెప్పేదాకా పోయింది. ఇలా "నిజా"లను పదే పదే చెప్పటం వల్ల 151 ఎమ్మెల్యే సీట్లలో 11 సీట్లు మాత్రమే మిగిలాయి. ఇప్పుడు మళ్ళీ మేం అధికారంలోకి వస్తాం అంటున్నారు. అందరినీ గుంటూరు జైల్లో పెడతాం అని వార్నింగ్ ఇస్తున్నారు. కాలర్ ఎత్తుకొని తిరుగమంటున్నారు. ఐదేళ్ళు జగన్ నోట వెంట రాని పదం గుడ్ (మంచి). ఇప్పుడు ఏకంగా గుడ్‌బుక్ అంటున్నారు. రెడ్‌బుక్‌ను చూసి అంటున్నారో, రెడ్‌బుక్‌కు భయపడి అంటున్నారో తెలీదు. రాష్ట్రంలో కాలకేయులతో పోటీపడి పరిపాలన చేశారు. గోడలు దూకారు. అరెస్టులు చేశారు. కేసులు పెట్టారు. జైళ్ళకు పంపారు. ఎంపీని కాళ్ళపై కొట్టారు. ప్రత్యర్థి పార్టీ కార్యాలయాన్ని పగులగొట్టారు. చంద్రబాబు ఇంటికే దండయాత్రకు వెళ్ళారు. ఆయన్ను అరెస్టు చేశారు. దండయాత్రకు వెళ్ళిన వారికి పదవులిచ్చారు. డాక్టర్ సుధాకర్‌ను చనిపోయేలా చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపేసి డోర్ డెలివరీ చేశారు. అబ్దుల్ సలాం కుటుంబాన్ని రైలు పట్టాలపై పడుకునేలా చేశారు. ఇలా రాసుకుంటూ పోతే ఆంజనేయుడి కరవాలం అంత అవుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే, రాజధాని అమరావతి గ్రామాల్లో 1631 రోజుల పాటు 144 సెక్షన్, 30 సెక్షన్‌లు అమలు జరిగాయి అంటే ఏ రాజ్యాంగం అమలు జరిగినట్టు? ఇన్ని పాపాలు చేసి, ఇన్నిన్ని నేరాలు చేసి మళ్ళీ అబద్ధాలను వండి వారిస్తే ప్రజలు నమ్ముతారా? ప్రజాస్వామ్యంలో ఓటమి కూడా 'గెలుపు' లాంటిదే. మారేందుకు, మళ్ళీ గెలిచేందుకు మార్పు చెందమని అర్థం. నేను మారను, నేను ఇంతే. అంతా నా ఇష్టం అంటే, ప్రజలు కూడా మారరు. వాళ్ళూ అంతే. అంతా వాళ్ళిష్టమే.

– పోతుల బాలకోటయ్య
అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు

ప్రజాపరిపాలన కోసం సంస్కరణలు ఏవీ?

ఏదైనా పని కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి పనులు కాక, అధికారుల చుట్టూ తిరగలేక బాధితులు పడే వేదన వర్ణనాతీతం. సమయం వెచ్చించి, డబ్బు ఖర్చు పెట్టుకుని, ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరిగే ప్రజలకు ఇప్పటికీ సరైన పరిష్కారం దొరకలేదు. ఆన్‌లైన్ ద్వారా పరిష్కారం చూపుతామనే హామీ ప్రకటనలకే పరిమితమైంది. పౌరసేవల కోసం ప్రజలకు ఇంకా తిప్పలు తప్పడం లేదు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నూతన ప్రభుత్వాలు ప్రజలకు మరింత మెరుగైన పరిపాలన, సత్వరం అవినీతి రహితంగా సర్వీసులు అందిస్తామనే ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఆశించిన, పరిగణించదగిన మార్పు ఏదీ లేదు. సత్వర పౌరసేవలు అందించేందుకు ఇంతకు ముందు ప్రభుత్వాలు ఆమోదించి అమలు చేయని చట్టాలు ఉన్నాయి. ఆ చట్టాలకు అవసరమైన మార్పులతో ఉత్తమ ప్రమాణాలు అందుకునే విధంగా రూపకల్పన చేయాలి. అన్ని ప్రభుత్వ విభాగాల వ్యవస్థలను పర్యవేక్షించేందుకు సాధారణ పరిపాలన శాఖలో ఒక విభాగాన్ని ఏర్పాటు చేయాలి. పౌర సేవలను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా మాత్రమే సత్వర పరిష్కారం సాధ్యమవుతుంది. ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలను అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంస్కరణలను తీసుకు వచ్చాయి. దీనిలో భాగంగా అనేక రాష్ట్రాలు పౌరసేవా పత్రం (సిటిజన్ చార్టర్)ను అమలు చేశాయి.

యూపీఏ ప్రభుత్వ కాలంలో వీరప్పమొయిలీ నేతృత్వంలోని 2వ జాతీయ పరిపాలన సంస్కరణల కమిషన్ (ఎఆర్‌సి) 2009లో తన నివేదిక సమర్పించింది. దానిలోని కీలకమైన సిఫార్సులను అమలు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం సూచనలు చేసింది. ఆ నివేదికలో పరిపాలనకు సంబంధించిన కొన్ని ముఖ్యాంశాలు– 1. పరిపాలనలో నైతికతను పెంచడానికి జాతీయ నైతిక కమిషన్ ఏర్పాటు చేయడం. 2. పబ్లిక్ సర్వీస్ డెలివరీకి పౌర కేంద్రీకృత విధానాన్ని అమలు చేయడం, పారదర్శకత, జవాబుదారీ తనాన్ని మెరుగుపరచడానికి ఈ గవర్నెన్స్ అమలు చేయడం. 3. పారదర్శకతను పెంపొందించడానికి సమాచార హక్కు చట్టాన్ని మరింత మెరుగుపర్చడం, సమస్త సమాచారాన్ని అందుబాటులో ఉంచటం, అందించటం. 4. సివిల్ సర్వీస్ సంస్కరణలు– పౌర సేవలపై ప్రజల ప్రతిస్పందనను తెలియజేయడానికి, అధికారులను జవాబుదారీ చేయడానికి మరిన్ని సంస్కరణలు చేయడం.



ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్ సర్వీసెస్ గ్యారెంటీ యాక్టును ప్రవేశపెట్టి ఏడేళ్లు పూర్తయినా, ఆచరణకు నోచుకోలేదు. రాష్ట్రంలో వివిధ విభాగాల్లో దీనిపై పురోగతిని పరిశీలిస్తే, ఏ ఒక్క శాఖలోనూ అమలు కాలేదు. ఏ ఒక్క సేవను సకాలంలో పరిష్కారం చేయలేదు. ఏ ఒక్క అధికారికి ఎటువంటి పెనాల్టీ విధించిన దాఖలాలు లేవు. సంబంధిత అర్జీదారునికి పరిహారం చెల్లించినట్లు ఒక్క ఉదంతం కూడా లేదు. అట్టహాసంగా ప్రారంభించినా అధికారులు, రాజకీయ నాయకులకు చిత్తశుద్ధి లేకపోవడంతో ఈ చట్టాన్ని అటకెక్కించారు.

దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం 'నిర్దేశిత సమయంలో ప్రభుత్వ సేవల పంపిణీ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం' బిల్లును 2011లో లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అయితే అది ఆమోదానికి నోచుకోలేదు. అయినప్పటికీ సదరు బిల్లులోని సూచనలను పరిగణనలోకి తీసుకొని చాలా రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంస్కరణలను ప్రవేశపెట్టాయి. 'ప్రభుత్వ సర్వీసుల పంపిణీ హామీ, అకౌంటబిలిటీ' ప్రైవేటు బిల్లును రాజ్యసభ సభ్యులు ఫౌజియా ఖాన్ 2017 డిసెంబర్ 9న రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దీనికంటే ముందే 1999లో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ నాయకత్వంలోని ప్రభుత్వం దేశంలో మొదటిసారిగా సిటిజన్ చార్టర్‌ను ప్రవేశపెట్టింది. ఇది పౌరులకు నాణ్యమైన సేవలను అందించడానికి, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి ఒక మార్గదర్శక ప్రయత్నాన్ని చేసింది. అది మొదలు దేశంలో అనేక రాష్ట్రాలు వీటిని అమలు చేశాయి.

సిటిజన్ చార్టర్, సర్వీసెస్ డెలివరీ గ్యారెంటీ చట్టం... ఈ రెండు ప్రజాసేవలను మెరుగుపరచడానికి ఉద్దేశించిన కార్యక్రమాలే. కానీ వాటి పరిధి, ఉద్దేశంలో విభిన్నంగా ఉంటాయి. సిటిజన్ చార్టర్– నిర్దిష్ట సేవలను అందించటానికి సమయపాలన, జవాబుదారీతనంతో కూడి ప్రభుత్వ ఏజెన్సీ ద్వారా నిబద్ధతతో కూడిన ప్రకటన. కానీ చట్టబద్ధత లేదు. అదే ప్రభుత్వ సేవల గ్యారెంటీ చట్టం ప్రకారం నిర్ణీత గడువులోగా సేవలు అందించడంలో విఫలమైన అధికారులకు జరిమానాలు విధిస్తుంది. సేవలను సకాలంలో అందజేయడం, అధికారులను జవాబుదారీగా ఉంచడంపై దృష్టి సారిస్తుంది. చట్టపరమైన మద్దతు, అమలు విధానాలను కలిగి ఉంటుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి ఒక నెంబర్ కేటాయిస్తారు. పరిష్కారానికి నిర్ణీత గడువు నిర్ణయిస్తారు. సకాలంలో ఆ సేవలు సంబంధిత అధికారి అందించాలి. ఆలస్యమైతే ఎందుకు ఆలస్యం అవుతుందో ముందుగానే సదరు అధికారి దరఖాస్తుదారునికి రాతపూర్వకంగా తెలియజేయాలి. లేకపోతే దరఖాస్తుదారుడు కాలయాపనకు జరిమానా చెల్లించాలని కోరుతూ అప్పిలేట్ అథారిటీకి అప్పీల్ చేసుకోవచ్చు. ఆలస్యం అయినందుకు సంబంధిత అధికారి దరఖాస్తుదారునికి జరిమానా చెల్లిస్తాడు. తమ పరిధిలో పౌరసేవలు ఎలా అమలు జరుగుతున్నాయో పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ప్రత్యేక అథారిటీని నియమిస్తాయి. ఎవరైనా తమ దరఖాస్తులు సకాలంలో పరిష్కారం కాలేదని ఈ అథారిటీకి అప్పీలు చేస్తే, అది వాటిని పరిశీలించి అందుకు కారణాలను విశ్లేషిస్తుంది. సహేతుకమైన కారణం లేకుండా దరఖాస్తులను పెండింగులో పెట్టినట్లు రుజువైతే సంబంధిత అధికారికి, సిబ్బందికి అపరాధ రుసుం విధిస్తారు.

ప్రభుత్వ కార్యాలయంలో నిర్ణీత పని నిమిత్తం దరఖాస్తు చేసుకునేప్పుడు మాత్రమే సంబంధిత శాఖ అధికారిని కలవాల్సి ఉంటుంది. ఆ తర్వాత తమ ఫైలు పరిష్కారం కోసం ఏ అధికారినీ కలిసి విన్నవించాల్సిన అవసరం లేదు. పైగా ఇ–ఫైలింగ్ విధానంలోనే ప్రభుత్వ శాఖలన్నీ సేవలు అందించాల్సి ఉంది. అంతేకాదు దరఖాస్తులను పరిష్కరించేందుకు తీసుకున్న సమయం, ఏమైనా అభ్యంతరాలు, వాటిని నివృత్తి చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలు వీటన్నింటి గురించి ఆన్‌లైన్‌లో అధికారులు వివరించాలి. పౌర సేవలకు సంబంధించి ఎంతో ప్రయోజనకారి అయిన ఈ చట్టాన్ని ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తే ప్రజల మెప్పు పొందడం ఖాయం.

ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్ సర్వీసెస్ గ్యారెంటీ యాక్టును ప్రవేశపెట్టి ఏడేళ్లు పూర్తయినా, ఆచరణకు నోచుకోలేదు. రాష్ట్రంలో వివిధ విభాగాల్లో దీనిపై పురోగతిని పరిశీలిస్తే, ఏ ఒక్క శాఖలోనూ అమలు కాలేదు. ఏ ఒక్క సేవను సకాలంలో పరిష్కారం చేయలేదు. ఏ ఒక్క అధికారికి ఎటువంటి పెనాల్టీ విధించిన దాఖలాలు లేవు. సంబంధిత అర్జీదారునికి పరిహారం చెల్లించినట్లు ఒక్క ఉదంతం కూడా లేదు. అట్టహాసంగా ప్రారంభించినా అధికారులు, రాజకీయ నాయకులకు చిత్తశుద్ధి లేకపోవడంతో ఈ చట్టాన్ని అటకెక్కించారు. ఉన్న చట్టాలను బలోపేతం చేయడానికి ఎటువంటి ప్రయత్నం చేయడం లేదు. అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో సిటిజన్ చార్టర్ కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. చాలా కార్యాలయాల్లో ప్రధానంగా కలెక్టరేట్, రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయాల్లో అర్జీ తీసుకున్న తర్వాత రసీదు ఇచ్చే సంస్కృతి లేదు. ఇది అన్ని ప్రధానమైన ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జరిగే తంతు. సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారాన్ని కూడా నెలరోజుల తరువాత మొక్కుబడిగా ఇస్తున్నారే తప్ప, చిత్తశుద్ధి లేదు. పబ్లిక్ సర్వీసెస్ గ్యారంటీ యాక్ట్ ఊసే లేదు. అది ఉన్న విషయం కూడా ప్రభుత్వ యంత్రాంగానికి తెలిసినట్లుగా లేదు. ఈ పరిస్థితుల్లో మనం ఆశించిన ప్రజా పరిపాలన సాధ్యమవుతుందా? రెండు రాష్ట్రాల్లోని నూతన ప్రభుత్వాలు పబ్లిక్ సర్వీసెస్ యాక్ట్ అమలుకు చిత్తశుద్ధితో ముందడుగు వేయాలి. అప్పుడే చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన ఉందని ప్రజలు నమ్ముతారు.


భారతదేశంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, ఒడిశా, సిక్కింతో సహా వారి సొంత ఓపెన్ డేటా పోర్టల్‌ను పాక్షికంగా కలిగివున్నాయి. అన్ని శాఖల పూర్తి ఆదాయ వ్యయాలు ఈ పోర్టల్ ద్వారా అందుబాటులో లేవు. అదేవిధంగా ప్రభుత్వ రికార్డులు, ఆర్థిక, పర్యావరణ, రవాణా, విద్య, ఆరోగ్యం, నేరం, భద్రత, మౌలిక సదుపాయాలు, భౌగోళిక సమాచార వ్యవస్థలు, వ్యాపారం, లైసెన్స్.. మొదలైన డేటా పూర్తి సమాచారం ప్రజలకి అందుబాటులో లేదు.

ఈ డేటా పోర్టల్‌లో పైన చెప్పిన సమాచారంతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ గ్రాంట్‌తో అనుబంధంగా పనిచేసే అన్ని సంస్థలు, శాఖలు తమ నెల వారీ ఖర్చుల వివరాలు, చేసిన పనులు, సంబంధిత కాంట్రాక్టర్ చేసిన వ్యయం వంటి పూర్తిస్థాయి సమాచారం ప్రజలకు అందుబాటులో ఎప్పటికప్పుడు ఉంచాలి. అప్పుడే పాలనలో పారదర్శకత సాధ్యమవుతుంది. స్థానిక సంస్థల దగ్గర నుంచి వివిధ ప్రభుత్వ శాఖలు, రోడ్లు భవనాలు, వ్యవసాయం, నీటిపారుదల, గనులు, అటవీ, ఇతర అన్ని ప్రభుత్వ శాఖలు తాము చేసిన పనుల జాబితాను, వ్యక్తుల జాబితాను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలి. దీనివలన ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉంటుంది.

దీనికి అనుబంధంగా సిటిజెన్ ఫీడ్‌బ్యాక్ మెకానిజం వ్యవస్థను ఏర్పాటు చేస్తే ఓపెన్ డేటా పోర్టల్‌లో ఉన్న సమాచారంపై తమ సూచనలు, సలహాలు ఇవ్వటానికి, తప్పులను ఎత్తి చూపటానికి ప్రజలకి వీలవుతుంది. కనుక ఈ రెండింటిని మేళవించి ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తే ప్రజలే ధర్మకర్తలుగా జరుగుతున్న ప్రతి పనిని గమనిస్తూ దుబారాను అరికట్టడానికి, అవినీతికి ఆస్కారం లేని ప్రజాపాలనా వ్యవస్థ ఏర్పడడానికి అవకాశం ఏర్పడుతుంది. ప్రజలే ప్రభువులు. ప్రజలకు తెలిసి పరిపాలన కొనసాగాలి. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ప్రజల కంటే తక్కువే కానీ ఎక్కువ కాదు. ఈ స్ఫూర్తితో పౌరసేవా పత్రం, ప్రభుత్వ సేవల పంపిణీ హామీ చట్టం, ఓపెన్ డాటా పోర్టల్, సిటిజన్ ఫీడ్ బ్యాక్ అన్నింటిని మిళితం చేస్తూ అధికారులపై అజమాయిషీ చేస్తూ, రాజకీయ ప్రమేయం లేని ఒక వ్యవస్థని ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా ప్రజా పరిపాలన సాధ్యమవుతుంది. ఆ దిశగా రెండు నూతన ప్రభుత్వాలు అడుగులు వేస్తాయని ఆశిద్దాం.

■ సంక్రాంతి వికె







భవానీద్వీపంలో చకచకా జరుగుతున్న పనులు

కార్తీక ద్వీపం

కార్తీక మాసానికి ముస్తాబవుతున్న భవానీ ద్వీపం

వైసీపీ విధ్వంసం.. వరదల నుంచి బయటపడి..

నవంబరు 1 నుంచి అందరికీ అందుబాటులోకి..

- పట్టుదలతో ముస్తాబు చేస్తున్న అధికారులు
- కోతకు గురైన ప్రాంతంలో ఇసుక బస్తాలు
- పాత్‌వేలు, లాన్లను సిద్ధం చేస్తున్న సిబ్బంది
- నిరాటంకంగా సాగుతున్న పనులు
- బుకింగ్‌లు పెరగటంతో ఆనందంలో అధికారులు

ఐదేళ్ల వైసీపీ నిర్లక్ష్య పాలన.. భారీ వర్షాలు, వరదల నుంచి కోలుకుంటూ భవానీ ద్వీపం కార్తీక మాసానికి ముస్తాబవుతోంది. వరదల కారణంగా నాశనమైన ద్వీపాన్ని ఏపీటీడీసీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నారు. దీంతో రాబోయే కార్తీక మాసానికి పర్యాటకులకు ద్వీపం ఆతిథ్యం ఇవ్వనుంది. అన్ని పనులను చకచకా పూర్తిచేసి నవంబరు 1 నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ద్వీపంలోని పాత్‌వేలు, లాన్‌లను సిద్ధం చేస్తున్నారు. జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయి. పిల్లల ఆటపరికరాలు, ఓపెన్ జిమ్, ఓపెన్ మ్యూజిక్ పరికరాలకు మరమ్మతులు చేయిస్తున్నారు. ఇక వరద కోతకు గురైన ప్రాంతాల్లో ఇసుక బస్తాలు వేసి సమస్యలు లేకుండా చూస్తున్నారు. కొద్దిరోజుల్లో ద్వీపం అందుబాటులోకి రానుండటంతో ఇప్పటికే పర్యాటకుల నుంచి బుకింగ్స్ మొదలయ్యాయి.

8లో



3న గాజుల మహోత్సవం

వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో నవంబరు 3 నుంచి గాజుల మహోత్సవం జరగనుంది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. పలు బృందాలు, సంఘాల నుంచి గాజుల బండిల్స్ సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కనకదుర్గా లలితా పారాయణ బృందంతో పాటు గొల్లపూడికి చెందిన ఆర్యవైశ్య సేవాసంఘం ఆధ్వర్యంలో ఈవో రామారావుకు గాజుల బండిల్స్‌ను విరాళంగా అందజేశారు. వీరికి అమ్మవారి దర్శనం కల్పించి వేదాశీర్వచనం, అమ్మవారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు. కాగా, ఆలయంలో కళావేదికపై సోమవారం బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన కె.రమాసుందరి చేసిన అమ్మ రూపవర్ణన ప్రవచనం ఆకట్టుకుంది.

యూజర్ చార్జీల ఆటంబాంబ్

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆదాయ వనరుల వేటలో పడ్డారు. ఇందులో భాగంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పలు క్రీడాసంఘాలకు నీడనిస్తున్న గదుల నుంచి యూజర్ చార్జీల వసూలుకు సిద్ధమయ్యారు. 165 నెలల బకాయిలను చూపిస్తూ.. త్వరగా చెల్లించాలని, లేదంటే గదులు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడంపై క్రీడా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని క్రీడా సంఘాల గదులు

ఐజీఎంసీ స్టేడియంలోని క్రీడాసంఘాలకు వీఎంసీ నోటీసులు

- గదులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలంటూ తాఖీదులు
- 2011 నుంచి ఇప్పటివరకు బకాయిలపై దృష్టి
- ఇప్పటికే ఒకసారి నోటీసులిచ్చిన అధికారులు
- బేఖాతరు చేసిన సంఘాలు.. తాజాగా మరోసారి జారీ
- క్రీడాసంఘాల ఆగ్రహం.. సీఎం చంద్రబాబుకు లేఖ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని గ్యాలరీల కింద గదులు ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్న క్రీడా సంఘాలకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తాఖీదులు జారీ చేశారు. 19 క్రీడా సంఘాలకు నెలకు రూ.500 చొప్పున 2011, జనవరి నుంచి బకాయిలు చెల్లించాలని నోటీసులిచ్చారు. దీనిపై క్రీడా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తమ సొంత ఖర్చుతో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నామని తమపై మరింత ఆర్థికభారం మోపడం సరికాదని వాదిస్తున్నాయి. వీఎంసీ అధికారుల వాదన ఇందుకు భిన్నంగా ఉంది. స్టేడియంలో తిష్ట వేసుకున్న క్రీడాసంఘాల్లో అధికశాతం క్రీడాకారులకు ఎలాంటి చేయూతనివ్వడం లేదని, కేవలం ఆర్థిక లబ్ధి కోసమే సంఘాలను ఏర్పాటు చేసుకుని వీఎంసీకి భారంగా మారుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.



2011 నుంచి..

తమ సంఘాలకు నగరంలో ఎలాంటి గూడు లేదని, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో తమకు స్థలం కేటాయిస్తే గదులు నిర్మించుకుంటామని 2001లో పలు క్రీడాసంఘాలు వీఎంసీ అధికారులను కోరాయి. వారి విజ్ఞప్తిపై స్పందించిన అప్పటి కమిషనర్ ఎంవీ సత్యనారాయణ వారికి గ్యాలరీల కింద గదులు నిర్మించుకునేందుకు అనుమతినిస్తూ ఉత్తర్వులిచ్చారు. యువతలో క్రీడలపై ఆసక్తి కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వీఎంసీ స్థాయీ సంఘం తీర్మానం కూడా చేసి ఆమోదముద్ర వేసింది. అయితే, మున్సిపల్ కార్పొరేషన్ స్థలం వినియోగించుకుంటున్నందుకు యూజర్ చార్జీలు చెల్లించాలన్న దానిపై ఉత్తర్వుల్లో స్పష్టత ఇవ్వలేదు. దీంతో 2011 వరకు క్రీడా సంఘాల నుంచి ఎలాంటి రుసుం వసూలు చేయలేదు. 2011లో ఒక్కో క్రీడా సంఘం తమకు కేటాయించిన గదికి యూజర్ చార్జీగా రూ.500 చెల్లించాలని వీఎంసీ అధికారులు ఉత్తర్వులిచ్చారు. 2011, జనవరి నుంచి యూజర్ చార్జీలు చెల్లించాలని కోరారు. కానీ, నాటి నుంచి ఏ క్రీడాసంఘం ఈ మొత్తం చెల్లించకపోవడంతో 2022లో మరోసారి వీఎంసీ అధికారులు నోటీసులిచ్చారు. కానీ, క్రీడా సంఘాలు ఎలాంటి చెల్లింపులు జరపలేదు. తాజాగా వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదాయ

మిగతా 8లో..



8 లేన్ల విస్తరణ?!

- హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65 అభివృద్ధికి అడుగులు
- డీపీఆర్ రూపకల్పన ప్రారంభం.. జిల్లాలో 87 కిలోమీటర్లు
- కోదాడ నుంచి గొల్లపూడి వరకు కొత్త ప్రతిపాదన
- ఆరు వరసలుగా నిర్మించాలని తొలుత నిర్ణయం
- ఆ తర్వాత.. 8 లేన్లకు పరిశీలించాలని నిర్దేశం
- 6, 8 వరసలపై అధ్యయనం చేస్తున్న కన్సల్టెన్సీ సంస్థ

తుది డీపీఆర్ ప్రకారం ఎన్‌హెచ్-65 విస్తరణ

తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న హైదరాబాద్ - విజయవాడ ఎన్‌హెచ్-65 విస్తరణకు అడుగు ముందుకు పడింది. ఈ మార్గాన్ని ఆరు వరసలుగా నిర్మించాలని తొలుత డీపీఆర్ రూపకల్పనకు టెండర్లు పిలిచినప్పటికీ.. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదన, ప్రజాప్రతినిధుల అభ్యర్థన, స్థానిక ప్రజల ఆకాంక్ష మేరకు ఎనిమిది లేన్ల విస్తరణ అంశంపైనా ఎన్‌హెచ్ అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు వాహనాల రద్దీపై కన్సల్టెన్సీ సంస్థ అధ్యయనం ప్రారంభించింది. తుది డీపీఆర్ ప్రకారం ఎన్‌హెచ్-65 విస్తరణ జరుగనుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్- విజయవాడల మధ్య ఎన్‌హెచ్- 65ను ఎనిమిది వరసలుగా విస్తరించాలన్న ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఎనిమిది వరసలుగా విస్తరించేందుకు ఉన్న ఫీజుబిలిటీని అధ్యయనం చేయాల్సిందిగా నిర్దేశించింది. దీంతో ఎన్‌హెచ్ అధికారులు ప్రస్తుత డీపీఆర్‌లోనే 6, 8 వరసలకు సంబంధించి

మిగతా 8లో..



డబుల్ ధమాకా

- నిడమానూరు ఫ్లై ఓవర్‌పై మరో నిర్ణయం
- మెట్రో ఎలివేటెడ్ కమ్ ఫ్లై ఓవర్‌గా నిర్మించే యోచనలో అధికారులు
- కన్సల్టెన్సీ నియామకం.. వారిచ్చే నివేదిక ఆధారంగా నిర్ణయం
- మెట్రో అధికారులతో ఎన్‌హెచ్ వరుస సమావేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నిడమానూరు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి అడుగులు వేగంగా పడుతున్నాయి. మెట్రో ఎలివేటెడ్ కమ్ ఫ్లై ఓవర్‌ను నిర్మించేందుకు వీలుగా జాతీయ రహదారుల సంస్థ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఫ్లై ఓవర్ అలైన్‌మెంట్‌లో సాగనున్న లైట్ మెట్రో ఎలివేటెడ్ కారిడార్‌ను దృష్టిలో ఉంచుకుని ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో చర్చించారు. నాగపూర్ తరహాలో ఫ్లై ఓవర్‌పై మెట్రో ఎలివేటెడ్ కారిడార్ వచ్చేలా నిర్మించాలని నిర్ణయించారు. విజయవాడ భౌగోళిక పరిస్థితులు, నేల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని సాంకేతికంగా ఎలాంటి విధానంలో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను చేపట్టాలన్న దానిపై కన్సల్టెన్సీ ద్వారా నివేదిక రూపొందించాలని నిర్ణయించారు.

మిగతా 8లో..

హైకోర్టు న్యాయవాది కిడ్నాప్ కేసు

నిందితులుగా డీఎస్పీ, ఎస్ఐ

- ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న డీఎస్పీ 6లో
- పిడుగురాళ్ల నుంచి పటమటకు కేసు బదిలీ

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

- పీఎన్‌బీఎస్, ఆటోనగర్ నుంచి.. 8లో

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా ఏవీ రావు

8లో

కోర్టుల వద్ద ఉద్రిక్తత

ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ

- అదే వాయిదాకు వచ్చిన టీడీపీ సర్పంచ్ నరసయ్య
- గత ఘర్షణల నేపథ్యంలో భారీగా పోలీసు బందోబస్తు

విజయవాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : విజయవాడ కోర్టుల వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, టీడీపీ సర్పంచ్ నరసయ్య ఒకే కేసులో వాయిదాకు హాజరుకావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కోర్టు హాల్లోకి వంశీ, నరసయ్యను తప్ప ఇంకెవరినీ అనుమతించలేదు. 2019లో వంశీ టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేయగా, వైసీపీ నుంచి యార్లగడ్డ వెంకట్రావు పోటీ చేశారు. నాడు రిగ్గింగ్ జరుగుతుందని వెంకట్రావు ప్రసాదంపాడులోని పోలింగ్‌బూత్ వద్ద ఆందోళన చేశారు. దీనికి ప్రతిగా వంశీ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని వంశీ, నరసయ్యపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టులో సాగుతోంది. తర్వాత జరిగిన పరిణామాల్లో యార్లగడ్డ టీడీపీలోకి వచ్చారు. అప్పటి వరకు వంశీ వెంట అడుగులు వేసిన నరసయ్య మాత్రం టీడీపీలోనే ఉన్నారు. వంశీ వైసీపీలోకి మారారు. ఈ నేపథ్యంలో గత



ఎన్నికలకు ముందు జరిగిన కోర్టు విచారణకు వంశీ, నరసయ్య హాజరయ్యారు. కోర్టులో వంశీ అనుచరులు నరసయ్య, ఆయన డ్రైవర్‌పై దాడి చేశారు. అప్పటి కేసులో వంశీ, నరసయ్య సోమవారం విచారణకు వచ్చారు. ఎన్నికల సమయంలో జరిగిన పరిస్థితుల నేపథ్యంలో ఇద్దరూ అనుచరులను వెంటబెట్టుకుని కోర్టు ప్రాంగణానికి చేరుకున్నారు. దీంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుచరులు భారీగా చేరటంతో ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి. కాగా, ఈ కేసు తదుపరి విచారణను వచ్చేనెల 11వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

హైకోర్టు న్యాయవాది కిడ్నాప్ కేసులో..

నిందితులుగా డీఎస్పీ, ఎస్ఐ

- ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న డీఎస్పీ
- పిడుగురాళ్ల నుంచి పటమటకు కేసు బదిలీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ పాలనలో ఎమ్మెల్యేలు, ప్రభుత్వ పెద్దల అండతో చెలరేగిపోయిన పోలీసులు ఇప్పుడు చిక్కుల్లో పడుతున్నారు. ఇప్పటికే ముంబై నటి కాదంబరి జెత్వాని, ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు కేసుల్లో పోలీసులు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. హైకోర్టు న్యాయవాదిని నానా ఇబ్బందులు పెట్టిన పిడుగురాళ్ల పోలీసులు కోర్టు ఆదేశాలతో నమోదైన కేసులో నిందితులుగా ఉన్నారు. పల్నాడు జిల్లా నుంచి ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు బదిలీ అయిన ఈ కేసులో ఓ డీఎస్పీ, ఓ ఎస్ఐ నిందితులుగా ఉన్నారు. న్యాయవాదికి సంబంధించిన ఆస్తులను వేరొకరికి బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించడంలో వారి పాత్ర బలంగా ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అసలేం జరిగింది?

విజయవాడ మహానాడు రోడ్డులోని రామచంద్రనగర్‌లో ఉంటున్న హైకోర్టు న్యాయవాది హరిబాబుకు అమెరికాలో ఉంటున్న కర్నాటి సతీష్ పరిచయస్తుడు. సతీష్ తండ్రి వీరభద్రరావు గుంటూరు జిల్లా కోసూరు మండలం అందుకూరులో నివాసం ఉంటున్నారు. హరిబాబు నుంచి ఆయన రూ.2.40కోట్లు అప్పుగా తీసుకున్నారు. అందులో 2018, 2019 ఏప్రిల్‌లో రెండు విడతలుగా రూ.1.40కోట్లు తిరిగి ఇచ్చేశారు. మిగిలిన మొత్తం త్వరలో ఇస్తానని స్టాంపు పేపర్ రాసిచ్చారు. తర్వాత ఎంతకీ డబ్బులు ఇవ్వకపోవడంతో హరిబాబు గట్టిగా నిలదీశారు. దాంతో అమెరికాలో ఉన్న సతీష్, అందుకూరులో ఉంటున్న వీరభద్రరావు కలిసి రాజకీయ బలాన్ని ఉపయోగించి గడచిన ఏడాది నవంబరు 7వ తేదీన హరిబాబుపై పిడుగురాళ్ల స్టేషన్ కేసు నమోదు చేయించారు. అప్పటి గురజాల డీఎస్పీ పల్లంరాజు ఈ కేసు పర్యవేక్షణ బాధ్యతను భుజాన వేసుకుని మొత్తం కథను నడిపించారని హరిబాబు ఆరోపిస్తున్నాడు. కేసు నమోదు చేయగానే పిడుగురాళ్ల ఎస్ఐ ఎస్కే రబ్బాని, కానిస్టేబుల్ వెంకటరావు విజయవాడ చేరుకుని హరిబాబుతో పాటు ఆయన సోదరులను తీసుకెళ్లారు. పిడుగురాళ్ల సీఐ కార్యాలయంలో ఉంచి వీరభద్రరావు ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని తేల్చారు. ఇప్పటికే అధిక వడ్డీతో చాలా ఎక్కువ వసూలు చేశావని హరిబాబును బెదిరించారు. వీరభద్రరావు ఇక ఏమీ డబ్బులు ఇవ్వడని కేసును సెటిల్‌మెంట్ చేసుకోవాలని ఒత్తిడి చేశారు. తర్వాత హరిబాబుకు కుంటముక్కలలో ఉన్న రెండెకరాల వ్యవసాయ భూమిని దగ్గరుండి వీరభద్రరావు విజయవాడలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఇది కాకుండా అతడు బ్యాంకులో పొదుపు చేసుకున్న డబ్బులను బయటకు తీయించారు. దీనిపై హరిబాబు గుంటూరు ఐజీకి ఫిర్యాదు చేయడంతో విచారణ అనంతరం డీఎస్పీ పల్లంరాజుపై వేటు వేశారు. పిడుగురాళ్ల పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడంతో ఆయన విజయవాడలోని నాలుగో ఏసీఎంఎం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న పిడుగురాళ్ల పోలీసులు కర్నాటి వీరభద్రరావును ప్రధాన నిందితుడిగా, డీఎస్పీ పల్లంరాజు రెండో నిందితుడిగా చేర్చుతూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారితోపాటు ఏ3గా ఎస్ఐ రబ్బాని, ఏ4గా వెంకటేశ్వరరావు, ఏ5గా బాలునాయక్, ఏ6 నాగుర్‌వలీ, ఏ7గా కర్నాటి సతీష్‌లను చేర్చారు. పిడుగురాళ్ల పోలీసులు తూతూమంత్రంగా సెక్షన్లు వేశారు. దీనిపై హరిబాబు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. పిడుగురాళ్ల పోలీసులపై తనకు నమ్మకం లేదని, కేసును విజయవాడకు బదిలీ చేయాలని పిటిషన్‌లో కోరారు. కేసులో కిడ్నాప్, బెదిరింపులకు సంబంధించిన సెక్షన్లు నమోదు చేయలేదని వివరించారు. దీనిని పరిశీలించిన కోర్టు కేసును పిడుగురాళ్ల నుంచి హరిబాబు నివాసం ఉంటున్న పటమట పీఎస్‌కు బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. పటమట పోలీసులు కోర్టు ఆదేశాల ప్రకారం సెక్షన్లను జత చేశారు.

దర్యాప్తు జరుగుతోంది : వి.పవన్ కిషోర్, పటమట ఇన్‌స్పెక్టర్

ఈ కేసు గురజాల నుంచి పటమటకు బదిలీ అయింది. కోర్టు ఆదేశాల ప్రకారం కొన్ని సెక్షన్లను చేర్చాం. ఈ కేసు దర్యాప్తులో ఉంది. ఫిర్యాదులో ఉన్న అందరు నిందితులుగా ఉన్నారు. ఇందులో ముగ్గురు పోలీసులున్నారు. దర్యాప్తు పూర్తవగానే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.



- పట్టణంలో రోజూ 84 మెట్రిక్ టన్నులు సేకరణ
- నిలిచిపోయిన చెత్త సేకరణ వాహన సేవలు
- తాత్కాలికంగా 10 ట్రాక్టర్లతో సేకరణ, కార్మికులపై పనిభారం
- యార్డు సమీప కాలనీల్లో ప్రజలకు రోగాల భయం
- గుంటూరు జిందాల్ కంపెనీకి తరలింపులోనూ జాప్యం
- సీఎం చంద్రబాబు ఆదేశాలు అమలులో జాప్యం!

కొండలా చెత్త!

సంపద సృష్టి జరిగేనా

మచిలీపట్నంలో డంపింగ్ యార్డు

మచిలీపట్నం డంపింగ్ యార్డులో లక్ష టన్నుల చెత్త నిల్వలు కొండలా పేరుకుపోతున్నాయి. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చెత్త సేకరణ వాహనాల కాంట్రాక్టర్ సేవలు నిలిపివేయడంతో నగరంలోని పది ట్రాక్టర్లతోనే చెత్తను తరలిస్తున్నారు. దీంతో పారిశుధ్య కార్మికులపై పనిభారం పెరిగింది. ఇటీవల సీఎం చంద్రబాబు బందరు పర్యటనలో చెత్త నుంచి సంపద సృష్టించి డంపింగ్ యార్డు స్వరూపమే మార్చేస్తామని చెప్పినా.. ఆ మేరకు అడుగులు పడటం లేదు.

(ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం టౌన్)

మచిలీపట్నంలోని 50 డివిజన్లలో ప్రతిరోజూ 84 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి గుంటూరు జిందాల్ కంపెనీకి ప్రతి రోజూ 18 టన్నుల చెత్తను పంపుతున్నారు. అయితే కాంట్రాక్టర్ కాల పరిమితి ముగియడంతో గుంటూరుకు చెత్తను తీసుకువెళ్లడం ఆపేశాడు. దీంతో డంపింగ్ యార్డు వద్ద చెత్త ఎగిరిపడే పరిస్థితి ఏర్పడింది. వర్షానికి రోడ్లపైకి చెత్తతో వర్షపునీరు కొట్టుకు వస్తోంది. ఈ నేపథ్యంలో పారిశుధ్య కార్మికులకు వీధుల్లోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడం సవాల్‌గా మారింది.



డంపింగ్ యార్డును సందర్శించిన చంద్రబాబు(ఫైల్)

● సీఎం చంద్రబాబు ఇటీవల మచిలీపట్నం డంపింగ్ యార్డును సందర్శించిన అనంతరం యార్డు రూపురేఖలు మారుతున్నాయని అందరూ భావించారు. చెత్త నుంచి సంపదను సృష్టించాలని చంద్రబాబు పాలకులు, అధికారులను ప్రజాదర్బార్‌లో ఆదేశించారు. అయితే చెత్తను సేకరించే వాహనాలు నిలిపివేయడంతో పాటు గుంటూరుకు చెత్తను తరలించే కాంట్రాక్టర్ కాల పరిమితి ముగియడంతో డంపింగ్ యార్డు వద్ద కొండల మాదిరిగా చెత్త పేరుకుపోయే పరిస్థితి ఏర్పడింది.

జనాభాతో పాటు పెరుగుతున్న చెత్త..

మచిలీపట్నంలో 58 వేల ఇళ్ల నుంచి ప్రతి రోజూ 84 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోంది. తడి చెత్త, పొడి చెత్త కోసం డస్ట్‌బిన్‌లను ప్రతి కుటుంబానికి ఇచ్చినప్పటికీ ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదు. వైసీపీ ప్రభుత్వంలో నగర పాలక సంస్థకు 41 చెత్త సేకరించే వాహనాలు అందజేసింది. వాహనాలకు మచిలీపట్నం మునిసిపాలిటీ రూ.కోటి 30 లక్షల బకాయిలుండటంతో వాహనాల సేవలు నిలిచిపోయాయి. దీనికి ప్రత్యామ్నాయంగా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



పది ట్రాక్టర్లతో నగరంలో చెత్త సేకరణ..

నగరంలోని 50 డివిజన్ల నుంచి పది ట్రాక్టర్లతో చెత్తను సేకరిస్తున్నా పని సక్రమంగా సాగడంలేదు. మరిన్ని ట్రాక్టర్లను ఏర్పాటు చేయవలసి ఉంది. గతంలో ఒకటి రెండు ట్రిప్పులు వేసే ట్రాక్టర్లు ఇప్పుడు మూడు నాలుగు ట్రిప్పులు వేయాల్సి వస్తోంది. పారిశుధ్య కార్మికుల కొరత ఉంది. మచిలీపట్నంలో చెత్తను వేసే 50 డంపర్‌బిన్‌లలో 25 పాడయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేయాల్సి ఉంది.

కార్పొరేషన్‌పై అధిక భారం..

వైసీపీ పాలనలో చెత్త సేకరణపై ఒక్కొక్క కుటుంబం నుంచి రూ. 30 నుంచి రూ.90 చొప్పున నెలకు సుమారు రూ. 25 లక్షల వరకు వసూలు చేసేవారు. అయితే కాంట్రాక్టర్‌కు బకాయిలు రూ.కోటి 30లక్షల వరకు పేరుకుపోయాయి. ప్రజలపై చెత్త పన్ను నిలిపివేయడంతో కాంట్రాక్టర్‌కు జనరల్ ఫండ్స్ నుంచి కోటి 30 లక్షలు చెల్లించాల్సి వచ్చింది. ఇంత పెద్ద మొత్తంలో నగర పాలక సంస్థ చెల్లించే పరిస్థితి లేదని అధికారులే చెబుతున్నారు.

చెత్త నుంచి సంపద ఒక్కటే మార్గం

నగరంలో రోజుకు వస్తున్న 84 మెట్రిక్ టన్నుల చెత్త నుంచి ఆదాయం సంపాదించాలని సీఎం చంద్రబాబు ఇటీవల మచిలీపట్నం పర్యటనలో చెప్పారు. చెత్త నుంచి ఏ విధంగా ఆదాయం సంపాదించాలో అధికారులు, పాలకులకు సూచనలు చేశారు. చెత్త నుంచి సంపదను రాబడితే ట్రాక్టర్లు, డంపర్‌బిన్‌లు, డస్ట్‌బిన్‌లు కొనుగోలు చేసేందుకు వీలవుతుంది. కొన్ని ప్రాంతాల్లో చెత్త నుంచి వర్మి కంపోస్టు ఎరువులను తయారు చేస్తున్నారని, చెత్తను ఇతర ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారని చంద్రబాబు తెలిపారు. ఆ దిశగా పాలకులు, అధికారులు ప్రణాళిక రూపొందించాల్సి ఉంది.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సమస్యకు పరిష్కారం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చెత్త సమస్యకు సరైన పరిష్కారం ఏర్పడుతుంది. కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమాల ద్వారా కొన్ని సూచనలు చేసింది. చెత్తను సంపదగా రూపొందించేందుకు మునిసిపాలిటీలకు సాయం అందించేందుకు ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో చెత్తనుంచి సంపద సేకరించే మార్గాలు అన్వేషించాల్సి ఉంది.

డంపింగ్ యార్డుతో కాలనీవాసుల కష్టాలు..

డంపింగ్‌యార్డు వెనుక 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. యార్డు నుంచి వచ్చే పొగ, దుమ్ము, ధూళి ఇళ్ల మీద పడటంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో డంపింగ్ యార్డుకు, కాలనీకి మధ్య గోడ కట్టేందుకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కాలనీ వాసులతో పాటు ఎస్.ఎన్. గొల్లపాలెం, సీతారామపురంలకు వెళ్లే ప్రజలు అవస్థలకు గురవుతున్నారు.



మూలన చేరిన చెత్త సేకరణ వాహనాలు

డంపింగ్ యార్డు స్వరూపం మార్చేస్తాం : రవీంద్ర



డంపింగ్ యార్డు సమస్యను సీఎం చంద్రబాబు ప్రత్యక్షంగా వీక్షించారు. ఒక్కొక్క వాహనానికి నెలకు రూ. 55వేలు చెల్లించాల్సి వస్తోంది. వాహనాలు తిప్పకపోతే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం. చెత్త సేకరించేందుకు ట్రాక్టర్లు కొనుగోలు చేయనున్నాం. యార్డు వెనుక కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తాం. రుద్రవరం వద్ద 13 ఎకరాల స్థలం కొనుగోలు చేసి డంపింగ్ యార్డును తరలిస్తాం. ఏడాదిలోగా యార్డు స్థలంలో పార్కును ఏర్పాటు చేసి చంద్రబాబుకు చూపిస్తాం.

డంపింగ్ యార్డును తరలించాలి


\- కుంభ శివమ్మ, కాలనీ వాసి



డంపింగ్ యార్డు వెనుక 20 ఏళ్ల నుంచి 200 కుటుంబాలు నివశిస్తున్నాయి. ఎప్పటికప్పుడు యార్డును వేరేచోటకు తరలిస్తామని చెబుతున్నా.. కార్యరూపం దాల్చడం లేదు. ఏళ్ల తరబడి చెత్త, పొగను భరిస్తున్నాం. కాలనీలో చాలా మంది రోగాలబారిన పడుతున్నారు. పాలకులు, అధికారులు దృష్టి సారించాలి.

ప్రణాళికలు రూపొందిస్తున్నాం

\- బాపిరాజు, కమిషనర్



డంపింగ్ యార్డుకు చెత్త సేకరణ వాహనాలు తిప్పేందుకు గత కాంట్రాక్టర్ సుముఖత వ్యక్తం చేశారు. కొన్ని వాహనాలు ఇప్పటికే తిరుగుతున్నాయి. ప్రస్తుతం పది ట్రాక్టర్లతో చెత్తను డంపింగ్ యార్డుకు పంపుతున్నాం. చెత్త నుంచి సంపద రావడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నాం.



రైల్వే జీఎం చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులు అందుకుంటున్న బాబూరావు, హీరాలాల్ మీనా, ప్రశాంత్‌కుమార్.

రైల్వేలో మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులు

రైల్వే స్టేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్‌లో ముగ్గురు ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులు లభించినట్టు విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే నిలయంలో సోమవారం జరిగిన ఈ అవార్డుల కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన సీహెచ్ బాబూరావు, హీరాలాల్ మీనా, ఎన్.ప్రశాంత్ కుమార్‌కు ఈ అవార్డులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అందజేశారు. ఉప్పులూరు ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న పాయింట్స్ మేన్ సి.హెచ్.బాబూరావు లోడ్ చేయబడిన వస్తువుల రేక్‌పై హాట్ యాక్సిల్‌ని గమనించినందుకు, బిట్రగుంట వద్ద గూడ్స్ రైలు మేనేజర్ హీరాలాల్ మీనా లోడు చేయబడిన గూడ్స్ రేక్‌లో హాట్ యాక్సిల్‌ని గమనించినందుకు, మెకానికల్ డిపార్టుమెంట్ టెక్నీషియన్ ఎన్.ప్రశాంత్ కుమార్ బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ ఈనెల 3న వేగపరిమితి విధించి, రైలు సురక్షితంగా గమ్యస్థానానికి వెళ్లినందుకు వీరికి అవార్డులు లభించాయి.

ఏపీ స్టేట్ ఎస్‌జీఎఫ్ షూటింగ్‌లో పలువురికి పతకాలు

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన పలువురు షూటర్లు రాష్ట్ర స్కూల్ గేమ్స్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పతకాలతో సత్తాచాటారు. ఈ పోటీలు ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగాయి. 10 మీటర్ల రైఫిల్ పీప్‌సైట్, పిస్టల్ విభాగాల్లో మొత్తం 16 పతకాలను వశం చేసుకున్నారు. అండర్-14 రైఫిల్ పీప్‌సైట్‌లో తమన్యు సిరంగి (స్వర్ణం), దీక్షిత ఫణి (రజతం), పి కార్తికేయ (కాంస్యం) సాధించారు. అండర్-17లో బాలికల రైఫిల్‌లో అక్షయిదాయం (స్వర్ణం), తమన్యు సిరంగి (రజతం), గొట్టు లక్ష్మి సమన్విత (కాంస్యం), అండర్-19 బాలికల విభాగంలో వంకాయల పాటి భావన శౌర్య (రజతం), నరాల ధరణి ఐశ్వర్య (కాంస్యం), 10 మీటర్ల పిస్టల్ బాలికల విభాగంలో నెట్టి దీక్షిత (స్వర్ణం), యరబోలు రాజరాజేశ్వరి (రజతం), బాలుర విభాగంలో మన్విత్ కార్తికేయ (స్వర్ణం), అభిలాష్ చంద్ర (స్వర్ణం), సేతు మాధవ్ (కాంస్యం), యరబడి పవన్ గణేష్ (రజతం), హేమంత్ హర్షితిక్ రెడ్డి (స్వర్ణం), కూరపాటి యశ్వంత్ (రజతం) వశం చేసుకున్నారు. క్రీడాకారులను ది ఇండియన్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్సు డైరెక్టర్, కోచ్ సుబ్రహ్మణ్యేశ్వరరావు అభినందించారు.

40 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

- వివరాలు వెల్లడించిన ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా పలుచోట్ల దొంగిలించబడిన రూ.47లక్షల విలువైన 40 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. ఎస్పీ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో మచిలీపట్నం, పెడనతో పాటు జిల్లాలోని పలుప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు చోరీలపై ఫిర్యాదులు అందాయన్నారు. పోలీసులు నిఘా ఉంచి ద్విచక్రవాహనాలు దొంగిలిస్తున్న వారి కదలికలను కనిపెట్టి, వారినుంచి 40 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మచిలీపట్నంకు చెందిన మహ్మద్‌షైఫ్, ఎస్కే ఫరాన్, మహ్మద్‌ఫరీద్, పెడన నందమూరుకు చెందిన నామన శ్రీనివాసరావు, పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన మోకా దుర్గారావు ద్విచక్రవాహనాలు దొంగిలిస్తున్నట్టుగా గుర్తించడం జరిగిందన్నారు. ద్విచక్రవాహనాలను దొంగిలించిన కేసులో నిందితులపై కేసు నమోదుచేసి కోర్టుకు హాజరు పరచనున్నట్టు తెలిపారు.

మీకోసం అర్జీలు సత్వరం పరిష్కరించండి

- కృష్ణా జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారవేదిక (మీకోసం) కార్యక్రమంలో ప్రజలనుంచి వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జేసీ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీవో కె.స్వాతి, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవితో కలిసి ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. జిల్లా నుంచి వచ్చిన 128మంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, అధికారులకు పంపిన అర్జీలను పూర్తిగా పరిశీలించి, వివరాలను కలెక్టర్‌కు నివేదిక రూపంలో అందించాలన్నారు. ప్రస్తుతం 108 అర్జీలు సీఎం కార్యాలయం నుంచి వచ్చాయని, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలన్నారు. సీఎం కార్యాలయం నుంచి ఇప్పటివరకు 811అర్జీలు అందగా, వాటిలో 51శాతం రెవెన్యూశాఖకు సంబంధించినవే ఉన్నాయని తెలిపారు. జలవనరులశాఖ 16, రెవెన్యూకు సంబంధించి ఏడు కోర్టుధిక్కరణ కేసులు ఉన్నాయని, వెంటనే వాటికి వకాలత్‌లు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి ప్రారంభమై, నవంబరు 3వతేదీ వరకు విజిలెన్స్ వారోత్సవాలు జరగనున్న నేపథ్యంలో, అవినీతిని అరికట్టేందుకు అందరం కృషి చేద్దామని అధికారులతో జేసీ ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్వో మాట్లాడుతూ, సమాచారహక్కు చట్టం ద్వారా 26శాఖలకు చెందిన అధికారులు సమాచారం ఇవ్వాల్సి ఉందని, వెంటనే అందజేయాలన్నారు. వసతిగృహాల్లో ఉంటున్న పిల్లలకు దుప్పట్లు, చాపలు ఇచ్చేందుకు అధికారులు ఆర్థికసాయం చేసేందుకు ముందుకువస్తే, వారంలోగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్వో తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డ్వామా పీడీ శివప్రసాద్, గృహ నిర్మాణశాఖ అధికారి వెంకట్రావ్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, డీసీహెచ్ఎస్ శ్రావణ్‌కుమార్, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ గీతాంజలి శర్మ

ప్రతి అర్జీపైనా దృష్టి పెట్టండి

- ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టి సారించి నిర్దేశ గడువులోగా సరైన పరిష్కారం చూపేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నిధి మీనా అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు తదితరులతో కలిసి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా నిధిమీనా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ వ్యవస్థపై ప్రత్యేకంగా దృష్టిసారించడం జరుగుతోందని, జిల్లాస్థాయి అధికారులు సమన్వయంతో అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు అర్జీల పరిష్కారానికి సంబంధించిన పురోగతిపై ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 157 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు తెలుసుకుంటున్న ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌నిధి మీనా

నేటినుంచి ఉచిత గ్యాస్

మచిలీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేసేందుకు సర్వం సిద్ధం చేసింది. ఉచిత గ్యాస్ పొందేందుకు ఈ నెల 29నుంచి 31 వరకు బుకింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్టు జేసీ గీతాంజలి శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ క్రమం తప్పకుండా తీసుకుంటున్నవారు. వారి ఆధార్ నెంబరు, బియ్యం కార్డు, ఆధార్‌నెంబరుతో లింక్ అయి ఉన్న బ్యాంకు ఖాతా నంబర్లతో గ్యాస్ బుకింగ్ చేసుకుని, నగదును గ్యాస్ ఏజెన్సీకి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉచిత సిలిండర్‌కు సంబంధించి నగదును వినియోగదారుల బ్యాంకుఖాతాల్లో రెండురోజుల్లోగా జమ చేస్తారని జేసీ తెలిపారు. ప్రతినాలుగు నెలలకు ఒకసారి చొప్పున ఏప్రిల్ నుంచి జూలై నెలవరకు, ఆగస్టు నుంచి నవంబర్ నెలవరకు, డిసెంబర్ నుంచి మార్చి నెలవరకు మూడు విడతల్లో ఉచితగ్యాస్ సిలిండర్‌లను బుక్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం ఇచ్చిందని జేసీ తెలిపారు.

ఐటీఐలో కౌన్సెలింగ్ పూర్తి

భారతీనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యాసంవత్సరానికిగాను 5వ విడత కౌన్సెలింగ్ సోమవారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగింది. కౌన్సిలింగ్‌కు 29 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 16 మంది హాజరయ్యారు. వారిలో 16 మందికి వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లు కేటాయించారు. ఈ సంవత్సరానికిగాను జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు మొత్తం 716సీట్లు ఖాళీ ఉండగా ఇప్పటి వరకు 96 శాతం సీట్లు భర్తీ అయ్యాయని ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీసుల రక్తదానం

విజయవాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసులు విజయవాడ ఏఆర్ గ్రౌండ్స్‌లో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ప్రారంభించారు. ఏఆర్, సివిల్, ట్రాఫిక్ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీసీపీలు గౌతమీ షాలి, తిరుమలేశ్వరరెడ్డి, కృష్ణమూర్తి నాయుడు, ఉదయరాణి, ఎస్వీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పోలీసు సిబ్బంది

వరద సాయంపై అపోహలు వద్దు

- ఏ ఒక్క బాధితుడికీ మిస్ కాకుండా ఖాతాల్లో సొమ్ము జమ
- ఇంకా ఎవరికైనా అందకపోతే అధికారుల దృష్టికి తేవచ్చు
- ఇందుకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఏర్పాటు : సిసోడియా

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో వరదలకు దెబ్బతిన్న ప్రతి బాధితుడికి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా పరిహారం అందించిందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా వెల్లడించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరద బాధితులు తమకు న్యాయంగా అందాల్సిన పరిహారం పొందటానికి ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పించిందన్నారు. నష్టాన్ని అంచనా వేసి, బాధితులకు పరిహారం అందజేసి, అండగా నిలిచిందని తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'సీఎం చంద్రబాబు మానవతా దృక్పథంతో, బాధితుల పట్ల ఎంతో ఉదారంగా వ్యవహరించారు. ఏ ఒక్క బాధితుడికీ పరిహారం అందలేదన్న మాటే రాకూడదని అధికారులను ఆదేశించారు. ఆ నేపథ్యంలో బాధితులందరికీ పరిహారం అందజేశాం. ఏ ఒక్క బాధితుడికీ అన్యాయం జరగకుండా చూడాలన్నదే ప్రభుత్వ సంకల్పం. ఈ విషయంలో అపోహలు విడనాడాలి. వరదల్లో నష్టపోయిన బాధితుల వివరాలన్నీ అత్యంత పారదర్శకంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాం. వారికి పరిహారం అందజేశాం. మొత్తం రూ.238.38 కోట్లు 1,46,318 మంది బాధితుల ఖాతాలకు నేరుగా జమ చేశాం. ఇప్పటికీ పరిహారం అందకుంటే వారు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశముంది. నష్టం అంచనా వేసే సమయంలో ఇంట్లో లేని బాధితుల ఫిర్యాదుల నమోదుకు సీఎం ఆదేశాల మేరకు మరోసారి అవకాశం కల్పించాం. బాధితులు తమ పేర్లు నమోదు చేసుకోవటానికి 'ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక' ఏర్పాటు చేశామని తెలిపారు. కొంతమంది వరదసాయంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

బాణాసంచా గోడౌన్‌లో చోరీ.. రూ.1.25 లక్షల సరుకు అపహరణ

గన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కోనాయి చెరువు సమీపంలోని ఓ బాణాసంచా విక్రయ గోడౌన్‌లో దొంగలు చొరబడి సుమారు రూ.1.25లక్షల విలువైన సరుకు అపహరించుకుపోయిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల సమాచారం ప్రకారం.. శ్రీ దుర్గాభవాని ఫైర్‌వర్క్స్ ఏజెన్సీకి చెందిన గోడౌన్‌లో ఆదివారం ఉదయం 3.20గంటల సమయంలో ఖరీదైన సామగ్రిని అపహరించుకుపోయారు. యజమాని గొంట్ల యజ్ఞనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అగ్రి బాధితుల మహా విజ్ఞాపన దీక్ష

- సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ వేయాలి : సీపీఐ రామకృష్ణ

ధర్నాచౌక్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధితులు ధర్నాచౌక్‌లో సోమవారం మహా విజ్ఞాపన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమస్య పరిష్కారానికి అఖిలపక్షంతో సీఎం చంద్రబాబు సంప్రదించాలన్నారు. ప్రభుత్వాలు మారినా వీరి సమస్య పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబద్ధత కలిగిన మాజీ ఐపీఎస్ అధికారి ఎ.బి.వెంకటేశ్వరరావు లాంటి అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా సమస్య పరిష్కారానికి చొరవచూపాలని సూచించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ, అగ్రిగోల్డ్ ఆస్తులు విక్రయించి బాధితులకు న్యాయం చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కంపెనీ అడ్డగోలుగా ఆస్తులు అమ్ముతుందన్నారు. మట్టి, కలప, వీలైనచోట బినామీ ఆస్తులను అమ్ముకుంటుందన్నారు. కంపెనీల ఆస్తులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వాయిదా తీర్మానం ద్వారా సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారంపై తమ ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావుల రవీంద్రనాథ్, అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య, అసోసియేషన్ నేతలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు దీక్షకు మద్దతు పలికాయి. అధిక సంఖ్యలో అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

గెలుపు ముంగిట ఆంధ్రా క్రికెట్ టీమ్

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బీసీసీఐ పర్యవేక్షణలో మూలపాడు వేదికగా జరుగుతున్న కల్నల్ సీకే నాయుడు మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లో విదర్భ జట్టుపై ఆంధ్రా టీమ్ గెలుపు దిశగా పయనిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్రా టీమ్ 170 పరుగులకు కుప్పకూలింది. విదర్భ రెండో ఇన్నింగ్‌లో సోమవారం 98 పరుగులకు కుప్పకూలింది. అనంతరం 141 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన ఆంధ్రాటీమ్ 78/3 పరుగులతో నిలిచింది. విజయం సాధించాలంటే ఆంధ్రా మరో 63 పరుగులు చేస్తే సరిపోతుంది. రెండోరోజు మొత్తం 17 వికెట్లు నేలకూలడం విశేషం. రెండోరోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్రా బ్యాటర్స్ జీఎస్‌పీ తేజ 35 పరుగులతో, సుబ్రహ్మణ్యం 22 పరుగులతో క్రీజులో ఉన్నారు.

వైవీఆర్ వీధిలో అన్నీ సమస్యలే

● రోడ్డుకంటే ఎత్తులో సైడు కాల్వల గోడలు ● కొన్నిచోట్ల పూడ్చేశారు ● వర్షం వస్తే రోడ్డు మునకే ● 11వ డివిజన్ వైవీఆర్ వీధి వాసుల వెతలు

(ఆంధ్రజ్యోతి, మొగల్రాజపురం)

పటమట పరిధిలో ఉన్న 11వ డివిజన్‌లో వైవీఆర్ వీధి అంటే తెలియని వారు ఉండరు. హైస్కూల్ రోడ్డుకు తూర్పు వైపున బందర్ రోడ్డు స్వీట్ మ్యాజిక్ నుంచి పటమట హైస్కూల్ వరకు పెద్దగా ఉండే ఈ రోడ్డులో పారిశుధ్యం సరిగా ఉండదు. సైడు కాల్వలు రోడ్డు కంటే ఎత్తులో ఉంటాయి. కొత్తగా భవనాలు, అపార్టుమెంట్‌లు నిర్మించుకున్న వారు తమ ఇళ్ల ముందు సైడు కాల్వ గోడలు ఎత్తుగా కట్టేసుకున్నారు. ర్యాంపులు వేసుకున్నారు. కొన్నిచోట్ల సైడు కాల్వలు పూడుకుపోయాయి. మరి కొన్నిచోట్ల పూడ్చేకుని దాని మీద కార్లు పార్కింగ్ చేసుకుంటున్నారు. దీంతో వర్షం పడితే రోడ్డు మొత్తం మునిగిపోతుంది. రోడ్డు మట్టానికి ఉన్న ఇళ్లు మునిగిపోతున్నాయి. ఇంత పెద్ద రోడ్డులో రైతు బజార్‌కు వెళ్లడానికి క్రాస్ రోడ్డు కూడా ఉంది. ఈ క్రాస్ రోడ్డు వద్ద రెండు వైపులా రోడ్డు పల్లంగా ఉండటంతో వర్షం నీరు నిలిచిపోతోంది.



సైడు కాల్వలో టెలిఫోన్ స్తంభం



సైడు కాల్వలు మూసేస్తూ ఇళ్ల ముందు ర్యాంపులు, రోడ్డు కంటే ఎత్తుగా సైడు కాల్వ గోడలు

సైడు కాల్వలు, రోడ్డు సమస్య

ఎపుడో వేసిన సిమెంట్ రోడ్డు ఇపుడు పల్లంగా మారింది. రోడ్డు కంటే సైడు కాల్వలు ఎత్తులో ఉన్నాయి. ఒక వైపు సైడు కాల్వలు పూడిపోయాయి. వర్షం వస్తే రోడ్డు మొత్తం చెరువులా మారుతుంది. పారిశుధ్యం కూడా అంతంత



మాత్రమే. వర్షాకాలం కావడంతో దోమల బాధ కూడా ఉంది. అధికారులు స్పందించి సైడు కాల్వలను మరమ్మతులు చేయాలి. రోడ్డు ఎత్తు పెంచాలి.

-ఎల్ ప్రసాద్ (స్థానికుడు)

మహిళ మెడలో నానుతాడు చోరీ

గుణదల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ అయినట్లుగా మాచవరం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం లయోల గార్డెన్స్ వద్ద గల అమరావతి హైట్స్‌లో ఉంటున్న చిటికిన రామలక్ష్మి సోమవారం ఉదయం వాకింగ్ చేసేందుకు వెటర్నరీ కాలనీలోని పార్క్ వద్దకు వస్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన యువకుడు ఆమె మెడలోని నానుతాడును తెంపుకెళ్లే ప్రయత్నం చేశాడు. ఆమె గట్టిగా అరుస్తూ నానుతాడు పట్టుకుంది. ఈ క్రమంలో నానుతాడు తెగి అతని చేతిలోకి వెళ్లగా రామలక్ష్మి చేతిలో మంగళసూత్రాలు మిగిలాయి. దీంతో ఆమె తేరుకుని సమాచారాన్ని మాచవరం పోలీసులకు తెలియజేసింది. మాచవరం సీఐ ప్రకాష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. ఆగంతకుడి వయస్సు, ఏ రంగు షర్టువేసుకుని ఉన్నాడు తెలుసుకుని వెంటనే సెట్‌లో సమాచారం తెలియజేశారు. నానుతాడు ఐదు తులాలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం పోలీసులు తెలిపారు.



రక్తదానం చేస్తున్న బెజవాడ నజీర్

పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

-బెజవాడ నజీర్

పటమట,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని యువజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ నజీర్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పటమట సీఐ పవన్‌కిషోర్ సహకారంతో యువజన చైతన్య వేదిక సభ్యులు, అధ్యక్షుడు నజీర్ సోమవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నజీర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు రక్షణ కవచంలా ఉంటూ,శాంతి భద్రతలను కాపాడటంలో అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసులను స్మరించుకోవాలన్నారు. సగ్గుర్తి వంశీ, దన్నాన రాము, లోకేష్, గౌతమ్ పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతికి ఐటీఐలు కీలకం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రగతికి ఐటీఐలు ఎంతో కీలకమని, వాటి అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌డీసీల సిబ్బంది సంఘం 13వ రాష్ట్ర మహాసభ సోమవారం అమ్మ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధికి, పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలను కల్పించే ఐటీఐలు ముఖ్యమైనవని అన్నారు. ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా ఐటీఐలను తీర్చిదిద్దడానికి సీడాప్, ఎంఎస్‌ఎంఈ, నిడ్‌క్యాప్, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థల సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి అధునీకరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఐటీఐలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత నాయకులు ఉద్యోగ భర్తీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్‌జీవో అధ్యక్షుడు కేవీ శివారెడ్డి చెప్పారు. ఐటీఐ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కె. రామ్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పుట్టగుంట రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కె.రత్నరాజు, కోశాధికారి కెఎస్. శ్రీనివాస్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎల్.సుధాకర్‌రావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసుల రెడ్డి, కృష్ణకిషోర్, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంఘం సభ్యులు పాల్గొన్నారు.



యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

భూగర్భ డ్రెయినేజీ, రహదారి నిర్మాణం పనులకు శంకుస్థాపన

22వ డివిజన్‌లో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రెయినేజీ, రహదారి నిర్మాణం పనులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సోమవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించి బాగు చేసి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు వస్తామని చెప్పారు. డివిజన్ అధ్యక్షుడు పలిశెట్టి అన్నారావు మాట్లాడుతూ డివిజన్‌లో డ్రెయిన్లు, రహదారులు, దోబీఖానా మోటార్లు తదితర సమస్య ఉందని చెప్పగానే ఎమ్మెల్యే గద్దె వీఎంసీ అధికారులతో మాట్లాడి అంచనాలు వేయించి పనులు చేపట్టారని ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొరిపర్తి నామేశ్వరరావు, వేముల పల్లి రంగారావు, తోట శ్రీను, నడికుప్పల శివ, పెద్ది అన్నారావు, విజ్జి మహేష్, పలిశెట్టి వంశీ, మజ్జి మాధవి తదితరులు పాల్గొన్నారు.

9వ డివిజన్‌లో..

పటమట: 9వ డివిజన్ చెన్నుపాటి రామకోటయ్య వీధిలో సుమారు రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన పనులకు, 10వ డివిజన్ మార్గ్ కృష్ణాయా హోటల్ దగ్గర రూ.10లక్షల వ్యయంతో చేపట్టిన యూజీడీ పనులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. తన పర్యటనలో స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవినేని అపర్ణ, ముమ్మనేని ప్రసాద్, నాయకులు చెన్నుపాటి గాంధీ, కొలగాని జగన్ మోహన్‌రావు, తంగెళ్లమూడి రాఘవయ్య, దండమూడి చంద్రశేఖర్, మండే జయప్రకాష్, యలమంచిలి దేవేంద్ర, ఈఈ సామ్రాజ్యంలు పాల్గొన్నారు.

సెమీస్‌కు బాక్సింగ్ పోటీలు

విజయవాడస్పోర్ట్సు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న 68వ స్కూల్‌గేమ్స్ అండర్-19 బాక్సింగ్ బాల,బాలికల చాంపియన్‌షిప్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. రెండోరోజు సోమవారం వివిధ కేటగిరుల్లో బాల,బాలికలు సెమీస్‌కు చేరుకున్నారు. రాత్రి కూడా పోటాపోటీ మ్యాచ్‌లు సాగుతున్నాయి. ఈ పోటీలు మంగళవారంతో ముగియనున్నాయి. క్రీడా పోటీలను ఎస్‌జీఎఫ్-19 సెక్రటరీ వి.రవికాంత పర్యవేక్షిస్తున్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ జాతీయ సదస్సులో విజయవాడ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు బహుమతులు

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 27 వరకు హర్యానా రాష్ట్రంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ జాతీయ సదస్సులో విజయవాడ నర్సింగ్ కళాశాలకు చెందిన వైద్య విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలుసుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ నాగశేషమ్మ సోమవారం తెలిపారు.

16 రాష్ట్రాల మధ్య జరిగిన క్రీడలు, సాంస్కృతిక, నృత్య పోటీల్లో ప్రతిభ కనబర్చి తమ విద్యార్థులు బహుమతులు సాధించినట్లు ఆమె తెలిపారు. ఈమేరకు విద్యార్థులతో పాటు ప్రోగ్రాం ఆఫీసర్ కడియం శ్రీదేవిని ప్రిన్సిపాల్ అభినందించారు.



సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులకు పతకాలు

విజయవాడ కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజుల క్రితం జరిగిన స్కూల్‌గేమ్స్‌లో సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. జూనియర్ ఇంటర్ విద్యార్థిని నిషా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెక్స్ 800, 1500 మీటర్లలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. కర్నూలులో నిర్వహించిన అండర్- 19 విభాగంలో అథ్లెటిక్స్‌లో 800, 1500 మీటర్ల విభాగంలో ఐదో స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. జూనియర్ సీఈసీ విద్యార్థిని భవిష్య యోచిత అండర్- 19 తైక్వాండో విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైంది. వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ అభినందించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి చెక్కు అందజేత



భారతీనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయర్థం ముఖ్యమంత్రి సహాయనిధికి విజయవాడ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.1.50లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొర్రపాటి సురేంద్రబాబు, అసోసియేషన్ సభ్యులు నూతలపాటి కుమార్, సూరపనేని రామోజీ, కొత్తఫణి,4వ డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

పీబీ సిద్ధార్థలో పీసీవోఎస్‌పై సదస్సు

మొగల్రాజపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాల మహిళా సాధికారిత విభాగం సోమవారం వివో లైఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో పీసీవోఎస్‌పై ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఓబీజీ ఎయిమ్స్ ఎండీ డాక్టర్ వీరమాచనేని పద్మజ మాట్లాడుతూ యవ్వన దశలో జరిగే మార్పులు, ఆ సమయంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను విద్యార్థినులకు వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లు, జాగ్రత్తలు, వ్యాయామాలను తెలియజేశారు. సర్వైకల్ కేన్సర్‌కు సంబంధించి విద్యార్థినులు అడిగిన సందేహాలకు సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో లైఫ్ సైన్సెస్ మనేజర్ కల్యాణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్, మహిళా విభాగం కన్వీనర్ ఏ. కవిత, రమణ, సువర్చల, శ్రీలేఖ, సభ్యులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో డాక్టర్ పద్మజను సత్కరించారు.



డాక్టర్ పద్మజను సత్కరిస్తున్న అధ్యాపకులు

చెత్త, వ్యర్థాలతో మురుగుకాల్వ

● పారుదల లేక దుర్వాసన ● స్థానికుల అవస్థలు



కనకదుర్గ నగర్‌కాలనీ సమీపంలో మురుగు కాల్వ

భారతీనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పూడికతో నిండిన మురుగు కాల్వతో కనకదుర్గ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురునానక్ కాలనీ నుంచి భారతీనగర్ మీదుగా మురుగు కాల్వ ప్రవహించి కనకదుర్గ నగర్ సమీపంలోని గుంటతిప్ప డ్రెయినేజీలు కలుస్తుంది. ఈ కాల్వ పలు ప్రధాన కాలనీల మధ్య ప్రవహిస్తుంది. ప్రస్తుతం మురుగు కాల్వ పలు చోట్ల చెత్త, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో నీరు ప్రవహించే దారి లేకపోవడంతో రోజుల తరబడి నీరు నిల్వ ఉండి రంగు మారి దుర్వాసన వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యర్థాలతో పూడుకుపోయిన డ్రెయినేజీలు

పటమట: స్థానిక నిర్మలా హైస్కూల్ సమీపంలో శ్రీనివాస హోటల్ వద్ద సైడుకాల్వలో ప్లాస్టిక్ వ్యర్థాలు, సీసాలు డ్రెయినేజీలో పడేయటం వలన మురుగునీరు పారుదల లేకుండా పోయింది. వర్షాలు పడితే నీళ్లు పోయే మార్గం లేక రోడ్డు మొత్తం మురుగునీటితో జలమయం అవుతోంది. శ్రీనివాస హోటల్ ముందు భాగంలో ఫ్రూట్ జ్యూస్ స్టాల్ ఉంది, జ్యూస్ తాగిన గ్లాసులు, వ్యర్థాల మురుగు కాల్వలో వేస్తున్నారు. సంబంధింత అధికారులు స్పందించి మురుగునీటి కాల్వ పారేలా శుభ్రం చేయాలని కోరుతున్నారు.



కార్తీక ద్వీపం



దెబ్బతిన్న భవానీ ఐల్యాండ్‌ను వేగంగా పునరుద్ధరించటం సాధ్యమేనా..?

- పట్టుదలతో ముస్తాబు చేస్తున్న అధికారులు
- టవర్ వద్ద కోతకు గురైన ప్రాంతంలో ఇసుక బస్తాలు
- పాత్‌వేలు, లాన్లు ఇప్పటికే సిద్ధం
- నవంబరు 1 నాటికి అందుబాటులోకి..!
- బుకింగ్స్ పెరగటంతో ఆనందంలో అధికారులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: కార్తీక మాసానికి వేదికయ్యేందుకు భవానీ ఐల్యాండ్ ముస్తాబౌతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భవానీ ఐల్యాండ్‌లో అనేక ప్రత్యేక ఆకర్షణలు ఏర్పాటు చేయడంతో ఆ ఐదేళ్లు సందర్శకులతో ఐల్యాండ్ పోటెత్తింది. కానీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలోని ఐదేళ్లలో మొదటి ఏడాది వరదలు, తర్వాత రెండేళ్లు కరోనాతో కార్తీక మాసంలో సందడి లేకుండా పోయింది. చివరి రెండేళ్లు అవకాశం చిక్కినా ఆ స్థాయిలో సందర్శకులు రాలేదు. ఒక్క కార్తీకమాసంలోనే ఏపీటీడీసీ అధికారులు భవానీ ద్వీపం ద్వారా రికార్డు స్థాయి ఆదాయాన్ని సాధించేవారు. సంస్థకు మంచి ఆదాయం తెచ్చేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని ద్వీపాన్ని సందర్శకులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇటీవల కృష్ణాకు వచ్చిన మహోగ్ర వరద కారణంగా ఐల్యాండ్ తీవ్రంగా దెబ్బతినటంతో ఈ కార్తీక మాసానికి ఐల్యాండ్ సిద్ధం కాలేదేమో అనుకున్నా అధికారుల పట్టుదలతో మరికొద్ది రోజుల్లో సందర్శకులకు అందుబాటులోకి రానుంది. ఈ ద్వీపాన్ని పునరుద్ధరించటానికి లక్షలాది రూపాయలను ఖర్చు చేయాల్సి రావటంతో పాటు, కాలాతీతం అయ్యే అవకాశాలున్నాయి. అధికారులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో కార్తీకానికి ఐల్యాండ్‌ను అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో పనిచేయటంతో ఇప్పుడిప్పుడే కళ సంతరించుకుంటోంది. నవంబరు 1 నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుండటంతో అప్పటి కల్లా ద్వీపాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు పనులు కొనసాగిస్తున్నారు. వనసమారాధనకు వచ్చేవారిని దృష్టిలో పెట్టుకుని అందుకు తగ్గట్టుగా తీర్చిదిద్దుతున్నారు. ఐల్యాండ్ పశ్చిమ భాగంలో పేరుకున్న ఇసుక తిన్నెలను ఇప్పటికిప్పుడు తొలగించి పునరుద్ధరించటం కష్టసాధ్యమైనా వీటితో సందర్శకులకు ఇబ్బంది ఉండదని భావించారు. పైగా ఇసుక తిన్నెలపై పిల్లలు ఆడుకుంటారు కాబట్టి వాటిని కదల్చకూడదని నిర్ణయించారు. ద్వీపం ముఖద్వారం నుంచి కాటేజీల వరకు లోపలున్న పాత్‌వేలు, లాన్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఎక్కడికక్కడ జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయి. ఉదయం నుంచి చీకటిపడే వరకు రోటోవీవర్లతో గడ్డిని కోయించి మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. ఆట పరికరాలు, ఓపెన్ జిమ్, ఓపెన్ మ్యూజిక్ ఏరియాలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలను చేస్తున్నారు. లాగే రెస్టారెంట్లను అందుబాటులోకి తెస్తున్నారు. ప్రస్తుతానికి సందర్శకులు ప్రవేశానికి వీలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ సందర్శకులు ఇష్టపడేది టవర్ లొకేషన్. ప్రతి ఒక్కరూ ఇక్కడి కొచ్చి సెల్ఫీలు దిగుతుంటారు. వరద కారణంగా టవర్ ప్రాంతమంతా కోతకు గురైంది. చుట్టూ కొంతమేర నీరు వచ్చి చేరింది. సందర్శకులు ఇటు వచ్చినపుడు ప్రమాదం జరగకుండా ఇసుక బస్తాలను సిద్ధం చేస్తున్నారు. అసాధ్యమనుకున్న పనులను అధికారులు వేగంగానే చేయిస్తున్నారు. మరోవైపు భవానీ ఐల్యాండ్‌లో పార్టీలకు బుకింగ్‌లు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. సమయం గడుస్తున్న బుకింగ్ కోసం మరింత డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. మరోవైపు బోటింగ్ యూనిట్, హరిత బెర్మ్‌పార్క్‌ను ఇప్పటికే ముస్తాబు చేశారు. సందర్శకులు ముందుగా ఇక్కడికి వచ్చి తమ వాహనాలను పార్క్ చేసుకుని నేరుగా బోటింగ్ యూనిట్‌కు వెళ్లి టికెట్ తీసుకుని బోట్లపై ద్వీపానికి చేరుకుంటారు. ఎక్కడా సందర్శకులు ఇబ్బంది పడకుండా అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు.



జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న సిబ్బంది





ఇసుక మూటలను సిద్ధం చేస్తున్న కూలీలు



సీఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్కు అందజేస్తున్న బ్యాంకు ఉన్నతాధికారులు

బ్యాంక్ ఆఫ్ బరోడా విరాళం రూ.కోటి

లబ్బీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం బ్యాంక్ ఆఫ్ బరోడా కోటి రూపాయలు విరాళాన్ని సీఎం చంద్రబాబుకు బ్యాంక్ ఉన్నతాధికారులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులను సీఎం చంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదలతో ఎంతోమంది ప్రజలు ఇబ్బందులు పడ్డారని వారిని ప్రభుత్వం ఆదుకుంటోందని అందులో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా తన వంతు సాయంగా రూ.కోటి విరాళాన్ని సీఎం సహాయనిధికి అందజేసిందన్నారు. జోనల్ హెడ్ అండ్ జనరల్ మేనేజర్ హైదరాబాద్ జోన్ రితిష్ కుమార్, డీజీఎం ఎంవీఎస్ సుధాకర్, డీజీఎం, రీజినల్ హెడ్ చందన్ సాహూ పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో కేఎస్ రామారావు

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి శేఖర్

వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కనకదుర్గమ్మను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి టీసీడీ శేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఈవో కేఎస్ రామారావు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

అమ్మవారికి ఫ్యాన్సీ నెక్లెస్ కానుక



రాజమండ్రి పీఅండ్‌టీ కాలనీకి చెందిన కేశమ శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులు అమ్మవారి అలంకరణ నిమిత్తం 18 గ్రాముల బంగారు ఫాన్సీ నెక్లెస్‌ను కానుకగా అందజేశారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన కేశవ శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజును కలిసి దేవస్థానానికి 18 గ్రాముల బంగారు ఫ్యాన్సీ నెక్లెస్‌ను కానుకను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి ఆశీర్వచనం, శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

డబుల్ ధమాకా

(5వ పేజీ తరువాయి) సవివర నివేదిక కోసం కన్సల్టెన్సీకి అప్పగించారు. వారిచ్చే నివేదికను పరిగణనలోకి తీసుకుని, ఫ్లై ఓవర్ డీపీఆర్ రూపొందించి, అందుకయ్యే వ్యయం, ఇతర అంశాలను క్రోడీకరిస్తారు. తుది డీపీఆర్ పూర్తయ్యాక కేంద్రానికి పంపిస్తారు. కేంద్రం నుంచి ఆమోదం రాగానే టెండర్లు పిలుస్తారు. ముందుగా సాధారణ ఆరు వరసల ఫ్లై ఓవర్ నిర్మాణం ప్రారంభమవుతుంది. లైట్ మెట్రోరైల్ పనులు చేపట్టడానికి మరికొంత కాలం పట్టే అవకాశం ఉంది. దీంతో ఫ్లై ఓవర్ పనులు ఒక దశకు వచ్చాక మెట్రో ఎలివేటెడ్ కారిడార్ పనులు జరిగే అవకాశం ఉంది.

గొల్లపూడి వద్ద సర్కిల్ రోడ్డు

విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డులో అంతర్భాగంగా ఎన్‌హెచ్-65, 16 కలిసే గొల్లపూడి వద్ద సర్కిల్ జంక్షన్‌ను అభివృద్ధి చేసేందుకు వీలుగా ఎన్‌హెచ్ అధికారులు కేంద్రానికి ప్రతిపాదన పంపారు. కేంద్రం నుంచి అనుమతి రావటంతో నివేదికను రూపొందించాల్సిందిగా కన్సల్టెన్సీ సంస్థను ఆదేశించారు. వారిచ్చే నివేదిక ప్రకారం ఈ ప్రాంతంలో సర్కిల్ జంక్షన్ పనులు చేపడతారు.

ఆటంబాంబ్

(5వ పేజీ తరువాయి) వనరుల అన్వేషణలో భాగంగా బకాయిలపై దృష్టి పెట్టారు. కొద్దిరోజుల క్రితం దుర్గగుడికి పన్ను చెల్లింపు నోటీసులూ అందులో భాగమే. స్టేడియంలోని క్రీడాసంఘాలు యూజర్ చార్జీలను బకాయిలు సహా చెల్లించాలంటూ ఈనెల 25న నోటీసులు జారీ చేశారు. 2011 జనవరి నుంచి 2024 సెప్టెంబరు వరకు (165 నెలలు) యూజర్ చార్జీ బకాయిలు చెల్లించాలని నోటీసుల్లో కోరారు. చెల్లించకపోతే గది ఖాళీచేసి వెళ్లాలని, లేనిపక్షంలో వీఎంసీ స్వాధీనపరుచుకుంటుందని పేర్కొన్నారు.

క్రీడా సంఘాల ఆగ్రహం.. సీఎంకు లేఖ

స్టేడియం 1972 నుంచి క్రీడాకారులకు అందుబాటులో ఉందని, అప్పటి నుంచి పలు క్రీడాసంఘాలు.. క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నాయి. 1990లో గ్యాలరీలను నిర్మించిన తర్వాత మరింత ఉత్సాహంగా ఇక్కడ క్రీడాసంఘాలు తమ కార్యకలాపాలను నిర్వహించుకుంటూ వస్తున్నాయి. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పనిచేస్తున్న తమపై ఆర్థికభారం మోపేలా వీఎంసీ అధికారులు నోటీసులు జారీ చేయడాన్ని క్రీడాసంఘాలు తప్పుబడుతున్నాయి. జిల్లా క్రీడా సంఘాల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా వీఎంసీ కమిషనర్‌ను ఆదేశించాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కేపీ రావు లేఖ రాశారు. పదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా క్రీడాసంఘాలకు ఆర్థిక చేయూతను ఇవ్వలేదని, ఆయా సంఘాలు స్వయంగా డబ్బు ఖర్చుచేస్తూ క్రీడాకారులకు తర్ఫీదునిచ్చి జాతీయ స్థాయిలో ఆడేలా తీర్చిదిద్దుతున్నాయని లేఖలో పేర్కొన్నారు. ఏవో కొన్ని సంఘాలు సక్రమంగా పనిచేయడం లేదన్న కారణంగా అన్నింటిపై భారం మోపడం సరికాదని, తక్షణం ఈ నిర్ణయం ఉపసంహరించుకునేలా కమిషనర్‌ను ఆదేశించాలని కోరారు.

8 లేన్ల విస్తరణ

(5వ పేజీ తరువాయి)ఏది అవసరమో దానిని ఖచ్చితత్వంతో నిర్దేశించాల్సిందిగా కన్సల్టెన్సీ సంస్థకు సూచించారు. తుది డీపీఆర్ వచ్చిన తర్వాతే 6 వరసలా? 8 వరసలా అన్న దానిపై స్పష్టత వస్తుందని విజయవాడ డివిజన్ ఎన్‌హెచ్ పీడీ శ్రీధర్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ప్రస్తుత అవసరాల నేపథ్యంలో విజయవాడ-హైదరాబాద్ ఎన్‌హెచ్-65 ఎన్ని లేన్లు అవసరమో నిర్ణయించి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కన్సల్టెన్సీ సంస్థ డీపీఆర్‌ను ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ఎన్‌హెచ్ - 65 నాలుగు వరసలుగా ఉంది. విజయవాడ - హైదరాబాద్ మార్గంలో ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రయాణం 5 గంటలకుపైగా సమయం పడుతోంది. ప్రస్తుత పరిస్థితులలో 6 వరసలుగా విస్తరించినా.. సరిపోదన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. ప్రస్తుతం ఆరు వరసలు తథ్యం. రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి కావటంతో ఖచ్చితంగా దీర్ఘకాలిక అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. దీన్ని దృష్టిలో పెట్టుకుని కన్సల్టెన్సీ సంస్థ 8 వరసలుగా విస్తరించేందుకు ప్రతిపాదించే అవకాశం కనిపిస్తోంది.

వాహన రాకపోకల గణన ప్రారంభం

హైదరాబాద్ - విజయవాడల మధ్య వాహనాల రద్దీపై కన్సల్టెన్సీ సంస్థ అధ్యయనం ప్రారంభించింది. కలకత్తా నుంచి హైదరాబాద్ వైపు వచ్చే వాహనాలతో పాటు, మచిలీపట్నం, గుంటూరు మీదుగా వచ్చే వాహన రాకపోకలపై అధ్యయనం చేపట్టింది. ఇంజనీరింగ్ విద్యార్థులతో టోల్‌గేట్ల వద్ద వాహన గణాంకాలను నమోదు చేయిస్తున్నారు. ఈ రద్దీ ప్రాతిపదికన 8 వరసలుగా విస్తరించే అంశంపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో కీసర, చిల్లకల్లు టోల్‌గేట్ల దగ్గర, కృష్ణాజిల్లాలో పొట్టిపాడు టోల్ ప్లాజా, దావులూరు టోల్‌ప్లాజాల దగ్గర వాహన లెక్కలు తీస్తున్నారు. ఈ అధ్యయనానికి సంబంధించి రెండు కారణాలు కనిపిస్తున్నాయి. విజయవాడ - హైదరాబాద్ మార్గంపై వాహనాల రద్దీని తెలుసుకోవటమనేది ఒకటైతే.. ఈ వాహనాల ఆధారంగా టోల్ చార్జీల వసూలు అంచనాలకు రావడం మరో కారణం.

87 కిలో మీటర్ల మేర ఎన్‌హెచ్-65 విస్తరణ

విజయవాడ - హైదరాబాద్‌ల మధ్య ఎన్‌హెచ్-65 విస్తరణ ఎన్టీఆర్ జిల్లాలో 87 కిలో మీటర్ల మేర సాగనుంది. విజయవాడను ఆనుకుని గొల్లపూడి నుంచి కోదాడ వరకు 6/8 వరసలుగా విస్తరించనున్నారు. గతంలో కోదాడ నుంచి నందిగామ వరకు మాత్రమే 6 వరసల విస్తరణ ప్రతిపాదన ఉంది. నందిగామ వరకు విస్తరించటం కంటే విజయవాడ వరకు తేవటం మంచిదన్న ప్రతిపాదనలు రావటంతో.. అధికారులు గొల్లపూడి వరకు పొడిగించారు. ఈ మేరకు డీపీఆర్ తయారు చేయాల్సిందిగా కన్సల్టెన్సీ సంస్థకు కూడా నిర్దేశించారు.

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా ఏవీ రావు

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్వజనాసుపత్రి నూతన సూపరింటెండెంట్‌గా ఎ.వెంకటేశ్వరరావు (ఎ.వి రావు)ను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏవీరావు ఇదే ఆసుపత్రిలో కొన్నేళ్లుగా మత్తు విభాగాధిపతిగా పని చేస్తున్నారు. మంచి ప్రవర్తన కలిగిన ఆయనకు పదోన్నతిపై సూపరింటిండెంట్‌ను చేశారు. ఇక్కడ సూపరింటిండెంట్‌గా పనిచేస్తున్న డి.వెంకటేశ్వరరావును అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా పదోన్నతి కల్పించారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ఆటోనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆటోనగర్ డిపో మేనేజర్ కె.ప్రవీణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2, 3, 4, 9, 10, 11, 15, 16, 17, 18, 23, 24, 25 తేదీల్లో సూపర్ లగ్జరీ బస్సులను ఉదయం 3 గంటలకు ఆటోనగర్ నుంచి, పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి ఉదయం 4 గంటలకు బస్సులు ప్రారంభమవుతాయన్నారు. రిజర్వేషన్‌తో కలిపి చార్జీ రూ.1140 ఉంటుందన్నారు. వివరాలకు 7382899266, 8074298487లను సంప్రదించాలని కోరారు.

కెజ్రీవాల్‌పై దాడి సరికాదు

ధర్నాచౌక్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కెజ్రీవాల్‌పై ఎన్నికల ప్రచారంలో భాగంగా వికాస్‌పూరిలో ఈ నెల 25న దాడి చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే నారాయణ, మాజీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఎం నేత వైవీ రావు, ఆమ్‌ఆద్మీ పార్టీ జోన్ సి కో-ఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు ఖండించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రామకృష్ణ మాట్లాడుతూ వ్యవస్థలను వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యవాదులంతా ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. వైవీ రావు మాట్లాడుతూ కెజ్రీవాల్‌ను కేసులతో ఇబ్బందులు పెడుతూ రాజకీయంగా అడ్డు తొలగించుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ కంభంపాటి కృష్ణ, ముస్లింలీగ్ నేత ఖాజావలి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 30కి మంది జరిమానా

విజయవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 30 మందికి రైల్వే కోర్టు జరిమానా విధించింది. మూడో ట్రాఫిక్ స్టేషన్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన 30 మందిని కోర్టులో సోమవారం హాజరుపరిచారు. వారిలో ఒక్కొక్కరికి రూ.10వేల రిమానా విధించింది.

షర్మిల జోలికొస్తే సహించేది లేదు

- సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి

గవర్నర్‌పేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జగన్ రాసిచ్చిన స్క్రిప్ట్ ప్రకారమే వైసీపీ నేతలు రాజశేఖరరెడ్డి బిడ్డ వైఎస్ షర్మిలారెడ్డిపై విషం చల్లుతున్నారని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు అన్నారు. సోమవారం సిటీ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డిపై వైసీపీ నేతలు గుడివాడ అమర్‌నాథ్, అంబటి రాంబాబు, పేర్ని నాని, భూమన కరుణాకరరెడ్డి, విజయసాయిరెడ్డి విషం చిమ్మడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. కుటుంబ విషయంలో జగన్మోహనరెడ్డి, షర్మిల మాట్లాడుకోవడం గురించి వీరికెందుకు బాధ కలిగిందన్నారు. ఏపీ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు వి.గురునాథం, ఏపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ నజీర్, అమరావతి ప్రాంత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మినేని సురేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ గౌరవాధ్యక్షుడు కాశీనాథ్

చిట్టినగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కారంతోపాటు పార్కు, వాటర్, హెహికల్ డిపో మెకానిక్ సెక్షన్ కార్మికులందరికీ జీతాలు పెంచాలని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నగర గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో డివిజన్ల జనాభా ప్రకారం కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. క్లాప్ ఆటో కార్మికులకు జీతాలు పెంచి ఇవ్వాలన్నారు. పర్మినెంట్ కార్మికులు 45 మందికి వరదల్లో ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారికి రావాల్సిన 12 రోజుల జీతం బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐలో ఉన్న టెక్నికల్ ఇబ్బందులు సరిచేసి కార్మికులందరికీ వర్తింపజేయాలన్నారు. హెహికల్ డిపోలో 35 మంది క్లీనర్లను డ్రైవర్లుగా ప్రమోట్ చేయాలన్నారు. మెకానిక్ విభాగంలోనూ సీనియార్టీ ప్రకారం హెల్పర్లను మేస్త్రీగా ప్రమోట్ చేయాలన్నారు. ప్రతి కార్మికునికి ఇన్సూరెన్స్ రూ.25లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాల్లో వారి పిల్లలకు వెంటనే ఉద్యోగం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకివ్వాల్సిన సబ్బులు, నూనె ఇతర సామగ్రి క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. అనంతరం చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, యూనియన్ నగరాధ్యక్షుడు జ్యోతిబస్, నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ టీ ప్రవీణ్, నగర ఉపాధ్యక్షుడు ధనికొండ వెంకటేశ్వరరావు, నేతలు నాగరాజు, దుర్గాప్రసాద్, సుందరయ్య తిరుపతమ్మ, జే.విజయలక్ష్మి పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు



స్థూపం వద్ద విజయసూచిక చూపిస్తున్న సాగునీటి సంఘాల నేతలు

నీటి సంఘాల ఎన్నికల పట్ల

ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాలో మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టుల్లోని సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఉమ్మడి కృష్ణాజిల్లా రాష్ట్ర జల వనరుల శాఖ ఎపెక్స్ కమిటీ మాజీ సభ్యుడు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు, కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ యనమద్ది పుల్లయ్య చౌదరి హర్షం వ్యక్తం చేశారు. 2014-19లో సాగునీటి సంఘాలు విజయవంతమైన సందర్భంగా 2018లో ప్రకాశం బ్యారేజీ దిగువన కృష్ణాతూర్పు డెల్టా ప్రధాన రెగ్యులేటర్ ప్రారంభం సందర్భంగా నాటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించిన స్థూపం వద్ద సోమవారం ఎ.గోపాలకృష్ణారావు, గుత్తా శివరామకృష్ణ, వై.పుల్లయ్యచౌదరి, ఎన్.దిలీప్ కుమార్, జి.శ్రీనివాసరావు, బొర్రా అశోక్ కుమార్ విజయసూచిక చూపిస్తూ హర్షం వ్యక్తం చేశారు. గోపాలకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టుల్లో 71 లక్షల ఆయుకట్టుకు 49 వేలు ప్రాదేశిక నియోజకవర్గాలకు, 6,149 సాగు నీటి సంఘాలకు, 245 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 53 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. కృష్ణాజిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్, ఉమ్మడి కృష్ణాజిల్లా నీటి సంఘాల ప్రతినిధులు వీరంకి వెంకటేశ్వరరావు, మంతెన రామాంజనేయులు, జాలిపర్తి ప్రసాద్, గుమ్మడి దేవేంద్ర రాజు, జంగా చెంచురెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌బీఐ-90 క్విజ్ పోటీలు విజయవంతం

- రాష్ట్రస్థాయి విజేతగా ఐఐపీఈ - విశాఖపట్నం బృందం


వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) స్థాపించి 90 ఏళ్లయిన సందర్భంగా నిర్వహించిన ఆర్‌బీఐ-90 జాతీయ క్విజ్ పోటీల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలు విజయవంతంగా ముగిసినట్టు ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్ తెలిపారు. సెప్టెంబరు 19 నుంచి 21 వరకు ఆన్‌లైన్‌లో జరిగిన ప్రాథమిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల బృందాలకు సోమవారం విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. హోటల్ నోవాటెల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో 53 బృందాలకు చెందిన 166 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ, (ఐఐపీఈ-విశాఖపట్నం)కి చెందిన కృతజ్ఞ శర్మ, ఉజ్వల్ నారాయణ్ బృందం విజేతగా నిలిచిందని, అలాగే స్పెన్సస్ డిగ్రీ కళాశాల ద్వితీయ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ (కర్నూల్) తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. ప్రథమ విజేత బృందానికి రూ2 లక్షలు, ద్వితీయ బృందానికి రూ.1.5 లక్షలు, తృతీయ బృందానికి రూ.1లక్ష చెక్కులు ఇచ్చినట్టు చెప్పారు. విజేతగా నిలిచిన బృందం జోనల్ రౌండ్‌లో పోటీ పడుతుందని, ఈ పోటీలు ఈ ఏడాది నవంబర్ 21, డిసెంబరు 4 మధ్య జరుగుతాయన్నారు. జాతీయస్థాయి ఫైనల్ పోటీలు డిసెంబరులో ముంబయిలో జరగనున్నట్లు వివరించారు. ఆర్‌బీఐ ఎఫ్ఐడీడీ జీఎం మహేన్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అన్ని జిల్లాల ఎల్‌డీఎంలు పాల్గొన్నారు.



విజేతలకు చెక్కు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్

నైపుణ్య గణనకు సిద్ధమవ్వండి

- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా



వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరలో జిల్లాలో నైపుణ్యగణన (స్కిల్ సెన్సస్) ప్రక్రియ సజావుగా జరిగేందుకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి ఆమె ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లతో ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నవంబరు 3 నుంచి ప్రారంభం కానున్న సర్వేను విజయవంతంగా నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని, సిబ్బందిని సమాయత్తం చేయాలన్నారు. మంగళవారం ఒక్కో మండలం నుంచి ఇద్దరు చొప్పున సచివాలయం సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. సర్వేలో ప్రధానంగా విద్యార్హతలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు, ప్రస్తుత ఉపాధి వివరాలు, నైపుణ్యాలు, ఆకాంక్షలు, తదితర 25 రకాల ప్రశ్నల ద్వారా సమాచారం సేకరించాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌కు సంబంధించి అక్టోబరు 31న సెలవుదినం కావటంతో 30నే బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి నవంబర్ 1, 2న పెన్షన్ పంపిణీ పూర్తి చేయాలన్నారు. 2,33,248 మంది పెన్షన్‌దారులకు రూ.99.45 కోట్ల మేర పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఉదయం 6 గంటలకే పంపిణీ ప్రారంభించాలన్నారు. నీటి వినియోగదారు సంఘాల ఎన్నికలపైన ఆమె పలు సూచనలు చేశారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీపీవో లావణ్య, ఎన్.ఎస్.పి. ఇరిగేషన్ ఎస్ఈ శివరామకృష్ణ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి పాల్గొన్నారు.

నందిగామ కోర్టు జూనియర్ అసిస్టెంట్

అనుమానాస్పద మృతి



పద్మావతి భౌతికకాయం

జగ్గయ్యపేట, అక్టోబరు 28: నందిగామ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న స్థానిక ఆర్టీసీ కాలనీలో నివాసముంటున్న మహిళ మృతి చెందిన ఘటనపై జగ్గయ్యపేట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఆర్టీసీ కాలనీలో రామావతుల పద్మావతి (32) గతంలో జగ్గయ్యపేట కోర్టులో పనిచేసి ప్రస్తుతం నందిగామ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. భర్త వాసు జగ్గయ్యపేట సమీపంలో ఒక కర్మాగారంలో పనిచేస్తుండటంతో ఇక్కడ నుంచి ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె బాత్‌రూమ్‌లో ఉరేసుకున్నట్టు భర్త చెబుతున్నారు. వారికి చైతన్య సాయి నాయక్ (14) అనే కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య విభేదాలున్నాయని, భర్త ప్రవర్తనపై పద్మావతి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జగ్గయ్యపేట సీఐ పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఎస్సై వెంకటేశ్వరరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవ్య చిత్రజ్యోతి
విజయవాడ • మంగళవారం 29 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com

రచ్చ గెలిచి ఇప్పుడు ఇంట గెలిచా

చిరంజీవి



'ఏఎన్నార్ నేషనల్ అవార్డును' సోమవారం బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా చిరంజీవి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఏయన్నార్ అవార్డు దక్కడం నా పూర్వజన్మ సుకృతం. అమితాబచ్చన్ చేతుల మీదుగా ఈ అవార్డుని తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. మై గురు, మై మెంటర్ మై ఇన్స్పిరేషన్ అమితాబ్ బచ్చన్‌కి నా హృదయపూర్వక ధన్యవాదాలు. పద్మభూషణ్ అవార్డు వచ్చినప్పుడు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో అమితాబ్ బచ్చన్ 'చిరంజీవి కింగ్ ఆఫ్ ఇండియన్' సినిమా అని చెప్పడం నేను ఎప్పటికీ మర్చిపోలేను. నిజానికి ఆ మాట విని షేక్ అయ్యాను. ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఆ రోజు నేను ఆయనకి థాంక్స్ చెప్పానో లేదో కూడా తెలీదు. ఇండియన్ సినిమా లెజెండ్ అమితాబ్ బచ్చన్ నుంచి ఆ మాటలు రావడం ఎంతో స్ఫూర్తినిచ్చాయి. ఆయనతో గడిపిన ప్రతి క్షణం నాకు ఎంతో విలువైనది. నేను హిందీలో చేసిన 'ప్రతిబంధ్' సినిమా అమితాబ్‌కు చూపించా. ఆయన.. 'అద్భుతమైన సినిమా' అని ప్రశంసించారు. మా ఇంట్లో జరిగే ప్రతి శుభకార్యానికి ఆయన ఆశీర్వాదాలు తప్పకుండా ఉంటాయి. అమితాబ్ బచ్చన్ 'సైరా' సినిమాలో ఒక కామియో రోల్ చేశారు. ఆయనని ఎలా అడగాలో తెలియక మెసేజ్ పెట్టాను. అది చూసిన వెంటనే ఆ క్యారెక్టర్ చేస్తానని మాటిచ్చారు. సినిమా అంతా పూర్తయిన తర్వాత ఫార్మాలిటీస్ గురించి అడిగాను. 'నీపై ఉన్న ప్రేమతో చేశాను. యు ఆర్ మై ఫ్రెండ్. ఫార్మాలిటీస్ గురించి మాట్లాడొద్దు' అని చెప్పారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఆయనకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని దేవుడ్ని కోరుకుంటున్నాను. లాంగ్ లీవ్ అమితాబ్. తెలుగులో ఇంట గెలిచి రచ్చ గెలవాలి అని ఓ నానుడి ఉంది. నా విషయంలో రచ్చ గెలిచి ఇప్పుడు ఇంట గెలిచానేమో అనిపిస్తోంది.




నాన్న మెచ్చుకొనేవారు కాదు

నటుడిగా నేను ఎదుగుతున్న సమయంలో బయట ప్రేక్షకులు, సన్నిహితుల నుంచి ప్రశంసలు వచ్చేవి. అయితే ఇంటికి వెళ్లినప్పుడు మా నాన్న సినిమాలు చూసి పొగుడుతారేమో అని అనుకునేవాణ్ని. మా నాన్నకు నటన అంటే చాలా ఇష్టం. అలాంటి మా నాన్న నన్ను ఎందుకు మెచ్చుకోరు అనిపించేది. ఓ రోజు ఇంటికి వెళ్లినప్పుడు నా కవర్ పేజీలతో నిండి ఉన్న కొన్ని పుస్తకాలను చూస్తున్నారు. నేను వెళ్లేసరికి తీసి పక్కన పడేశారు. ఫొటోలు బాగున్నాయిరా అని ఓ మాట అంటారేమో అని అనుకున్నాను. కానీ ఆయన అలా అనలేదు. లోపలకు అమ్మ దగ్గరకు వెళ్లి.. 'ఏంటమ్మా నాన్న ఎప్పుడూ నా గురించి ఓ మాట అనరు, బాగుందని కూడా చెప్పరు' అని అడిగాను. బయట రచ్చ ఎంత గెలిచినా సరే.. ఇంట గెలవడం లేదు అని బాధ కలుగుతోంది అని అన్నాను. దానికి అమ్మ 'లేదురా నాన్న చాలా పొగుడుతారు. ఏం చేశాడు నా కొడుకు, అదరగొట్టేశాడు' అని అంటుంటారు అని చెప్పింది. మరి నా దగ్గర ఆ మాటలు అనొచ్చు కదా అని అమ్మను అంటే 'బిడ్డల్ని తల్లిదండ్రుల్ని పొగడకూడదు. అది వారికి ఆయుక్షీణం" అని అమ్మ చెప్పింది.

ఆ అవార్డు క్యాప్సుల్ బాక్స్‌లో పడేశా

సినిమా పరిశ్రమలో నేను తొలుత రచ్చ గెలిచాను. నా ఇల్లు అనుకునే పరిశ్రమలో నాకు ఆ అవకాశం టాలీవుడ్ వజ్రోత్సవాల సమయంలో వచ్చింది. లెజెండరీ పురస్కారం ప్రదానం చేశారు. ఆ సమయంలో చాలా ఆనందమేసి ధన్యుణ్ని అనుకున్నా. కానీ ఆ రోజు నేను ఆ అవార్డును అందుకోవడం కొందరికి నచ్చలేదు. అందుకే ఆ అవార్డుని ఓ క్యాప్సుల్ బాక్స్‌లో పడేసి నాకు సరైన అర్హత ఎప్పుడు వస్తుందో అప్పుడు తీసుకుంటాను అని చెప్పాను. ఈ రోజు 'ఏఎన్నార్ అవార్డు'ను అమితాబ్ బచ్చన్ చేతులు మీదుగా అందుకున్నప్పుడు.. 'నేను ఇంట గెలిచాను.. రచ్చ గెలిచాను' అని అనిపిస్తోంది. అందుకే ఈ పురస్కారం గురించి చెప్పడానికి నాగార్జున, వెంకట్ ఇంటికి వచ్చినప్పుడు నేను చాలా భావోద్వేగానికి లోనయ్యాను. నా వాళ్లు నన్ను గుర్తించి నాకు అవార్డు ఇస్తుండటం గొప్ప విషయం. అందుకే ఇది నాకు అన్ని పురస్కారాలకు విఎంచింది. ఈ వేడుకలో అమ్మని ముందు సీటులో కూర్చోబెట్టడానికి ప్రధాన కారణం.. అమ్మ నాగేశ్వరరావుకి సీనియర్ మోస్ట్ ఫ్యాన్. దేవానంద్, లతా మంగేష్కర్, అమితాబచ్చన్.. ఇలా ఎంతో గొప్ప వ్యక్తులకి వచ్చిన ఈ అవార్డు నాకు దక్కడం నా అదృష్టం. ఈ అవార్డు రావడంతో నా సినీ జీవితానికి ఒక పరిపూర్ణత ఏర్పడిందని భావిస్తున్నాను అని అన్నారు. "ఇండియన్ సినిమాకి నాగేశ్వరరావు చేసిన సేవలు అనితర సాధ్యం. నాగేశ్వరరావు వారసత్వాన్ని కొనసాగిస్తున్న నాగార్జునకి నా అభినందనలు" అని అమితాబ్‌బచ్చన్ అన్నారు. "ఏయన్నార్ అనే ఈ మూడక్షరాలే నాకు ప్రపంచం. నాకే కాదు మా కుటుంబం,స్నేహితులు, అభిమానులు అందరికీ. మా నాన్న మానవత్వాన్ని.. మనుషుల్ని.. సినిమాలను ఎక్కువగా నమ్మారు. భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండే అలాంటి గొప్ప వ్యక్తులని గౌరవించడం ఏయన్నార్ అవార్డు ముఖ్య ఉద్దేశం" అని నాగార్జున తెలిపారు.

సంక్రాంతికి సిద్ధం



విక్టరీ వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో దిల్ రాజు సమర్పణలో రూపుదిద్దుకుంటున్న తాజా చిత్రం షూటింగ్ పార్ట్ దాదాపు పూర్తయింది. తాజాగా డబ్బింగ్ కూడా ప్రారంభించారు. ఈ ట్రయాంగిల్ క్రైమ్ డ్రామాలో వెంకటేశ్ భార్యగా ఐశ్వర్య రాజేశ్, మాజీ గర్ల్ ఫ్రెండ్‌గా మీనాక్షి చౌదరి నటుస్తున్నారు. వినోదభరితంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతుందని నిర్మాత శిరీష్ చెప్పారు.

కామన్ మ్యాన్ కథ



దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్మెంట్స్‌పై నాగవంశీ నిర్మించారు. ఈనెల 31న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో మీడియాతో ముచ్చటించారు నటి మీనాక్షి చౌదరి. '1980 -90 నేపథ్యంలో సాగే కథ. ఈ మూవీలో భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఇందులో నేను మధ్య తరగతి గృహిణిగా నటించా. సవాల్ విసిరిన పాత్ర ఇది. డబ్బు కారణంగా మధ్యతరగతి మనిషి జీవితంలో, అతని కుటుంబంలో ఎలాంటి మార్పులు వచ్చాయనే దాని చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నేను మొదటిసారి తల్లి పాత్ర పోషించాను. ఇది నాకు కొంచెం ఛాలెంజింగ్‌గా అనిపించింది. నా చిన్నప్పుడు మా అమ్మ ఎలా ఉండేదో తెలుసుకొని, అందుకు తగ్గట్టుగా పాత్రలో ఒదిగిపోయాను. ఇందులో నేను పోషించిన సుమతి పాత్ర ప్రేక్షకులకు గుర్తుండి పోతుంది. ఫలానా పాత్రే చేయాలి...నా వయసుకు తగ్గ పాత్రలే చేయాలనే రూల్ పెట్టుకోలేదు. మంచి సినిమాలో భాగం కావాలి. దక్కిన పాత్రకు న్యాయం చేయాలి. ఇదే మొదటి నుంచి నేను ఫాలో అయ్యేది. మొదటి నుంచి నా ఆలోచన ఏంటంటే మంచి కథలు చేయాలి, మంచి టీమ్‌తో పనిచేయాలి. వయసుకు తగ్గ పాత్రలే చేయాలనే పరిమితిని నటులు పెట్టుకోకూడదు. ఒకే తరహా పాత్రలు చేస్తే నటులకే కాదు, ప్రేక్షకులకు కూడా బోర్ కొడుతుంది. అందుకే నటిగా పాత్రల ఎంపికలో వైవిధ్యం చూపించాలని అనుకుంటున్నాను. అందుకు తగ్గట్టుగానే సినిమాలను ఎంచుకుంటున్నా. ఇక ఈ సినిమా విషయానికొస్తే.. భాస్కర్ దగ్గర ఏమీ లేనప్పుడు తనని తనుగా ఇష్టపడుతుంది సుమతి. ప్రేమను పంచే కుటుంబం, బతకడానికి అవసరమైన డబ్బు ఉంటే చాలు అనుకునే స్వభావం తనది. అయితే దురాశ, డబ్బు కారణంగా భాస్కర్-సుమతి మధ్య ఏం జరిగిందనేది సినిమాలో ఆసక్తికరంగా ఉంటుంది. చిత్రంలో ఎమోషన్స్ బాగుంటాయి, ఫ్యామిలీ ఎలిమెంట్స్ ఉంటాయి. చూసిన ప్రతి ఒక్కరికీ సినిమా కనెక్ట్ అవుతుంది. ఇదొక కామన్ మ్యాన్ కథ. ఈ సినిమాతో నాకు నటిగా మంచి గుర్తింపు వస్తుందని, మరిన్ని మంచి కథలు వస్తాయని భావిస్తున్నా' అని చెప్పారు మీనాక్షి చౌదరి.

కావాలంటే నన్ను గిచ్చి చూడండి



హీరోయిన్లకు నెటిజన్ల నుంచి ప్లాస్టిక్ సర్జరీ కామెంట్ల రూపంలో ఎదురవుతున్న కొత్త తలనొప్పి రోజురోజుకీ ఎక్కువవుతోంది. ఇప్పటికే పలువురు హీరోయిన్ల పైన నెటిజన్లు విమర్శలు చేశారు. అలాగే కెరీర్ ఆరంభంలో నయనతార కూడా ప్లాస్టిక్ సర్జరీ చేసుకుందని నెటిజన్లు చేసిన విమర్శలపై నయనతార స్పందించారు. "నా కనుబొమలు అంటే నాకు చాలా ఇష్టం. ప్రతీ రెడ్ కార్పెట్ ఈవెంట్లకు ముందు నా కనుబొమల షేప్‌ను తప్పనిసరిగా మారుస్తుంటాను. కనుబొమల లుక్ మారినప్పుడల్లా ముఖం కొత్తగా కనిపిస్తుంటుంది. అందుకే చాలా మంది నా ముఖం మారినట్లు.. ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్లు భావిస్తారు. అయితే అది నిజం కాదు. ఒక్కోసారి డైటింగ్ వల్ల కూడా నా ముఖంలో మార్పులు రావొచ్చు. ఒకసారి బుగ్గలు వచ్చినట్లు కనిపిస్తాయి. మరోసారి అవి లోపలికి పోయినట్లు అనిపిస్తాయి. కావాలంటే మీరు నన్ను గిచ్చి చూడొచ్చు. నా బాడీలో అణువంత కూడా ప్లాస్టిక్ ఉండదు" అని నయనతార చెప్పారు.

క్షమాపణ చెబుతా



పొట్టేల్ చిత్రం సక్సెస్ మీట్‌లో సినిమా రివ్యూల మీద, రివ్యూ రైటర్స్ మీద చౌకబారు వ్యాఖ్యలు చేసిన నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ సోమవారం స్పందిస్తూ ఒక వీడియో విడుదల చేశారు. సినిమా ఎలా తీయాలో తెలియని వారంతా రివ్యూలు రాస్తున్నారని, సినిమా సమీక్షలు ఆపేయ్యాలని అంటూ ఆ వేదికపై మాట్లాడి బాధ కలిగించినందుకు శ్రీకాంత్ అయ్యంగార్ ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే అందరికీ బేషరతుగా క్షమాపణలు చెబుతానని అని ఆయన ఆ వీడియోలో పేర్కొన్నారు.

నాదీ గ్యారంటీ



హీరో కిరణ్ అబ్బవరం నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లు. ఈ నెల 31న రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా కిరణ్ మీడియాతో మాట్లాడారు. 'క సినిమా టైటిల్ జస్టిఫికేషన్ నా పేరు కాదు, టైటిల్ అలా కుదిరింది. దర్శకులు సందీప్, సుజీత్ కథ చెప్పినప్పుడు నెక్స్ట్ ఏం జరుగుతుందనేది ఊహించలేకపోయాను. నేను ఇలా జరుగుతుందేమో అనుకుంటే మరో ట్విస్ట్ వచ్చింది. ఇలాంటి పాయింట్‌తో 70వ దశకం నేపథ్యంలో కొత్తగా మూవీ ప్లాన్ చేసుకోవచ్చు అనే ఫీలింగ్ కలిగింది. దర్శకులు చెప్పిన షాట్ మేకింగ్ కూడా కొత్తగా అనిపించింది. ప్రేక్షకులు ఈ కథను తప్పకుండా బాగా రిసీవ్ చేసుకుంటారని నమ్మాం. క్లైమాక్స్‌ను కొత్తగా చెప్పడానికి ప్రయత్నించాం. ఇలాంటి క్లైమాక్స్‌తో ఇంతవరకు ఏ మూవీ రాలేదు. క్లైమాక్స్‌ని కొత్తగా చెప్పడానికి ప్రయత్నించాం. అది జెన్యూన్‌గా ప్రేక్షకులకు రీచ్ అవుతుందని నమ్ముతున్నాం. అందుకు నాదీ గ్యారంటీ' అని చెప్పారు కిరణ్ అబ్బవరం.

గొప్ప సినిమాను ఇవ్వాలని చేసిన ప్రయత్నం



తమిళ నటుడు సూర్య హీరోగా శివ దర్శకత్వంలో తెరకెక్కిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'కంగువ'. బాబీ డియోల్, దిశాపటానీ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని కే.ఈ.జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించారు. వచ్చే నెల 14న విడుదలవుతోందీ సినిమా. ఈ సందర్భంగా వైజాగ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో హీరో సూర్య మాటాడుతూ "కంగువ' డబ్బు కోసం చేసింది కాదు. మీ అందరికీ ఒక గొప్ప సినిమాను ఇవ్వాలని చేసిన ప్రయత్నం. థియేటర్లలో అద్భుతమైన అనుభూతిని పంచే చిత్రమిది" అని చెప్పారు. "ప్రతీ దర్శకుడికి జీవితాంతం గుర్తుండిపోయేలా ఒక సినిమా తీయాలని ఉంటుంది. నాకు 'కంగువ' అలాంటిదే" అని దర్శకుడు శివ అన్నారు. "ఇలాంటి భారీ చిత్రాన్ని తీయడానికి ఒక కారణం మీరు చూపించే అభిమానమైతే.. మరో కారణం దర్శకుడు రాజమౌళి అందించిన స్ఫూర్తి. సినిమా అందరికీ తప్పకుండా నచ్చుతుంది" అని నిర్మాత కే.ఈ.జ్ఞానవేల్ రాజా తెలిపారు.

ప్రతి ఇంట్లో పారిశ్రామికవేత్త

» సీఎం ఆకాంక్షలను నెరవేర్చాలి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త అవతరించాలనే సీఎం చంద్రబాబు ఆకాంక్షను నెరవేర్చాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను సూక్ష్మ, చిన్న పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంస్థ సీఈఓ నందని సలారియా, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ శేఖర్‌బాబు, జాతీయ చిన్న తరహా పరిశ్రమల సంస్థ, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ, మత్స్య, ఉద్యానవన, వ్యవసాయ, పశుగణాభివృద్ధి శాఖల అధికారులతో పాటు నాబార్డు, కైతీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయాధికారుల సంఖ్య 630గా ఖరారు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని న్యాయాధికారుల క్యాడర్ సంఖ్యను 630గా ఖరారు చేస్తూ న్యాయశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా జడ్జీల సంఖ్య 164, సీనియర్ సివిల్ జడ్జీల సంఖ్య 138, జూనియర్ సివిల్ జడ్జీల సంఖ్య 328గా పేర్కొంది.

వన్యప్రాణుల సంరక్షణకు టోల్ ఫ్రీ నంబరు

» వేట, అక్రమ రవాణాపై సమాచారమివ్వండి: డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణకు టోల్ ఫ్రీ నంబరు 18004255909ను ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. అటవీ శాఖ యాంటీ పోచింగ్ సెల్ రూపొందించిన పోస్టర్‌ను సోమవారం మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. పవన్ మాట్లాడుతూ వన్యప్రాణుల వేట, అక్రమ రవాణా సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబరుకు తెలియజేయాలన్నారు. అటవీ శాఖ స్పెషల్ సీఎస్ అనంతరాము తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన దాగుడుమూతలు!

» ఆడుకుంటూ కిటికీ కర్టెన్ వెనుక దాక్కున్న ఐదేళ్ల బాలిక

» అదుపుతప్పి హోటల్ నాలుగో అంతస్థు నుంచి పడి దుర్మరణం

» వైజాగ్ నుంచి తీర్థయాత్రలకు వచ్చిన కుటుంబంలో విషాదం

విజయవాడ/గుణదల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆ కుటుంబం విశాఖపట్నం నుంచి విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చింది. నగరంలోని ఓ హోటల్‌లో బస చేసింది. కొద్దిసేపట్లో దర్శనం చేసుకుని సొంతూరుకు బయల్దేరి వెళ్లాలి. ఈ హడావుడిలో తల్లిదండ్రులు బ్యాగులు సర్దుకుంటున్నారు. పిల్లలిద్దరూ దాగుడుమూతలు ఆడుకుంటున్నారు. అన్నయ్యకు కనిపించకుండా ఐదేళ్ల చిన్నారి కిటికీ కర్టెన్ వెనుక దాక్కుంది. ఆ కిటికీ తలుపు బోల్టు తీసి ఉండడంతో అదుపుతప్పి నాలుగో అంతస్తు నుంచి జారి కిందపడింది. తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందింది. విజయవాడ నగరంలో సోమవారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయం ఎదురు ఆఫీసర్స్ కాలనీలో మహారాణి పేటకు చెందిన వంకాయల బద్రీనాగరాజు, సాయిగీతకు 2015లో వివాహమైంది. వారికి జై అద్విక్, కుమార్తె రుహిక (5) సంతానం. దసరా తర్వాత దేవాలయాలు ఖాళీగా ఉంటాయని భావించి దర్శనాలు చేసుకోవడానికి ఈనెల 26న ఈ కుటుంబం విశాఖపట్నం నుంచి సొంత కారులో శ్రీశైలం బయల్దేరింది. శ్రీశైలం దర్శనం పూర్తయ్యాక మహానంది వెళ్లారు. ఆదివారం రాత్రి విజయవాడ చేరుకున్నారు. వెటర్నరీ కాలనీలోని మినర్వా గ్రాండ్ హోటల్ రూమ్ నంబరు 406లో బస చేశారు. సోమవారం ఉదయం 7 గంటలకు కుటుంబం మొత్తం బయటకు వచ్చి టిఫిన్ చేసింది. ఆ తర్వాత అంతా రూమ్‌లోకి వెళ్లిపోయారు. భార్యాభర్తలిద్దరూ బ్యాగులు సర్దుతుండగా.. అద్విక్, రుహిక.. దొంగ పోలీస్ (దాడుగుమూతలు) ఆడుతున్నారు. రుహిక వెళ్లి ఆ గది కిటికీ కర్టెన్ వెనుక దాక్కుంది. ఆ సమయంలో కిటికీ తలుపు వేసి ఉన్నప్పటికీ దానికి పైన ఉండే గడియ పెట్టలేదు. కర్టెన్ అడ్డుగా పెట్టుకున్న రుహిక.. కాస్త వెనక్కు జరిగి కిటికీ తలుపునకు నడుమ వాల్చింది. బోల్టు పెట్టకపోవడంతో తలుపు ఒక్కసారిగా బయటకు వెళ్లడంతో అదుపుతప్పి నాలుగో అంతస్తు నుంచి కింద పడి పోయింది. నేరుగా కార్ పార్కింగ్ ఫ్లోర్‌పై పడటంతో తలకు బలమైన గాయమైంది. ఆమె పడిపోవడాన్ని ఇద్దరు హౌస్‌కీపర్లు బయట నుంచి గమనించారు. వారు పరుగెత్తుకుని వచ్చేలోపు బాలిక నేలపై పడిపోయింది. ఆట మధ్యలో బాత్‌రూంకు వెళ్లిన అద్విక్ తిరిగొచ్చి చూసేసరికి చెల్లి కనిపించలేదు. ఇదే విషయం తల్లిదండ్రులకు చెప్పాడు. వారు గది మొత్తం వెతికినా కనిపించకపోయే సరికి కిటికీలో నుంచి కిందకు చూశారు. అప్పటికే రుహిక రక్తపు మడుగులో ఉంది. వారు వెంటనే పాపను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రుహిక ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మరికాసేపట్లో ఇంద్రకీలాద్రికి వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకోవాల్సిన కుటుంబం విషాదంలో మునిగిపోయింది. వారిని ఓదార్చడం ఎవరి వల్లా కాలేదు. మాచవరం ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.



మృతిచెందిన రుహిక

విశాఖ ప్లాంటులో రెండో బ్లాస్ట్ ఫర్నేస్ రెడీ

» మూతపడ్డ 'గోదావరి' పునఃప్రారంభం..కేంద్రం 1,650 కోట్ల సాయం

» ఇక రోజుకు 14 వేల టన్నుల.. హాట్ మెటల్ ఉత్పత్తి లక్ష్యం

విశాఖపట్నం/ఉక్కు టౌన్‌షిప్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో ముడి పదార్థాల కొరతతో మూతపడిన బ్లాస్ట్ ఫర్నేస్ (గోదావరి)ను సోమవారం పునఃప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కుకు సాయం చేస్తామని ఇచ్చిన హామీ మేరకు రూ.1,650 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో విదేశాల నుంచి బొగ్గు తెప్పించారు. ఉత్పత్తి ప్రక్రియను ప్లాంటు సీఎండీ (అదనపు బాధ్యత) ఏకే సక్సేనా ప్రారంభించారు. ప్లాంటులో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ఉండగా కొంతకాలంగా ఒక్కటే (కృష్ణా) నడుస్తోంది. గోదావరి, అన్నపూర్ణ మూతపడ్డాయి. ఇప్పటి వరకూ ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్ ద్వారా రోజుకు ఆరువేల నుంచి ఏడు వేల టన్నుల వరకు ఉత్పత్తి చేశారు. ఇప్పుడు రెండో ఫర్నేస్ ద్వారా మరో ఏడు వేల టన్నులు కలిపి మొత్తం రోజుకు 14 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేయాలని యాజమాన్యం లక్ష్యంగా నిర్దేశించింది.

విజిలెన్స్ కమిషనర్‌గా పునేఠా



అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధానకార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా నియమితులయ్యారు. ఆయన నియామకానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన పునేఠా 2018 సెప్టెంబరు 28వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయనపై ఎన్నికల సంఘానికి వైసీపీ ఫిర్యాదు చేయడంతో 2019 ఏప్రిల్ 6న ఆయనను విధుల నుంచి ఈసీ తప్పించింది. పునేఠా స్థానంలో ఏప్రిల్ ఏడో తేదీన సీనియర్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 2019 మే నెలలో చీఫ్ సెక్రటరీ హోదాలో పునేఠా పదవీ విరమణ చేశారు. తర్వాత 2022 జనవరి ఐదో తేదీ నుంచి 2024 మే 9వ తేదీ దాకా ఉత్తరాఖండ్ చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారిగా పునేఠా బాధ్యతలు నిర్వర్తించారు.

దాతృత్వ కార్యకలాపాల కోసం
రూ.20,000 కోట్లు



మాక్రోటెక్ డెవలపర్స్ ఎండీ అభిషేక్ లోధా
లోధా ఫిలాంత్రఫీ ఫౌండేషన్‌కు షేర్ల బదలాయింపు
టాటాలే ఆదర్శమని వెల్లడి

న్యూఢిల్లీ: స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపార దిగ్గజం అభిషేక్ లోధా, ఆయన కుటుంబం కీలక నిర్ణయం తీసుకుంది. తమ నిర్వహణలోని రియల్టీ కంపెనీ మాక్రోటెక్ డెవలపర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) ఈక్విటీలో తమకు ఉన్న 72.11 శాతం వాటాలో 18 నుంచి 19 శాతం వాటాను కుటుంబ నిర్వహణలోని స్వచ్ఛంద సేవా సంస్థ 'లోధా ఫిలాంత్రఫీ ఫౌండేషన్' (ఎల్‌పీఎఫ్)కు బదలాయించాలని నిర్ణయించింది. సోమవారం నాటి బీఎస్ఈ క్లోజింగ్ ధర ప్రకారం చూస్తే ఈ షేర్ల విలువ రూ.20,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఏటా ఈ షేర్లపై వచ్చే డివిడెండ్, ఇతర ఆదాయాన్ని ఎల్‌పీఎఫ్ విద్య, మహిళా సాధికారిత, స్థిరమైన పట్టణాభివృద్ధి వంటి కార్యకలాపాల కోసం ఖర్చు చేస్తుంది.

కాగా ఈ విషయంలో తమకు టాటాలే ఆదర్శమని ఎండీఎల్ ఎండీ అండ్ సీఈఓ అభిషేక్ లోధా చెప్పారు. 'టాటా కుటుంబం వందేళ్ల క్రితం తమ నిర్వహణలోని కంపెనీల్లో తమకు ఉన్న వాటా నుంచి పెద్ద మొత్తాన్ని టాటా ట్రస్టులకు బదిలీ చేసింది. ఈ కంపెనీల నుంచి వచ్చే ఆదాయాన్ని టాటా ట్రస్టులు అనేక సత్కార్యాలకు వినియోగిస్తూ దేశాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఈ విషయంలో టాటాలే నాకు ఆదర్శం, ప్రేరణ' అన్నారు. వచ్చే ఏడాది జనవరి కల్లా ఎల్‌పీఎఫ్‌కు ఒక సలహా బోర్డును ఏర్పాటు చేసి వివిధ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తామని తెలిపారు.

ఇదీ ప్రస్థానం

2013లో ఏర్పాటైన ఎల్‌పీఎఫ్ ఇప్పటికే అనేక సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 'లోధా ఉన్నతి' అనే కార్యక్రమం ద్వారా కంపెనీల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తోంది. ఇనిస్టిట్యూట్ అప్లయిడ్ మ్యాథమ్యాటిక్స్ (ఐఏఎం) అనే సంస్థ ద్వారా దేశ, విదేశాల్లోని ప్రముఖ గణిత శాస్త్రవేత్తలను ఒక చోటికి చేర్చి ఆ రంగంలో పరిశోధనలకు తోడ్పడుతోంది. లోధా జీనియస్ ప్రోగ్రామ్ పథకం ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తోంది. తాజాగా మాక్రోటెక్ డెవలపర్స్ ఈక్విటీలో రూ.20,000 కోట్ల విలువైన వాటా బదిలీతో వచ్చే ఆదాయంతో మరిన్ని సామాజిక అభివృద్ధి కార్యకలాపాలు ప్రారంభించాలని యోచిస్తోంది.

ఎస్ఎస్ఈల ద్వారా రూ.22 కోట్లు

సెబీ ఈడీ ఎస్‌వీఎండీ రావు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లాభాపేక్ష లేని సంస్థలు (ఎన్‌పీఓ) చేపట్టే సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధుల సమీకరణ కోసం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) అమలు చేస్తున్న సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎస్ఎస్ఈ) పథకం బాగా ఉపకరిస్తోంది. ఇప్పటి వరకు 10 ఎన్‌పీఓలు ఈ పథకం ద్వారా రూ.22 కోట్లు సమీకరించాయి. 'యాక్సిలరేటింగ్ సోషల్ ఇంపాక్ట్ విత్ సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజీ' పేరుతో హైదరాబాద్‌లో ఎన్ఎస్ఈ నిర్వహించిన సదస్సులో సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎండీ రావు ఈ విషయం తెలిపారు. విద్య, వైద్య, ఆరోగ్యం, వ్యవసాయం, గిరిజన అభివృద్ధి వంటి కార్యక్రమాల కోసం నిధులు సమీకరించే ఎన్‌పీఓలకు ఎస్ఎస్ఈ చక్కటి మార్గమన్నారు. ఈ మార్గంలో నిధులు సమీకరించేందుకు ఇప్పటికే 80 ఎన్‌పీఓలు ఎస్ఎస్ఈలో నమోదయ్యాయి. మరో వంద ఎన్‌పీఓలు ఇందుకోసం దరఖాస్తు చేసుకున్నాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,800 ▼	73,150 ▼	1,07,000 ▼
ముంబై	78,245 ▲	71,672 ▲	96,086 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక 100 గుడ్లు)



29వ తేదీ			
		విజయవాడ	550
హైదరాబాద్	525	గోదావరి	545
వరంగల్	527	విశాఖపట్నం	550
చిత్తూరు	578	డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	123	విజయవాడ	120
వరంగల్	123	గుంటూరు	123
కరీంనగర్	123	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	123	చిత్తూరు	126
కర్నూలు	123	నెల్లూరు	126
విశాఖపట్నం	107	అనంతపురం	126
గోదావరి	120		

బీఏఎస్ఎఫ్‌తో ఏఎం గ్రీన్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జర్మనీకి చెందిన పారిశ్రామిక దిగ్గజం బీఏఎస్ఎఫ్.. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఏఎం గ్రీన్ కంపెనీ మధ్య ఒక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ ఎంఓయూ ద్వారా భారత్‌లో పునరుత్పాదక ఇంధన వనరుల సాయంతో తక్కువ కార్బన్ ఉండే రసాయనాల ఉత్పత్తి, వాటికి సంబంధించిన టెక్నాలజీల అభివృద్ధికి ఉన్న అవకాశాలను రెండు సంస్థలు అన్వేషిస్తాయి. అలాగే ఏఎం గ్రీన్ నుంచి ఏటా లక్ష టన్నుల గ్రీన్ అమ్మోనియాను దిగుమతి చేసుకునే విషయాన్ని బీఏఎస్ఎఫ్ పరిశీలిస్తుంది. ఈ అమ్మోనియా యూరోపియన్ యూనియన్ (ఈయూ) ప్రామాణికాలకు అనుగుణంగా ఉంటుందని ఒప్పందంలో పేర్కొన్నారు.

భెల్ లాభం రూ.106 కోట్లు

ప్రభుత్వ రంగంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) సెప్టెంబరు త్రైమాసికంలో రూ.106.15 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.63.01 కోట్ల నష్టం ప్రకటించింది. త్రైమాసికాదాయం రూ.5,305.38 కోట్ల నుంచి రూ.6,695.37 కోట్లకు పెరిగింది.

7.2 శాతం వృద్ధి కష్టమే

నోమురా

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ "వృద్ధిలో కాలానుగుణమైన మందగమన" స్థితిలోకి ప్రవేశించిందని, ఈ కారణంగా ఆర్‌బీఐ అంచనా వేసిన మేరకు 7.2 శాతం వృద్ధిని నమోదు చేయడం కష్టమేనని జపాన్‌కు చెందిన బ్రోకరేజీ సంస్థ నోమురా అంటోంది. వృద్ధిపై ఆర్‌బీఐ అంచనా "మితి మీరిన ఆశావహ" వైఖరిగా పేర్కొంది. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో ఈ ఏడాది భారత జీడీపీ 6.7 శాతం ఉండవచ్చని, వచ్చే ఏడాది అది 6.8 శాతంగా నమోదు కావచ్చని అంచనా వేసింది. పట్టణ ప్రాంతాల్లో వినియోగం ఇటీవల కాలంలో క్షీణించడం, వాహన అమ్మకాల్లో క్షీణత, విమాన ప్రయాణికుల సంఖ్య తగ్గడం ఇందుకు కారణాలని పేర్కొంది.

డాక్టర్ రెడ్డీస్ నుంచి కొత్త ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ 'బిక్సిబ్యాట్' పేరుతో కొత్త ఔషధాన్ని దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. దీర్ఘకాలిక మలబద్ధకాన్ని నివారించడంలో ఈ ఔషధం బాగా పని చేస్తుందని తెలిపింది. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) ఆమోదంతో కంపెనీ ఈ ఔషధాన్ని విడుదల చేసింది. దీర్ఘకాలిక మలబద్ధక నివారణకు ఒక ఫార్మా కంపెనీ దేశీయ మార్కెట్లోకి ఈ తరహా ఔషధాన్ని విడుదల చేయడం ఇదే మొదటిసారి.

'అజిముత్ ఏఐ'లో సైయెంట్‌కు వాటా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సైయెంట్ తన సెమీకండక్టర్ వ్యాపారాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా అప్లికేషన్ స్పెసిఫిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ (ఏఎస్ఐసీ) అభివృద్ధిలో మంచి పట్టున్న 'అజిముత్ ఏఐ' కంపెనీ ఈక్విటీలో 27.3 శాతం వాటా తీసుకుంది. ఈ సర్క్యూట్స్‌ను పవర్, ఎనర్జీ ఎఫిషియెంట్ సొల్యూషన్స్‌లో విరివిగా ఉపయోగిస్తారు. ఇది తమ వ్యూహాత్మక సెమీకండక్టర్ వ్యాపార విస్తరణకు తోడ్పడుతుందని సైయెంట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఎండీ బీ కృష్ణ తెలిపారు. అయితే ఈ వాటా కోసం ఎంత మొత్తం చెల్లించిందీ రెండు కంపెనీలు వెల్లడించలేదు.

రూ.4.21 లక్షల కోట్ల లాభం

సెన్సెక్స్ 602 పాయింట్ల వృద్ధి.. 5 రోజుల తర్వాత లాభాల్లోకి సూచీలు



ముంబై: గత వారంలో వరుసగా ఐదు రోజులు నష్టాల్లో పయనించిన స్టాక్ మార్కెట్.. ఎట్టకేలకు లాభాల బాటపట్టింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల (డీఐఐ) కొనుగోళ్లతో పాటు రిటైల్ ఇన్వెస్టర్ల విలువ ఆధారిత కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 1,137.52 పాయింట్ల వరకు పెరిగి 80,539.81 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 602.75 పాయింట్ల లాభంతో 80,005.04 వద్ద ముగిసింది. నిఫ్టీ 158.35 పాయింట్ల వృద్ధితో 24,339.15 వద్ద స్థిరపడింది.

కొనుగోళ్ల జోరుతో స్టాక్ మార్కెట్ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.21 లక్షల కోట్లు పెరిగి రూ.441.20 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) పెరిగింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 24 రాణించాయి.

వారీ ఎనర్జీస్ లిస్టింగ్ అదుర్స్

సోలార్ ప్యానెళ్ల తయారీదారు వారీ ఎనర్జీస్ లిమిటెడ్ స్టాక్ మార్కెట్ లిస్టింగ్ దుమ్మురేపింది. కంపెనీ సోమవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.1,503తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు ఏకంగా 69.66 శాతం వృద్ధితో రూ.2,550 వద్ద లిస్టయింది. ఆ తర్వాత 72.98 శాతం ఎగబాకి రూ.2,600 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. తొలిరోజు ట్రేడింగ్ నిలిచే సరికి కంపెనీ షేరు ధర 55.47 శాతం లాభంతో రూ.2,336.80 వద్ద స్థిరపడింది.

1 దీపక్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ లిస్టింగ్ నిరాశపరిచింది. ఐపీఓ ధర రూ.203తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 2.21 శాతం నష్టంతో రూ.198.50 వద్ద లిస్టయింది. ఒక దశలో 21.10 శాతం వరకు క్షీణించిన షేరు చివరికి 20.24 శాతం నష్టంతో రూ.161.90 వద్ద ముగిసింది.

స్విగ్గీ ఐపీఓ ధర రూ.371-390

వచ్చే నెల 6 నుంచి ఇష్యూ షురూ!

రూ.11,300 కోట్ల సమీకరణ లక్ష్యం



ఇంటి వద్దకే ఆహారం, కిరాణా సరుకుల డెలివరీ అందించే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చే నెల 6న ప్రారంభమై 8న ముగియవచ్చని విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా, కంపెనీ ఐపీఓ ధరల శ్రేణిని రూ.371-390గా నిర్ణయించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.11,300 కోట్లు సమీకరించాలనుకుంటోంది. అందులో రూ.4,500 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ఇన్వెస్టర్లకు చెందిన రూ.6,800 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది.

ఓఎఫ్ఎస్ మార్గంలో షేర్లను విక్రయించనున్న కంపెనీ ఇన్వెస్టర్ల జాబితాలో యాక్సెల్ ఇండియా, అపోలెట్టో ఏషియా లిమిటెడ్, ఆల్ఫా వేవ్ వెంచర్స్, కోట్ పీఈ ఏషియా, డీఎస్‌టీ యూరోఏషియా, ఎలివేషన్ క్యాపిటల్, ఇన్‌స్పైర్డ్ ఎలైట్ ఇన్వెస్ట్‌మెంట్, ఎంఐహెచ్ ఇండియా ఫుడ్ హోల్డింగ్స్, నార్త్‌వెస్ట్ వెంచర్ పార్ట్‌నర్స్, టెన్సెంట్ క్లౌడ్ యూరప్ ఉన్నాయి. కాగా, జపాన్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ మాత్రం తన వాటాను అలాగే కొనసాగించనుంది.

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓకు సెబీ ఆమోదం

ప్రభుత్వ రంగ విద్యుదుత్పత్తి దిగ్గజం ఎన్‌టీపీసీకి చెందిన పునరుత్పాదక ఇంధన విభాగం ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీతో పాటు విద్యా రుణాలందించే ఎన్‌బీఎఫ్‌సీ అవాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీఓ ప్రతిపాదనలకు సెబీ ఆమోదం తెలిపింది. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ ద్వారా రూ.10,000 కోట్లు సమీకరించనుంది. అవాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సేకరణ లక్ష్యం రూ.3,500 కోట్లు. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ పూర్తిగా తాజా ఈక్విటీ జారీ కాగా.. అవాన్స్ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత షేర్‌హోల్డర్లకు చెందిన రూ.2,500 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనుంది.

పీఎన్‌బీ లాభం రెండింతలు

సెప్టెంబరు త్రైమాసికంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రెండింతలు పెరిగింది. వడ్డీల ద్వారా ఆదాయం గణనీయంగా పెరగడంతో ఈ కాలంలో రూ.4,306 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,756 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ ఆదాయం కూడా రూ.29,875 కోట్ల నుంచి రూ.34,447 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.26,355 కోట్ల నుంచి రూ.29,875 కోట్లకు చేరిందని పీఎన్‌బీ ఎండీ అతుల్ కుమార్ గోయెల్ తెలిపారు. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.10,517 కోట్లుగా ఉండగా ఈ త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం రూ.4,000 కోట్ల మొండి బకాయిలు వసూలు చేసింది. స్థూల ఎన్‌పీఏలు 6.96 శాతం నుంచి 4.48 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.47 శాతం నుంచి 0.46 శాతానికి తగ్గాయి.

ఐఓసీ లాభంలో భారీ క్షీణత

రిఫైనరీ, మార్కెటింగ్ మార్జిన్లు గణనీయంగా పడిపోవడంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కన్సాలిడేటెడ్ లాభం 98.6 శాతం మేరకు పడిపోయింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన స్టాండ్‌ఎలోన్ లాభం రూ.12,967.32 కోట్లు కాగా ఈ ఏడాది కేవలం రూ.180.01 కోట్లు ఆర్జించగలిగింది. ప్రభుత్వ నియంత్రిత ధరలకు వంట గ్యాస్ విక్రయించడం కూడా మార్జిన్లు తగ్గడానికి కారణమని కంపెనీ తెలిపింది. సెప్టెంబరు త్రైమాసికాదాయం రూ.1.95 లక్షల కోట్లుంది.

ఎయిర్‌టెల్ లాభంలో 168 శాతం వృద్ధి

భారతి ఎయిర్‌టెల్ సెప్టెంబరు త్రైమాసికంలో 168% వృద్ధితో రూ.3,593 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.1,341 కోట్లు. ఆదాయం 12% వృద్ధితో రూ.41,473 కోట్లకు చేరింది. ఇటీవల టారిఫ్‌ల సవరణతో ఒక్కో వినియోగదారునిపై ఆదాయం రూ.233కి పెరిగింది.

స్పోర్ట్స్



టీ20 జట్టు కోచ్‌గా లక్ష్మణ్

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాలో పర్యటించే భారత టీ20 జట్టుకు ప్రధాన కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ వ్యవహరించనున్నాడు. వచ్చే నెల 8,10,13,15 తేదీల్లో ఇరు జట్ల మధ్య నాలుగు టీ20ల సిరీస్ జరుగుతుంది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో యువ ఆటగాళ్లు ఈ సిరీస్‌కు ఎంపికైన విషయం తెలిసిందే. మరోవైపు రోహిత్ శర్మ కెప్టెన్సీలో సీనియర్ జట్టు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఆడేందుకు నవంబరు 10 లేదా 11న ఆస్ట్రేలియా వెళ్లాల్సి ఉంది. అదే నెల 22 నుంచి ఈ ఐదు టెస్టుల సిరీస్ జరుగుతుంది. దీంతో ప్రధాన కోచ్ గంభీర్‌కు ఇరు జట్లతో ఉండడం వీలు కాదు కాబట్టి లక్ష్మణ్‌కు యువ జట్టు బాధ్యతలు అప్పగించారు. ద్రవిడ్ హయాంలోనూ లక్ష్మణ్ పలుమార్లు కోచ్‌గా వ్యవహరించాడు. ఇక సహాయక సిబ్బందిగా సాయిరాజ్ బహుతులె, హృషికేశ్ కనిట్కర్, సుభాదీప్ ఘోష్ సఫారీ టూర్‌కు వెళ్లనున్నారు.

రిషి డబుల్ మిస్

- హిమాచల్‌కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం
- ఆంధ్రతో రంజీ

విశాఖపట్నం(స్పోర్ట్స్): కెప్టెన్ రిషి ధవన్ (195) త్రుటిలో డబుల్ సెంచరీ చేజార్చుకొన్నా.. ఆంధ్రప్రదేశ్‌తో రంజీలో హిమాచల్‌ప్రదేశ్ కీలక 134 పరుగుల ఆధిక్యం సాధించింది. ఆటకు మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 198/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హిమాచల్ 478/9 స్కోరు చేసింది. సోమవారం ఆట ముగిసే సమయానికి అర్పిత్ గులేరియా(15), దివేశ్ శర్మ (12) క్రీజులో ఉన్నారు. ఆకాశ్ వశిష్ఠ్ (85), రిషి ఐదో వికెట్‌కు 141 పరుగులు జోడించారు. శశికాంత్ 4, సత్యనారాయణ 3 వికెట్లు పడగొట్టారు. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 344 పరుగులు చేసింది.

ఫాలోఆన్‌లో పుదుచ్చేరి

అనికేత్ (5/40) చెలరేగడంతో.. హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్‌లో పుదుచ్చేరి ఫాలోఆన్‌లో పడింది. ఆటకు మూడోరోజు ఓవర్‌నైట్ స్కోరు 24/2తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన పుదుచ్చేరి 153 రన్స్‌కే కుప్పకూలింది. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 536/8 డిక్లేర్డ్‌కు 386 రన్స్ వెనుకంజలో నిలిచి ఫాలోఆన్‌లో పడింది. భారీలోటుతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన పుదుచ్చేరి సోమవారం ఆట ముగిసే సరికి 171/2 స్కోరు చేసింది.

కోచ్‌ల కథ అంతులేని వ్యథ!

25 ఏళ్లుగా పెండింగ్‌లోనే రెగ్యులరైజేషన్ ఫైల్

- సర్వీసును క్రమబద్ధీకరించాలని 2008లోనే హైకోర్టు తీర్పు
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్నది 143 మంది కోచ్‌లే!
- నిర్వీర్యమైన కోచింగ్ వ్యవస్థతో నష్టపోతున్న క్రీడాకారులు



ప్రపంచానికి క్రీడా చాంపియన్లను పరిచయం చేసే కోచ్‌లను గౌరవించాల్సింది పోయి వారిని అవమానించే పరిస్థితులు దాపురించాయి. నేషనల్ గేమ్స్ వంటి భారీ క్రీడా పోటీలను నిర్వహించాలన్న తలంపుతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ముందు క్రీడారంగాన్ని బలోపేతం చేయడానికి కోచింగ్ వ్యవస్థను పటిష్ఠం చేయాలి. కోచ్‌ల రెగ్యులరైజేషన్ మొదలుకొని అవసరమైన చోట కొత్త కోచ్‌ల నియామకం వరకు ఎన్నో సమస్యల్ని పరిష్కరించాల్సి వుంది. 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామంటూ ఐదేళ్ల పాటు ఊదరగొట్టిన గత ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైంది. అయితే ప్రభుత్వం మారాక కూడా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో పాతికేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కోచ్‌ల సమస్యను మాత్రం పట్టించుకోవడం లేదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1989 వరకు నోటిఫికేషన్ ద్వారా తీసుకున్న కోచ్‌లను మూడేళ్ల సర్వీస్ అనంతరం వారి పనితీరు ఆధారంగా క్రమబద్ధీకరించేవారు. ఇప్పుడు విధులు నిర్వహిస్తున్న కోచ్‌లు ఆ విధంగానే సర్వీసులోకి వచ్చారు. 1989 తర్వాత 1993, 1999, 2009 సంవత్సరాలలో నోటిఫికేషన్ ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో తీసుకున్న 28 మంది కోచ్‌ల సర్వీసును మాత్రం రెగ్యులరైజ్ చేయలేదు. దీనిపై 1993, 1999 బ్యాచ్‌లకు చెందిన కోచ్‌లు 2002లో హైకోర్టును ఆశ్రయించగా 2008లో వీరి వాదనలతో ఏకీభవించిన జస్టిస్ సీవీ రాములు ఖాళీగా ఉన్న శాంక్షన్డ్ కోచ్‌ల పోస్టులను అప్పటికే విధుల్లో ఉన్న అర్హులైన కాంట్రాక్టు కోచ్‌లతో ఆరువారాల లోపు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. అయితే అప్పటి ఉద్యోగుల సర్వీస్ నిబంధనల్లోని యాక్ట్-2ను సాకుగా చూపించి రెగ్యులరైజ్ చేయకుండా కొందరు కోర్టు తీర్పును పక్కదోవ పట్టించారు.

2014లో 'లా' కమిషన్ అనుకూలంగా నివేదిక

2002లో జీవో 563 ప్రకారం శాంక్షన్డ్ పోస్టులను అప్పటికే విధుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులతో సీనియారిటీ ప్రకారం నింపాలని ఉంది. 2008లో ఇచ్చిన హైకోర్టు తీర్పును స్పోర్ట్స్ అథారిటీ అమలు చేయడం లేదని 2013లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డికి మొరపెట్టుకోగా ఆయన విచారణకు ఆదేశించారు. దీనిపై విచారణ జరిపిన 'లా కమిషన్' 2014లో వీరిని రెగ్యులరైజ్ చేయవచ్చని నివేదిక ఇచ్చింది. ఆతర్వాత కూడా శాప్ అధికారుల తీరు మారకపోవడంతో కోచ్‌ల పాలిట రెగ్యులరైజేషన్ సమస్య తీరని శాపంగానే మిగిలిపోయింది. శాప్ ఉన్నతాధికారుల వ్యవహారశైలితో విసిగిపోయిన కోచ్‌లు 2018లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ ఏడాది మే నెల వరకు ఈ కేసుపై 78 సార్లు విచారణ జరిగింది. యాక్ట్-2 అడ్డురాదనే కోచ్‌ల వాదనకు శాప్ కౌంటర్ ఇవ్వడంలో విఫలమైంది. దీనిపై న్యాయస్థానం శాప్‌పై ఆగ్రహం కూడా వ్యక్తం చేసి, ప్రస్తుతానికి తీర్పును రిజర్వ్ చేసి ఉంచింది.

కోచ్‌లను నియమిస్తేనే..

ప్రస్తుతం రాష్ట్రం మొత్తం మీద 143 మంది కోచ్‌లే ఉన్నారు. వీరిలో 43 మంది కాంట్రాక్టు కోచ్‌లు మినహా మిగిలిన వారు అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్నారు. ఇందులో సగం మంది విజయవాడ-అమరావతిలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఈ లెక్కన కనీసం నియోజకవర్గానికి ఒక్క నిష్ణాతుడైన కోచ్ కూడా లేరు. కోచ్‌ల రిక్రూట్‌మెంట్ లేక శాప్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇక, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ల పోస్టుల్లోనైతే ఒక్కరు కూడా లేరు. ఈ నేపథ్యంలో కనీసం 600 మంది కోచ్‌లను నియమిస్తే తప్ప రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధి సాధ్యం కాదనేది క్రీడా పండితుల అభిప్రాయం.

పాలకమండలి ఊసేదీ..?

గతంలో ఉద్యోగుల నియామకాలు, రెగ్యులరైజేషన్ తదితర ముఖ్యమైన నిర్ణయాలన్నీ పాలకమండలిలో చర్చించి తీసుకునేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనానంతరం కూడా కరణం మల్లీశ్వరి వంటి దిగ్గజాలకు పాలకమండలిలో సీఎం చంద్రబాబు నాయుడు చోటు కల్పించారు. ఆతర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో పాలకమండలి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టు సమస్యలు అపరిష్కృతంగా ఉండిపోయాయి. గత ఐదేళ్లలో సరైన పాలకమండలి లేక నిర్ణయాలు తీసుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా క్రీడా నిపుణులతో పాలకమండలిని ఏర్పాటు చేసి శాప్‌ను బలోపేతం చేయాలని క్రీడారంగ నిపుణులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)

హాకీ కెప్టెన్ సలీమా



చాంపియన్స్ ట్రోఫీకి జట్టు ఎంపిక

న్యూఢిల్లీ : ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే మహిళల హాకీ జట్టును సోమవారం ప్రకటించారు. 18 మంది సభ్యుల జట్టుకు సలీమా టేటెను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. టోర్నమెంట్ వచ్చే నెల 11 నుంచి 20 వరకు బిహార్‌లోని నలంద జిల్లా రాజ్‌గిర్‌లో జరగనుంది. నవ్‌నీత్ కౌర్ వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనుంది. రాంచీలో గత సంవత్సరం జరిగిన ఈ టోర్నీలో విజేతగా నిలిచిన భారత్..ఈసారి భారీ అంచనాలతో బరిలో దిగుతోంది. ఒలింపిక్స్ రజత పతక విజేత చైనా, జపాన్, కొరియా, మలేసియా, థాయ్‌లాండ్ టోర్నమెంట్‌లో తలపడుతున్న ఇతర జట్లు. 11న జరిగే తొలి మ్యాచ్‌లో మలేసియాను భారత్ ఢీకొననుంది. సీనియర్ సవితతోపాటు యువ ప్లేయర్ బిచుదేవి ఖరిబమ్ గోల్‌కీపర్ బాధ్యతలను పంచుకుంటారు.

భారత జట్టు: గోల్‌కీపర్లు- సవిత, బిచుదేవి; **డిఫెండర్లు-** ఉదిత, జ్యోతి, వైష్ణవి విఠల్, సుశీలా చాను, ఇషికా చౌధరి; **మిడ్‌ఫీల్డర్లు-** నేహ, సలీమా టేటె, షర్మిలా దేవి, మనీషా చౌహాన్, సునేలితా టోపో, లాల్‌రెమ్‌సియామి; **ఫార్వర్డ్‌లు-** నవ్‌నీత్ కౌర్, ప్రీతీ దూబే, సంగీతా కుమారి, దీపిక, బ్యూటీ డుంగ్‌డుంగ్.

సిరీస్ ఎవరిదో?

- ఒత్తిడిలో భారత్.. జోష్‌లో కివీస్
- మూడో వన్డే నేడు

మ.1.30 నుంచి స్పోర్ట్స్ 18లో



హర్మన్ సోఫీ

అహ్మదాబాద్: బ్యాటర్ల వైఫల్యంతో రెండో వన్డేలో చిత్తుగా ఓడిన భారత మహిళల జట్టు బలంగా పుంజుకోవాలనుకొంటోంది. న్యూజిలాండ్‌తో మంగళవారం జరిగే మూడో వన్డేలో గెలిచి.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను సొంతం చేసుకోవాలనుకొంటోంది. తొలి వన్డేలో బ్యాటింగ్ విభాగం అంతగా రాణించక పోయినా.. బౌలర్లు విజృంభించడంతో భారత్ 59 పరుగుల తేడాతో గెలిచింది. అయితే, రెండో మ్యాచ్‌లో కివీస్ నిర్దేశించిన 260 పరుగుల లక్ష్య ఛేదనలో 183 రన్స్‌కే ఆలౌటైంది. లక్ష్యం భారీదే అయినా.. భారత బ్యాటర్లు పోరాడకుండానే చేతులెత్తేయడం విమర్శలకు దారితీసింది. రాధా యాదవ్, సైమా తొమ్మిదో వికెట్‌కు 70 పరుగులు జోడించకుండా ఉంటే.. పరాజయం మరింత ఘోరంగా ఉండేది. రెండు మ్యాచ్‌ల్లో చూసుకొంటే ఒక్క భారత బ్యాటర్ కూడా అర్ధ శతకం సాధించలేక పోవడం శోచనీయం. టాపార్డర్ బ్యాటర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ వైఫల్యం జట్టును దారుణంగా దెబ్బతీస్తోంది. ఈ ముగ్గురూ చెలరేగితే మిడిలార్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్ దీప్తి శర్మ, తేజల్ దూకుడైన ఆటతో భారీ స్కోరును అందించే అవకాశం ఉంది. గత మ్యాచ్‌లో 4 వికెట్లు పడగొట్టిన రాధ నుంచి జట్టు అదే తరహా ప్రదర్శనను ఆశిస్తోంది. మరోవైపు అదిరే విజయంతో సిరీస్‌ను సమం చేసిన న్యూజిలాండ్ ఆత్మవిశ్వాసంతో ఉంది. కెప్టెన్ సోఫీ డివైన్, ఓపెనర్ సుజీ బేట్స్, ప్లిమ్మర్ చక్కని ఫామ్‌లో ఉండడంతో టీమ్ బలంగా కనిపిస్తోంది.

పాక్ కోచ్ కిర్‌స్టెన్ రాజీనామా



కరాచీ: పాకిస్థాన్ వన్డే, టీ20 జట్ల ప్రధాన కోచ్ పదవికి గ్యారీ కిర్‌స్టెన్ రాజీనామా చేశాడు. అతడి స్థానంలో ప్రస్తుత టెస్టు కోచ్ జేసన్ గిలెస్పీకే అదనపు బాధ్యతలప్పగించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కిర్‌స్టెన్ కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నాడు. అయితే ఆటగాళ్లతో అభిప్రాయభేదాలు రావడంతో పాటు, సెలెక్షన్ ప్యానెల్ నుంచి కూడా పీసీబీ తొలగించడంతో గ్యారీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. కిర్‌స్టెన్ హయాంలో పాక్ జట్టు ఇంగ్లండ్‌తో సిరీస్ కోల్పోవడంతో పాటు టీ20 ప్రపంచకప్‌లో యూఎస్ఏపైనా ఓటమిపాలైంది. ఇక నవంబరులో పాక్ జట్టు ఆసీస్, జింబాబ్వే పర్యటనల్లో ఆరేసి మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. దీంట్లో ఆసీస్ టూర్‌కు మాత్రమే కోచ్‌గా ఉంటానని గిలెస్పీ పాక్ బోర్డుకు స్పష్టం చేశాడు.

కాగితం పులులు!

రోహిత్ సేనను గేలి చేసిన షెహజాద్

న్యూఢిల్లీ: స్వదేశంలో 12 ఏళ్ల తర్వాత టెస్ట్ సిరీస్ ఓడిన రోహిత్ సేనను 'కాగితం పులులు' అంటూ పాకిస్థాన్ క్రికెటర్ అహ్మద్ షెహజాద్ గేలి చేశాడు. భారత్ ఆడిన గత రెండు టెస్టుల్లోనూ ఆటగాళ్లలో నిర్లక్ష్య ధోరణి కనిపించిందన్నాడు. 'స్కూల్ పిల్లలతో ఆడినట్టు.. సొంతగడ్డపై భారత్‌ను న్యూజిలాండ్ ఆడేసుకొంది. 'పేపర్ పులులు.. వారి పిచ్‌లపైనే కుప్పకూలారు'. మొత్తంగా భారత్ ఆటలో పోరాట స్ఫూర్తి కొరవడిందని షెహజాద్ విమర్శించాడు.



ఉత్కంఠ పోరులో టైటాన్స్ విజయం

హైదరాబాద్: ప్రొ. కబడ్డీ లీగ్ సీజన్ సోమవారంనాటి రెండో మ్యాచ్ అభిమానులకు మజా పంచింది. తెలుగు టైటాన్స్-పట్నా పైరేట్స్ మధ్య జరిగిన పోరులో చివరి నిమిషం వరకూ ఇరుజట్ల మధ్య విజయం దోబూచులాడింది. చివరకు తెలుగు టైటాన్స్ 28-26తో గెలిచి ఊపిరి పీల్చుకుంది. మూడు వరుస పరాజయాల తర్వాత తెలుగు జట్టుకిది తొలి గెలుపు కావడం గమనార్హం. టైటాన్స్‌లో ఆశిష్ నర్వాల్ (9), కెప్టెన్ పవన్ సెహ్రావత్ (5) రాణించారు. పట్నాలో దేవాంక్ (7), అయాన్ (6) పోరాడారు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 41-34తో దబాంగ్ ఢిల్లీని చిత్తు చేసింది.





సేఫ్ దివాలీ

ఎల్లుండే దీపావళి. టపాసుల షాపింగ్ ఇప్పటికే జోరుగా, హుషారుగా మొదలైపోయింది. అయితే పేల్చే టపాసులతో దుష్టశక్తులతో పాటు ఆరోగ్యం కూడా పరారైపోకుండా చూసుకోవాలి. అందుకోసం కళ్లూ, ఒళ్లూ గాయపడకుండా కాపాడుకోవాలి.

టపాసులతో టెన్షన్ లేకుండా...

కంటి పాపలు పదిలంగా...

టపాసులు పేలుతూనే నిప్పు రవ్వలను విరజిమ్ముతాయి. అవి చిన్నవైతే గాల్లోకి లేచి నేలను తాకేలోపే ఆరిపోతాయి. అవే పెద్దవైతే మాత్రం జాగ్రత్తగా ఉండాల్సిందే! పెద్ద శబ్దంతో పేలే టపాసుల రవ్వలు ఒంటితోపాటు, కళ్లలో కూడా ఎగిరొచ్చి పడతాయి. కనుగుడ్డుకు రవ్వలు తగిలి గాయాలవుతాయి కూడా! ఇలాంటప్పుడు కనుగుడ్డులోని కార్నియాకు నష్టం జరగొచ్చు. ఈ నష్టం వల్ల కంటిలో 'ట్రామాటిక్ కాటరాక్ట్' ఏర్పవచ్చు. గాయం తీవ్రతను బట్టి రెటీనా నరం దెబ్బతినొచ్చు. ఒకవేళ కాటరాక్ట్ ఏర్పడితే దాన్ని తొలగించి కుట్లు వేసి సరిచేయొచ్చు. దెబ్బ తీవ్రతను బట్టి రెటీనా డిటాచ్‌మెంట్ సర్జరీ చేసి, సరి చేయొచ్చు. కంట్లో దెబ్బ తగిలిన భాగాన్ని బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. అసలీ సమస్యలేవీ రాకుండా ఉండాలంటే టపాసులు కాల్చేటప్పుడు ఈ జాగ్రత్తలు పాటించాలి.

- వీలైనంత దూరంగా ఉండి టపాసులు పేల్చాలి.
- కళ్లకు కళ్లద్దాలు పెట్టుకుంటే నిప్పు రవ్వలు, టపాసుల్లో ఉండే రాళ్లు కనుగుడ్డుకు తగలకుండా ఉంటాయి.
- టపాసులు వెలిగించటానికి పొడవాటి అగర్‌బత్తీ, పుల్లల్లాంటివి వాడాలి.
- పేలే టపాసులకు కనీసం 5 మీటర్ల దూరంలో ఉండాలి.
- కంట్లో నిప్పురవ్వ పడినా, రాళ్లు తగిలినా కన్ను కడిగేసి వదిలేయకుండా వెంటనే కంటి వైద్యుల్ని సంప్రదించాలి.
- కంటికి తగిలే గాయాలకు ఎంత త్వరగా చికిత్స చేయగలిగితే కంటి చూపును అంత మెరుగ్గా కాపాడుకోవచ్చు.
- కార్నియాకు తగిలిన దెబ్బలను నిర్లక్ష్యం చేస్తే ఏకంగా కంటి చూపు పోయే ప్రమాదం ఉంటుంది.
- కంటికి దెబ్బ తగిలితే వేళ్లతో రుద్దడం, నీళ్లతో కడగటం, ఆయింట్‌మెంట్ పెట్టడం లాంటివి చేయకూడదు.
- టపాసుల పొగ వల్ల కళ్ల మంటలు సహజం. ఈ మంటల నుంచి ఉపశమాన్నిచ్చే లూబ్రికెంట్స్ ఉంటాయి. వీటి కోసం పండగ ముందే వైద్యులను కలవాలి.
- కాంటాక్ట్ లెన్స్‌లు వేసుకునేవాళ్లు టపాసులు కాల్చేటప్పుడు సాధారణ కళ్లజోడు వాడటం అవసరం. కాంటాక్ట్ లెన్స్‌ల మీద వేడి ప్రభావం ఎక్కువ. కొన్ని సందర్భాల్లో కార్నియా కాలే ప్రమాదం కూడా ఉంటుంది.
- చిచ్చుబుడ్లు, రాకెట్ల వల్లే కళ్లకు గాయాలయ్యే అవకాశాలు ఎక్కువ. మరీ ముఖ్యంగా కంటికయ్యే గాయాల్లో కళ్ల మంటలు మొదలుకుని కార్నియా లేచిపోవటం, పాక్షిక అంధత్వం, పూర్తి అంధత్వం వరకూ ఎన్నో రకాల సమస్యలు చోటు చేసుకుంటూ ఉంటాయి. టపాసులు పేలేటప్పుడు వెలువడే వేడి 1200 డిగ్రీల వరకూ ఉంటుంది. ఇది మరిగే నీళ్ల 1000 డిగ్రీల ఉష్ణోగ్రత కంటే ఎక్కువ. గాజును కరిగించేంతగా, థర్డ్ డిగ్రీ గాయాలు చేసేంత ప్రమాదకరంగా ఉంటుంది. కాబట్టి టపాసులు పేల్చేటప్పుడు నిర్లక్ష్యం వద్దే వద్దు!

◆◆◆

కాలుష్యాన్ని పీల్చొద్దు!



టపాసుల పేలుడుతోపాటు వెలువడే పొగ వల్ల ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతాయి. మరీ ముఖ్యంగా ఆరోగ్యకరమైన వ్యక్తులతోపాటు అప్పటికే ఉబ్బసం, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ మొదలైన శ్వాసకోశ వ్యాధులు ఉన్న వాళ్లకు టపాసుల పొగ వల్ల విపరీతమైన ఆరోగ్య నష్టం జరుగుతుంది. టపాసుల తయారీలో సల్ఫర్ (గంధకం), కార్బన్ వాడతారు. వీటి వల్లే టపాసులు పెద్ద పెద్ద వెలుగులను వెదజల్లుతాయి. వాటికితోడు ఆర్సినిక్, మాంగనీస్, సోడియం ఆక్సలేట్, అల్యూవి నియం, ఐరన్ డస్ట్ పౌడర్, పొటాషియం, బేరియం నైట్రేట్ మొదలైన ఎన్నో రసాయనాలను వాడతారు. వీటి వల్ల టపాసులు కాల్చినప్పుడు దట్టమైన పొగలు అలుముకుంటాయి. ఈ పొగల్లో సల్ఫర్ డయాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్...మొదలైన విష వాయువులు ఉంటాయి. వీటిని పీల్చడం వల్ల స్వల్పంగా దగ్గుతో పాటు ఊపిరితిత్తుల్లో కఫం పేరుకోవటం, ఊపిరి తీసుకోవటంలో ఇబ్బంది, ఆయాసం, అలర్జిక్ రైనైటిస్, రెస్పిరేటరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్లు మొదలైన సమస్యలు వేధిస్తాయి.

◆◆◆

సురక్షిత పద్ధతులివే!

- ముక్కుకీ, నోటికీ కాటన్ స్కార్ఫ్ చుట్టుకోవాలి.
- రంగుల పొగలు వెదజల్లే టపాసులు మరింత ప్రమాదకరమైనవి. వాటిని కాల్చకపోవటమే మంచిది.
- చైనా తయారీ టపాసులు కార్బన్ మోనాక్సైడ్ లాంటి విషవాయువులను విడుదల చేస్తాయి. వాటికి బదులుగా దేశీయ టపాసులనే ఎంచుకోవాలి.
- తక్కువ పొగ వెదజల్లే టపాసులకు పరిమితమవటం మేలు.
- టపాసులు కాలేటప్పుడు వాటి మీదకు వంగి చూడకుండా, చేతిని దూరంగా చాపి ఉంచాలి.
- మూసి ఉన్న ప్రదేశాల్లో కాకుండా వాకిట్లో లేదా మేడ పైన, ఆట స్థలాల్లో టపాసులు కాల్చటం ఉత్తమం.
- ఇంట్లోకి పొగ వెళ్లకుండా తలుపులు మూసి ఉంచాలి.
- టపాసులు కాల్చిన మరునాడు ఉదయాన్నే వాకింగ్ చేయటం మానుకోవాలి. ఆ సమయంలో వాతావరణంలో కాలుష్యాల పరిమాణం ఎక్కువగా ఉంటుంది.
- ఎక్కువ పొగను వెదజల్లే చిచ్చుబుడ్లు, మతాబులు, భూచక్రాలు లాంటి టపాసులను కాల్చకూడదు.
- మరీ ముఖ్యంగా ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలున్నవాళ్లు టపాసులకు దూరంగా ఉండాలి.
- అపార్ట్‌మెంట్లలో ఉండేవాళ్లు బాల్కనీల్లో కాకుండా కిందకి దిగి వచ్చి అపార్ట్‌మెంట్ ఆవరణలో టపాసులు పేల్చాలి.

◆◆◆

టపాసులు కాల్చేటప్పుడు

- ఒకరి తర్వాత ఒకరుగా ఒక్కొక టపాసు కాల్చాలి. ఇలా చేస్తే శబ్దంతోపాటు, పొగ కూడా తక్కువగా వెలువడుతుంది.
- టపాసులు కాల్చటానికి పొడవాటి క్యాండిల్, అగర్‌బత్తీ ఉపయోగించాలి. చేతిని పూర్తిగా చాపి టపాసులను ముట్టించాలి.
- బకెట్లలో నీళ్లు అందుబాటులో పెట్టుకుంటే మంటలు ఆర్పటానికి వీలుగా ఉంటుంది. పొరపాటున చేతులు కాలితే వెంటనే ఆ నీళ్లలో ముంచటానికి అనువుగా ఉంటుంది.
- పసిపిల్లల చెవుల్లో దూది ఉండలు ఉంచాలి.
- పేలని టపాసులను దగ్గరికెళ్లి పరీక్షించటం మానుకోవాలి.
- టపాసులను వంట గదిలో, పూజ గదిలో ఉంచకూడదు.
- గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ ఆపేయాలి. నిండుగా ఉన్న సిలిండర్‌లను బాల్కనీల్లో, టపాసులు పేల్చే ప్రదేశాలకు దగ్గర్లో ఉంచకూడదు. దూసుకొచ్చే రాకెట్ల లాంటివి సిలిండర్లకు తగిలే ప్రమాదం ఉంటుంది.
- టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులే ధరించాలి.

ఒళ్లు జర భద్రం!

దీపావళి టపాసులు పేల్చినప్పుడు శబ్దంతోపాటు దట్టమైన పొగలూ అలుముకుంటాయి. టపాసుల తయారీలో వాడే అత్యధిక మెగ్నీషియం, కార్బైట్‌లే ఇంత దట్టమైన పొగలకు కారణం. టపాసుల పొగ చర్మాన్ని తాకినప్పుడు ఈ రసాయనాలు చర్మం మీద అతుక్కుని దురద, మంట, కెమికల్ బర్న్, అలర్జీలను కలగజేస్తాయి. ఇక పొగతోపాటు టపాసుల తయారీలో ఉపయోగించే రాళ్లు కూడా చర్మానికి తగిలి గాయాలు చేస్తాయి. కొన్నిసార్లు బాంబులు, రాకెట్లు చాలా దగ్గర్నుంచి పేలినప్పుడు వాటి నిప్పు రవ్వలు చర్మం మీద పడి అంటుకుపోతాయి. కొన్ని బాంబులు చేతుల్లోనే పేలతాయి. ఇలా దీపావళి టపాసుల పేలుళ్లు, పొగల వల్ల చర్మానికి జరిగే నష్టం ఎక్కువే! కాబట్టి కొన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలి.

- ఒళ్లంతా కప్పి ఉంచే కాటన్ దుస్తులు ధరించాలి.
- పేలే టపాసులకు దూరంగా ఉండాలి.
- మీది సున్నిత చర్మమైతే టపాసులు పేల్చే సమయంలో ముఖానికి, చేతులకు కాటన్ స్కార్ఫ్ చుట్టుకోవాలి.
- టపాసులు పేల్చడానికి ముందు, మాయిశ్చరైజర్ చర్మానికి పూసుకుంటే రక్షణ పొరగా పని చేస్తుంది.
- టపాసులు కాల్చిన తర్వాత సబ్బు నీటితో చేతులు, ముఖం కడుక్కోవటం మర్చిపోకూడదు.
- శుభ్రంగా కడిగిన తర్వాత తప్పనిసరిగా మాయిశ్చరైజర్ రాసుకోవాలి.

చర్మం కాలితే?

టపాసుల పేలుడు వల్ల చర్మం మీద గాయాలైనా, కాలినా ఈ క్రింది తక్షణ చికిత్స చేసుకోవాలి

- ధారగా కారే నీళ్ల కింద ఉంచి, గాయాన్ని కడగాలి
- ఐస్ క్యూబ్స్ రుద్దడం, నూనె పూయడం, టించర్, డెటాల్, టూత్‌పేస్ట్ పూసుకోవడం లాంటివి చేయకూడదు
- గాయాన్ని శుభ్రంగా కడిగి యాంటీబయాటిక్ క్రీమ్ పూసుకుంటే సరిపోతుంది
- గాయం తీవ్రంగా ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి
- ఆస్పత్రికి చేరేవరకూ గాయాలను శుభ్రమైన బట్టతో కప్పి ఉంచాలి.
- బొబ్బ ఇబ్బంది పెడుతుంటే, స్టెరైల్ చేసిన సూదితో గుచ్చి, లోపలి నీళ్లను బయటకు రప్పించాలి. కానీ పైన ఏర్పడిన రక్షణ పొరను పీకకూడదు



- లోతైన కాలిన గాయాలకు తప్పనిసరిగా డ్రెస్సింగ్ అవసరమవుతుంది. మాయిస్ట్ డ్రెస్సింగ్ కోసం, యాంటీబయాటిక్ క్రీమ్ అప్లై చేసి, మాయిశ్చరైజర్, యాంటీబయాటిక్ కాంబినేషన్ మెటీరియల్‌తో డ్రెస్సింగ్ చేయాలి.
- లోతైన గాయాల మీద దూదితో కట్టు కడితే అది గాయానికి అతుక్కుపోయి, దాన్ని తొలగించిన ప్రతిసారీ కొత్తగా మానిపోతున్న గాయం మళ్లీ తిరగబెడుతూ ఉంటుంది. కాబట్టి దూది జోలికి వెళ్లకూడదు
- టపాసులను తాకిన, కాల్చిన చేతులను నేరుగా ముఖం మీద, కళ్లలో పెట్టుకోకూడదు.
- టపాసులు కాల్చిన తర్వాత దురదలు మొదలైతే వెంటనే వైద్యుల్ని కలవాలి
- కాలిన ప్రదేశంలో ఏవైనా నగలు, చేతి గడియారాలు ఉంటే వాటిని తొలగించాలి.

డాక్టర్ స్వప్నప్రియ
కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్,
హైటెక్ సిటీ, హైదరాబాద్



ఢామ్... ఢామ్ శబ్దాలతో జాగ్రత్త!

టపాసుల శబ్దాల వల్ల కలిగే నష్టం నుంచి మనల్ని మనమే కాపాడుకోవటం అవసరం. టపాసుల శబ్దాల వల్ల కలిగే నష్టం రెండు అంశాల మీద ఆధారపడి ఉంటుంది. ఈ శబ్దాలకు మనం ఎంత దూరంలో ఉన్నాం? శబ్దం ఎంత తీవ్రంగా ఉంది? అనే రెండు అంశాల మీదే మనకు కలిగే వినికిడి నష్టం ఆధారపడి ఉంటుంది. టపాసులు చేసే పెద్ద శబ్దాల వల్ల హైపర్‌టెన్షన్, ఒత్తిడి, వినికిడిలోపం మొదలైన సమస్యలు తలెత్తుతాయి. విపరీతమైన శబ్దాల వల్ల కొన్నిసార్లు వినికిడి శక్తి పూర్తిగా కోల్పోయే ప్రమాదం కూడా లేకపోలేదు. అత్యధిక శబ్దాల కారణంగా....

- **టిన్నిటస్:** చెవుల్లో శబ్దం (గంట మోగినట్టు, సముద్రపు హోరు) మొదలవుతుంది. ఇది వినికిడి లోపానికి దారి తీయొచ్చు.
- **టెంపరరీ థ్రెషోల్డ్ షిఫ్ట్:** వినికిడి శక్తిలో స్వల్ప తగ్గుదల. ఇది సాధారణంగా ఒక రోజంతా ఉంటుంది.
- పర్మనెంట్ హియరింగ్ లాస్: కర్ణభేరి దెబ్బతినటం వల్ల శాశ్వత వినికిడి లోపం ఏర్పడవచ్చు.

వినికిడి నిక్షేపంగా!

టపాసుల శబ్దం కారణంగా వినికిడి శక్తి దెబ్బతినకుండా ఉండాలంటే సాధ్యమైనంత తక్కువ శబ్దం వచ్చే టపాసులనే పేల్చాలి. ఈ ముందు జాగ్రత్తలతోపాటు...

- చెవులకు ఇయర్ ప్లగ్స్ పెట్టుకోవటం వల్ల శబ్దం నేరుగా కర్ణభేరికి చేరకుండా ఉంటుంది.
- ఫోమ్ ప్లగ్స్ లేదా హెడ్ ఫోన్స్ వాడినా ఫలితం ఉంటుంది.
- ఏ మాత్రం శబ్దం తాకిడికీ గురవకూడదనుకుంటే ఇయర్ ప్లగ్స్‌తోపాటు, హెడ్ ఫోన్స్ కూడా వాడాలి.
- టపాసుల పేలుడు వల్ల వినికిడిలో మార్పు అనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి. వినికిడికి సంబంధించిన సమస్యలకు కారణాన్నీ, దెబ్బ తిన్న చెవి భాగాన్నీ గుర్తించి ఎంత త్వరగా గుర్తించి అంత త్వరగా చికిత్స అందిస్తే మేలు. అప్పుడు అంత త్వరగా వినికిడి తిరిగొస్తుంది.
- శబ్దాలకు ఎంత దూరంలో ఉంటే నష్టం అంత తక్కువగా ఉంటుంది. కాబట్టి పెద్ద శబ్దంతో పేలే టపాసులకు సాధ్యమైనంత ఎక్కువ దూరం పాటించాలి.
- పెద్దలైతే 20 మీటర్లు, పిల్లలైతే 50 మీటర్ల దూరం పాటించాలి.

డాక్టర్ సుధీర్ రెడ్డి
ఇఎన్‌టి సర్జన్, త్రీ సెన్సెస్,
హబ్సిగూడ, హైదరాబాద్.





క్యాన్సర్ కేర్

కేన్సర్ ఎవరికి?

పూర్వంతో పోల్చుకుంటే కేన్సర్ వచ్చే అవకాశాలు పెరిగాయి. ఆహారం, జీవనశైలిలో కాలక్రమేణా ఎన్నో మార్పులొచ్చాయి. వాతావరణంలో కాలుష్యం పెరిగింది. పుట్టి, పెరిగే ప్రదేశాలు మారిపోతున్నాయి. ఈ అంశాలన్నీ శరీరం మీద ప్రభావం చూపిస్తాయి. వీటికి పైన చెప్పిన కారణాలు కూడా తోడైతే కేన్సర్ వచ్చే అవకాశాలు మరింత పెరుగుతాయి. కేన్సర్‌కు కారణాలు ప్రధానంగా నాలుగు. అవేంటంటే...

1. జన్యుపరమైన కారణాలు *(వంశపారంపర్యంగా సంక్రమించేవి)*
2. కాలుష్యం, పర్యావరణం
3. జీవనశైలి
4. ఆహారపుటలవాట్లు

ఎంతటి ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపుటలవాట్లతో పెరిగినా జన్యువుల్లో కేన్సర్ కారకం ఉంటే వంశపారంపర్యంగా కేన్సర్ సంక్రమించవచ్చు. అయితే ఈ రకమైన క్యాన్సర్లు 30 నుంచి 35 ఏళ్ల లోపే బయల్పడతాయి. అయితే కేన్సర్ కారకాల్లో వంశపారంపర్యంగా సంక్రమించే అవకాశాలను, పర్యావరణ మార్పుల వల్ల కేన్సర్ సంక్రమించే అవకాశాలను నియంత్రించలేకపోయినా, ఆహారపుటలవాట్లు, జీవనశైలిని ఆరోగ్యకరంగా మార్చుకునే వీలు మన చేతుల్లోనే ఉంది.



ఆహారపుటలవాట్లు, నియమాలు, శైలి

ఎప్పటికప్పుడు వేడిగా వండుకుని తినే అలవాటు కాలక్రమేణా అంతరించింది. 30, 40 ఏళ్ల క్రితం మధ్యాహ్నం వండుకున్న కూరలు మధ్యాహ్నానికే తినేసేవాళ్లం. రాత్రికి తిరిగి వేడిగా వండుకునేవాళ్లం. అలాగే మాంసాహారమైనా! కానీ ఇప్పుడు నాన్ వెజ్ తినాలనిపిస్తే ఖరీదైన రెస్టారెంట్లకు పరిగెడుతూ ఉంటాం. అక్కడ వడ్డించే పదార్థాల్లో వాడిన కోడి మాంసం ఎప్పటిదో వండేవాళ్లకే తెలియదు. ఇలా హోటళ్లలో, రెస్టారెంట్లలో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తయారయ్యే ప్రాసెస్డ్ ఫుడ్ వల్ల కేన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి ప్రాసెస్ చేసిన మాంసం, పదార్థాలు, చక్కెరలు ఎక్కువగా, తాజా కూరగాయలు, పళ్లు తక్కువగా తినటం లాంటి అలవాట్లన్నీ కేన్సర్ కారకాలే! ఈ అలవాట్లకు తోడు శారీరక వ్యాయామం లోపించటం వల్ల శరీర బరువు పెరిగి కేన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతున్నాయి.

నివారణ మన చేతుల్లోనే!

అధిక బరువుతో సంబంధం ఉండే కేన్సర్లకు గురి కాకుండా ఉండాలంటే తీసుకునే ఆహారం పట్ల అప్రమత్తంగా ఉండాలి. దురలవాట్లను వదిలేసి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలి. ఇందుకోసం...

- ఏడాదికి ఒకసారి హెల్త్ చెకప్ చేయించుకుంటూ కేన్సర్‌ను ముందుగానే కనిపెడుతూ ఉండాలి.
- తాజా కూరగాయలు, పళ్లు ఎక్కువగా తీసుకోవాలి.
- ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెరలు తగ్గించాలి.
- శీతల పానీయాలు మానేయాలి.
- ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- వంశపారంపర్యంగా కేన్సర్ సంక్రమించే అవకాశాలున్నవాళ్లు మరింత అప్రమత్తంగా ఉండాలి.
- శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.
- ఏ అనారోగ్య లక్షణమైనా మూడు వారాలకు మించి తగ్గకపోతే కేన్సర్ అయి ఉండొచ్చు. కాబట్టి ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి.
- ఎంత త్వరగా కేన్సర్‌ను గుర్తిస్తే, చికిత్స అంత సులభతరం అవుతుంది. చికిత్సకయ్యే ఖర్చు కూడా తక్కువగా ఉంటుంది. అలాగే నివారణ అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి.

వి కేర్

చలి పులికి దూరంగా...

ఒకసారి సోకే ఇన్‌ఫెక్షన్ వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం 10% తరుగుతూ ఉంటుంది. పదే పదే ఇన్‌ఫెక్షన్లు సోకుతూ ఉంటే ఊపిరితిత్తుల సామర్థ్యం క్రమేపీ తగ్గిపోయి, తిరిగి సరిదిద్దలేని పరిస్థితి వస్తుంది. కాబట్టి లంగ్స్‌కు ఇన్‌ఫెక్షన్ సోకితే 'మందులతో నయం చేసుకోవచ్చు' అనే ధీమా వదులుకోవాలి. సమస్య వచ్చిన తర్వాత చికిత్స తీసుకునే బదులు, ఆ సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు పాటించడం అలవాటు చేసుకోవాలి. ఇందుకోసం...

- ముక్కు, నోరు, చెవులకు చల్లగాలి సోకకుండా స్కార్ఫ్ కట్టుకోవాలి.
- విపరీతమైన చల్లదనం ఉండే వేళల్లో బయటకు వెళ్లకూడదు. మరీ ఉదయాన్నే లేదా రాత్రి వేళ ఇంటిపట్టునే ఉండాలి.
- రెండు రోజుల్లో జలుబు తగ్గకపోయినా, జ్వరం మొదలైనా వైద్యుల్ని కలవాలి.
- ఆయాసం ఎక్కువైనా, కఫం రంగు మారినా వైద్యులను కలవటం తప్పనిసరి.
- నీళ్లు ఎక్కువగా తాగటం వల్ల కఫం తేలికగా కరిగి బయటకొస్తుంది. కాబట్టి నీళ్లు ఎక్కువ తాగాలి.
- డీప్ బ్రీదింగ్ ఎక్సర్‌సైజ్‌ల వల్ల కూడా కఫం బయటకు వచ్చేస్తుంది.



- మూసి ఉండే గదుల్లో కాకుండా గాలి, వెలుతురు ధారాళంగా ఉండే ప్రదేశాల్లో ఉండాలి.
- ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవాళ్లు చలి కాలంలో ఏసి గదులకు దూరంగా ఉండాలి. సినిమా హాళ్లు, ఆడిటోరియంలు లాంటి జన సమ్మర్ధం ఉన్న ప్రాంతాలకు వెళ్లకపోవటమే మంచిది.
- అగర్‌బత్తీలు, ఇతర పొగల వల్ల ఊపిరితిత్తులు అలసటకు లోనవుతాయి. కాబట్టి పొగలకు దూరంగా ఉండాలి.
- కాలుష్యం కలగలసిన పొగమంచు...'స్మాగ్' ఊపిరితిత్తులకు చేటు చేస్తుంది. స్మాగ్ ఎక్కువగా ఉండే ఉదయం వేళల్లో బయటకు వెళ్లకపోవమే మంచిది.

హెల్తీ రెసిపి

రాగి మొలకల జావ



రక్తహీనత తొలగాలంటే ఐరన్ ఎక్కువగా తీసుకోవాలి. రాగులను ఎండబెట్టి, పిండి కొట్టించి వాడుకోడానికి బదులుగా, వాటిని మొలకెత్తించి జావ కాచుకుంటే, సమృద్ధిగా ఐరన్ సమకూరి, రక్తహీనత తొలగిపోతుంది.

- రాగులను శుభ్రం చేసుకుని, రాత్రంతా నీళ్లలో నానబెట్టాలి.
- మరుసటి రోజు శుభ్రమైన పలుచని కాటన్ టవల్‌లో రాగులను మూటగట్టి పైన బరువుంచాలి.
- తర్వాతి రోజుకి రాగులు మొలకెత్తుతాయి.
- ఇలా మొలకెత్తిన రాగులను ఒక రోజంతా నీడలో ఎండబెట్టి, పిండి కొట్టుకోవాలి.
- ఈ పిండితో జావ లేదా సంకటి తయారు చేసుకుంటే రెట్టింపు పోషకాలు, ఐరన్ అందుతాయి.

రెమెడీ

అలసిన కాళ్లకు స్వాంతన



మన శరీరంలో ఎక్కువ శ్రమకు లోనయ్యేవి కాళ్లే! శరీర బరువును మోస్తూ రోజంతా నడుస్తూ ఉండే కాళ్లు సాయంత్రానికి విపరీతంగా అలసిపోతాయి. దాంతో కాళ్ల నొప్పులు మొదలవుతాయి. ఇలాంటప్పుడు నొప్పులు తగ్గి, శక్తి పుంజుకునేలా ఈ చిట్కా పాటించండి.

- అర బక్కెట్‌లో వేడి నీళ్లు నింపి, 4 చుక్కల యూకలిప్టస్ ఆయిల్, చెరో రెండు చుక్కల పెప్పర్‌మింట్ ఆయిల్, క్లోవ్ ఆయిల్(లవంగ నూనె) వేసి, కలిపి పాదాలు మునిగేలా ఉంచాలి. 10 నుంచి 15 నిమిషాల తర్వాత కాళ్లను చల్లటి నీళ్లతో కడుక్కోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేయాలి.

ఫిట్‌నెస్

చేతులు బలంగా!

చేతులు అందంగా ఉండాలంటే, కొన్ని వ్యాయామాలు చేయక తప్పదు. మరీ ముఖ్యంగా నడుము పై భాగం, చేతులు, మోచేతి పైన ఉండే మూడు కండరాల సముదాయం 'ట్రైసెప్స్' చక్కని ఆకృతి సంతరించుకోవాలంటే 'చెయిర్ డిప్స్' వ్యాయామం చేయాలి. ఇందుకోసం...

- బలంగా ఉండే కుర్చీని ఎంచుకోవాలి.
- కుర్చీని ఆనుకుని నేల మీద కూర్చుని, కాళ్లను పొడవుగా చాపి, రెండు చేతులను కుర్చీ మీద ఉంచి, చేతుల సహాయంతో శరీరాన్ని పైకి లేపాలి.



- పైకి లేచి, కిందకి కుంగేటప్పుడు కాళ్లు రెండు మోకాళ్ల దగ్గర వంచాలి.
- ఇలా చేస్తున్నప్పుడు పూర్తి శరీర బరువు చేతుల మీద పడుతుంది.
- ఇలా 20 సార్లు, వరుసగా 3 సెట్లు చేయాలి.
- ఈ వ్యాయామం వల్ల భుజాలు, వెన్ను, చేతుల్లోని కండరాలు బలపడతాయి.

వామ్మో.. భౌ.. భౌ!



వీధి కుక్కలతో జనం బెంబేలు.. నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోనూ బెడద

విజయనగరం జిల్లా చీపురుపల్లిలో గురువారం రెండు పిచ్చి కుక్కలు ఏకంగా 53 మందిని కరిచి గాయపరిచాయి. విజయవాడ ప్రభుత్వాసుపత్రికి ఏడాదికి సుమారు 1500 మంది బాధితులు వస్తున్నారని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఇలా.. నగరం, పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీటి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

- ప్రతి ఏటా పెరుగుతున్న సంఖ్య
- బెజవాడలోనే 20 వేల వీధి కుక్కలు
- రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఖ్య లక్షల్లోనే
- కుక్కకాటుకు సత్వర చికిత్సే పరిష్కారం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

కాలనీలోని కిరాణా షాపునకు వెళ్లాలంటే భయం! రోడ్డుపై నడవాలంటే ఆందోళన! నిత్యం వెళ్లే ప్రాంతమైనా అప్రమత్తంగా ఉండాల్సిందే! రాత్రి వేళ అయితే పరిస్థితి మరింత భయానకం! దీనికి కారణం వీధి కుక్కలే! నగరాలు, పట్టణాలు, గ్రామాలు.. ఇలా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఏ కుక్క కరిచినా ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిందే. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం. వీధి కుక్కలతో సమస్య లేకుండా చేసే బాధ్యత స్థానిక సంస్థలదే. ఈ విషయంలో సిబ్బంది తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. స్థానికుల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు మాత్రమే వారిలో కదలిక కనిపిస్తోంది. విజయవాడ నగరంలోనే మొత్తం 20 వేల వీధి కుక్కలు ఉన్నాయని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈసంఖ్య లక్షల్లో ఉంటుందని తెలుస్తోంది.

ఏబీసీకి వ్యవస్థ ఉన్నా...

రెండు విధాలుగా వీధి కుక్కలను పట్టుకుంటారు. కుక్కలలో సంతాన ఉత్పత్తి నియంత్రణ(ఏబీసీ-యానిమల్ బర్త్ కంట్రోల్)కు రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో జిల్లాకు ఒక్కో సంస్థను ఎంపిక చేస్తారు. ఈ సంస్థ ప్రతినిధులు ప్రత్యేకంగా కుక్కలు పట్టుకునే వారిని తీసుకొస్తారు. కుక్కలు బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడెక్కడ ఉంటాయో స్థానిక సంస్థల సిబ్బంది చూపిస్తారు. ఆ కుక్కలను పట్టుకుని వాటికి ఏబీసీ చేయడంతో పాటు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇచ్చే బాధ్యతను ఆయా సంస్థలు నిర్వహించాలి. నగరాల్లో అయితే వెటర్నరీ విభాగం సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇస్తారు. అయితే, కుక్కలను పట్టుకోవడానికి సిబ్బంది వ్యాన్‌తో బయలుదేరినప్పుడు ఆడ కుక్కలు తప్పించుకుంటున్నాయన్న అభిప్రాయాన్ని పశువైద్యులు వ్యక్తం చేస్తున్నారు. ఆడ కుక్కలు ఏడాదిలో రెండుసార్లు పిల్లలకు జన్మనిస్తాయి. ఒక్కో ఆడ కుక్క సుమారుగా ఏడెనిమిది పిల్లలకు జన్మనిస్తుంది. దీంతో వాటి సంఖ్య తగ్గడం లేదన్న అభిప్రాయం పశువైద్యుల నుంచి వ్యక్తమవుతోంది.

ఇదీ చికిత్సా విధానం

రేబిస్ వ్యాధి లక్షణాలు ఉన్న కుక్క సహా ఏ కుక్క కరిచినా వెంటనే గాయాన్ని డెటాల్, స్పిరిట్, సబ్బుతో శుభ్రం చేయాలి. సబ్బుల్లో లైఫ్‌బాయ్‌ను ఉపయోగించడం ఉత్తమం. గాయంలో ఉన్న వైరస్‌ను చంపేయడానికి ఇందులో ఉన్న కార్బలిక్ యాసిడ్ ఉపయోగపడుతుంది. లిక్కర్‌తోనూ గాయాన్ని శుభ్రం చేయవచ్చు. కుక్క కరిచిన భాగాన్ని వేగంగా నీళ్లు వచ్చే కుళాయి కింద ఉంచాలి. రక్తం బయటకు పోయేలా కాటు పడిన భాగం వద్ద గట్టిగా నొక్కాలి. శుభ్రం చేసిన తర్వాత పది నిమిషాలు ఎండ తగిలేలా గాయాన్ని ఉంచాలి. వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. కుక్క కాటు వేసిన రోజు నుంచి దశల వారీగా యాంటీ రేబిస్ ఇంజక్షన్ చేయించుకోవాలి. గాయమైన రోజు ఒక డోసు, మూడో రోజు, ఏడో రోజు, 14వ రోజు, 21వ రోజున ఈ ఇంజక్షన్ తీసుకోవాలి. గాయమైన 90వ రోజున కూడా ఈ ఇంజక్షన్ తీసుకుంటే మంచిది.

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం



ఏ కుక్క కరిచినా, అందులోనూ వీధి కుక్కలు అయితే తక్షణమే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. రేబిస్ వ్యాధి సోకితే నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. వింతగా ప్రవర్తిస్తారు. నీటిని చూస్తే పెద్దగా అరుపులు, కేకలు వేస్తారు. రేబిస్ లక్షణాలు ఉన్న కుక్కలు కరిచినప్పుడు వైరస్ ప్రభావం కేంద్ర నాడీ వ్యవస్థపై పడుతుంది. ముఖం, వెన్నెముక భాగాల్లో కరిస్తే వైరస్ నాడీ వ్యవస్థకు వేగంగా వ్యాపిస్తుంది. కాలు, తొడ, చేయి భాగాలపై కరిచినప్పుడు కొంత ఆలస్యంగా వైరస్ నాడీ వ్యవస్థను చేరుకుంటుంది. రేబిస్ లక్షణాలు బయటపడిన తర్వాత నయం చేయడానికి ఎలాంటి వైద్యం లేదు. రేబిస్ కారక లీసా వైరస్ కుక్కల్లోనే కాకుండా పిల్లులు, నక్కలు, గబ్బిలాల్లోనూ ఉంటుంది. ఏది కరిచినా వెంటనే టీటీ ఇంజక్షన్ చేయించుకోవాలి.

కుక్కలను పెంచుకునే వారు పిల్లలను తీసుకున్నప్పుడు వెంటనే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి. నెల తర్వాత బూస్టర్ డోస్ వేయించాలి.





రేబిస్ కుక్కలతో జాగ్రత్త!

రహదారులు, వీధుల్లో గుంపులు, గుంపులుగా కుక్కలు ఉంటాయి. అప్పటి వరకు కుదురుగా కనిపించిన వాటిలో నుంచి ఒక్కసారిగా ఏదో ఒక కుక్క అటుగా వెళ్తున్న వారిపై దాడి చేస్తుంది. అది మంచి కుక్కా, రేబిస్ వ్యాధి ఉన్న కుక్కా అని నిర్ధారించుకోలేక బాధితులు సతమతమవుతుంటారు. రేబిస్ లక్షణాలు ఉన్న కుక్కలు విచిత్రంగా ప్రవరిస్తాయని పశువైద్యులు చెబుతున్నారు. కోపంగా, ఉద్రేకంగా కనిపించడం, నోటి నుంచి ఎక్కువగా చొంగ కారడం, ఎదురుగా ఉన్నది వ్యక్తులైనా, జంతువులైనా దూకుడుగా వెళ్లి దాడి చేయడం, చలనం లేని వస్తువులను కరవడం వంటి లక్షణాలు 90 శాతం రేబిస్ కుక్కలలో ఉంటాయని అంటున్నారు. మరికొన్ని రేబిస్ కుక్కలు ఇలాంటి లక్షణాలు లేకుండా ఎక్కడో ఒకచోట మూలన ఉంటాయి. ఎటువంటి ఆహారాన్ని తీసుకోవు. రెండు, మూడు రోజుల తర్వాత చనిపోతాయి. ఈ కుక్కలు కరిస్తే వెంటనే చికిత్స చేయించుకోవాలి.

కుక్కల సంఖ్య పెరుగుతోంది



కుక్కల సంఖ్యను నియంత్రించడానికి ఏబీసీ(యానిమల్ బర్త్ కంట్రోల్) జరుగుతోంది. పట్టుకున్న కుక్కలకు సంతాన ఉత్పత్తి జరగకుండా ఆపరేషన్ చేస్తాం. విజయవాడ కార్పొరేషన్ పరిధిలో ఏబీసీని సెప్టెంబరు నుంచి ప్రారంభించాం. ఇప్పటి వరకు 720 కుక్కలకు ఏబీసీ చేశాం.

- డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, విజయవాడ నగర పాలక సంస్థ

ఆడ కుక్కలపై శ్రద్ధ పెట్టాలి



బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను పట్టుకోవడానికి వెళ్లే సిబ్బంది మగ కుక్కల కంటే ఆడ కుక్కలను టార్గెట్ చేసుకోవాలి. వీధి కుక్కల సంఖ్య పెరుగుతున్నట్టుగా కనిపిస్తోంది. విజయవాడ ఎన్టీఆర్ సూపర్ స్పెషాలిటీ వెటర్నరీ ఆసుపత్రిలో కుక్కలకు నిత్యం ఉచితంగా ఏఆర్వీ ఇస్తున్నాం. ప్రపంచ జంతు దినోత్సవం, యాంటీ రేబిస్ డే సందర్భంగా లక్ష్యాలను నిర్దేశించుకుని వ్యాక్సిన్ ఇస్తారు.

- డాక్టర్ పచ్చా ప్రేమ్‌చంద్, జాయింట్ డైరెక్టర్, ఎన్టీఆర్ ఎస్ఎస్‌వీహెచ్

వ్యాన్‌ను గుర్తు పట్టేస్తాయి

పట్టుకోవడానికి వెళ్లినప్పుడు వ్యాన్‌ను వీధి కుక్కలు గుర్తు పట్టేస్తాయి. ఈ విషయాన్ని వివిధ ప్రాంతాల్లో ఉన్న కుక్కలకు తెలియజేస్తాయి. ఉదాహరణకు ఒక కాకి చనిపోయిన తర్వాత దీన్ని గమనించిన మరో కాకి వెళ్లి పదుల సంఖ్యలో కాకులను తీసుకొస్తుంది. ఆ విధంగానే వ్యాన్‌ను గమనించిన ఒక కుక్క మిగిలిన కుక్కలను ఆ మార్గంలో వెళ్లకుండా అప్రమత్తం చేస్తుంది. ముఖ్యంగా ఆడ కుక్కలు పారిపోతాయి.

- నవీన్, మార్గ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి

విద్యాసాగర్‌కు హైకోర్టు షాక్

- ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో రిమాండ్ ఉత్తర్వుల సవాల్ పిటిషన్ కొట్టివేత
- చట్ట ప్రకారమే పోలీసులు అరెస్టు చేశారని వెల్లడి
- అరెస్టుకు కారణాలు తెలిపే ఏకరీతి విధానాన్ని తీసుకురావాలని డీజీపీకి న్యాయస్థానం ఆదేశం

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌కు హైకోర్టు షాకిచ్చింది. ముంబై నటి కాదంబరి జెత్వాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో మేజిస్ట్రేట్ ఇచ్చిన రిమాండ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. సెప్టెంబరు 20న విద్యాసాగర్ అరెస్టు సమయంలో ఆయన అరెస్ట్‌కుగల కారణాలు వివరించి పోలీసులు చట్టనిబంధనలు అనుసరించారని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అరెస్టు సమయంలో పోలీసులు చట్టనిబంధనలు అనుసరించలేదన్న వాదనతో ఏకీభవించలేమన్నారు. విజయవాడ 4వ అదనపు చీఫ్ మేజిస్ట్రేట్ సెప్టెంబరు 23న ఇచ్చిన రిమాండ్ ఉత్తర్వులను కొట్టివేసేందుకు ఎలాంటి కారణాలు లేవని తేల్చిచెప్పారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి సోమవారం తీర్పు ఇచ్చారు. ఏపీ పోలీస్ మ్యాన్యువల్.. వ్యక్తి అరెస్టు, రిమాండ్, బెయిల్ విషయంలో అనుసరించాల్సిన విధానం తెలియజేస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1), బీఎన్ఎస్ఎస్ చట్టంలోని సెక్షన్ 47(1) ప్రకారం అరెస్టు సమయంలో దారితీసిన కారణాలను నిందితుడికి రాతపూర్వకంగా తెలియజేయాల్సి ఉంటుందన్నారు. రిమాండ్‌ను వ్యతిరేకించడంతో పాటు బెయిల్ కోసం పోరాడేందుకు వీలుగా.. కేసు నమోదుకు గల ముఖ్య కారణాలను పోలీసులు చెప్పాలని న్యాయమూర్తి తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసే సమయంలో దానికిగల కారణాలను వివరించేందుకు రాష్ట్ర పోలీసులు నిర్దిష్ట విధానాలను అనుసరించడం లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొందరు పోలీసులు రాతపూర్వక ఇస్తుంటే, మరికొందరు పోలీసులు మౌఖికంగా చెబుతున్నారని తెలిపారు. అరెస్టుకు గల కారణాలను రాతపూర్వకంగా నిందితులకు తెలియజేసేందుకు తక్షణం ఏకరీతి విధానాన్ని తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు. అరెస్టుకు దారితీసిన కారణాలను పేర్కొనాలన్నారు. రిమాండ్ విధించాలని కోరుతూ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచే సమయంలో రిమాండ్ రిపోర్ట్‌తో పాటు ఏకరీతి విధానాన్ని కూడా జతచేయాలని సూచించారు. నిందితులకు కేసు నమోదు, అరెస్టుకు సంబంధించిన కారణాలు తెలియపరిచే విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1), బీఎన్ఎస్ఎస్ చట్టంలోని సెక్షన్ 47(1) ప్రకారం పోలీసులు వ్యవహరించారా? లేదా అనే విషయంపై సంతృప్తి నమోదు చేయాలని మేజిస్ట్రేట్‌లు, న్యాయాధికారులకు స్పష్టం చేశారు. తీర్పు ప్రతిని రాష్ట్రంలోని అందరు మేజిస్ట్రేట్లకు, డీజీపీకి పంపించాలని రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించారు. నటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ విజయవాడ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కుక్కల విద్యాసాగర్ హైకోర్టులో సవాల్ చేశారు.

మాజీ మంత్రి బాలినేని పిటిషన్ కొట్టివేత

- సీఈసీ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఈవీఎం, వీవీప్యాట్ల తనిఖీ, స్లిప్పులు లెక్కించడానికి బదులు మాక్ పోలింగ్ నిర్వహించాలన్న కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు అభ్యంతరం లేవనెత్తినప్పుడు బర్న్ మెమరీ ట్యాంపరింగ్ జరిగిందా? లేదా? నిర్ధారించుకునేందుకు మాక్ పోలింగ్ తప్ప ప్రత్యామ్నాయం లేదని కేంద్ర ఎన్నికల సంఘం కోర్టుకు విన్నవించింది. ఈ నిర్ణయం సుప్రీంకోర్టు తీర్పుకు లోబడి ఉందని పేర్కొంది. ఈ వాదనలతో హైకోర్టు ఏకీభవిస్తూ.. వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సోమవారం తీర్పు చెప్పారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో మాక్ పోలింగ్ నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులను బాలినేని హైకోర్టులో సవాల్ చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఈవీఎంల విషయంలో అభ్యర్థులు ఏదైనా అభ్యంతరం లేవనెత్తితే.. మాక్ పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించడం సుప్రీంకోర్టు తీర్పుకి విరుద్ధమని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పునకు ఎన్నికల సంఘం వక్రభాష్యం చెబుతోందన్నారు. వీవీప్యాట్‌లలో ఉన్న స్లిప్పులను, ఈవీఎంలలో పోలైన ఓట్లను సరిపోల్చి చూడాలన్నదే సుప్రీంకోర్టు తీర్పు ఉద్దేశమని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. అభ్యంతరం లేవనెత్తినప్పుడు బర్న్ మెమరీ ట్యాంపరింగ్ జరిగిందా? లేదా అని నిర్ధారించుకునేందుకు మాక్ పోలింగ్ తప్ప ప్రత్యామ్నాయం లేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం సుప్రీంకోర్టు తీర్పుకు లోబడే ఉందన్నారు. ఎన్నికల పిటిషన్ దాఖలు చేసి కోర్టు ఆదేశిస్తే తప్ప వీవీప్యాట్లలో స్లిప్‌లు లెక్కించడం సాధ్యపడదని స్పష్టం చేశారు.

జగన్ కుటుంబ వివాదంతో మాకేం పని?: అనగాని

తిరుపతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి కుటుంబ వ్యవహారంతో కూటమి పార్టీలకు సంబంధం లేదని రాష్ట్ర మంత్రి, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. తిరుపతిలో కూటమి పార్టీల జిల్లా నేతలతో నియోజకవర్గాల వారీగా శనివారం సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి మీడియాతో మాట్లాడారు. 'తల్లిని, చెల్లిని రోడ్డుకీడ్చిన జగన్ లాంటి వ్యక్తిని ఇంతవరకూ చూడలేదు. ఆయన ముందు కుటుంబ సమస్యను పరిష్కరించుకుని ఆ తర్వాత జనం గురించి జగన్ మాట్లాడాలి. జిల్లాల పునర్విభజనపై ప్రస్తుతానికి ఎలాంటి కసరత్తు చేయడంలేదు. రీసర్వే పూర్తయిన తర్వాత దానిమీద దృష్టిపెడతాం. మదనపల్లెలో ఫైళ్ల దహనం కేసు విచారణను వేగవంతం చేస్తున్నాం. ఇప్పటివరకు 34,600 ఫిర్యాదులు అక్కడ నుంచి అందాయి. వక్ఫ్‌బోర్డు భూముల అన్యాక్రాంతంపై విచారణ జరుగుతోంది' అని మంత్రి తెలిపారు.

ఆరోగ్య శాఖలో బదిలీలు

- ఇద్దరు ప్రిన్సిపాళ్లు, ముగ్గురు సూపరింటెండెంట్లకు స్థానచలనం

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మచిలీపట్నం మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా ఉన్న డా.ఎన్.వి.సుందరాచారిని బదిలీపై గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా నియమించారు. గుంటూరు బోధనాసుపత్రి సూపరింటెండెంట్ వై.కిరణ్‌ను తప్పించిన ప్రభుత్వం ఆయన స్థానంలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డా.ఎస్.ఎస్.వి.రమణను నియమించారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డా.డి.వెంకటేశ్వరరావును డీఎంఈ కార్యాలయంలో అదనపు డైరెక్టర్‌గా బదిలీ చేసింది. ఈ బదిలీల జాబితాలోని వారిలో కొంత మంది వైసీపీ అనుకూల వ్యక్తులనే ముద్ర ఉంది.

పౌరుల సహకారంతోనే అవినీతి కట్టడి

- విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభించిన ఏసీబీ డీజీ అతుల్ సింగ్

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అవినీతిని అరికట్టేందుకు పౌరుల మద్దతు కూడగట్టాల్సిన ఆవశ్యకత ఏజెన్సీలపై ఉందని ఏసీబీ డీజీ అతుల్‌సింగ్ అన్నారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ) ప్రతి ఏటా అక్టోబరు చివరి వారంలో నిర్వహించే 'నిఘా అవగాహన వారోత్సవాలు' విజయవాడలోని ఏసీబీ కార్యాలయంలో సింగ్ ప్రారంభించారు. 13 ఉమ్మడి జిల్లాల ఏసీబీ యూనిట్ల నుంచి అధికారులు, సిబ్బందిని పిలిపించి అవినీతి వల్ల కలిగే నష్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని ప్రమాణం చేయించారు.

ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారలేదు

- ఉద్యోగ, ఉపాధ్యాయ ఐక్య వేదిక నేత సూర్యనారాయణ

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారలేదు. వారు గత ప్రభుత్వంలో మాదిరి ఇష్టానుసారంగా, చట్టవిరుద్ధంగా, ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరించకుండా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలి' అని ఏపీ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘం ఐక్య వేదిక అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల హక్కులను కాపాడడానికి, వారిని చైతన్యపర్చడానికి ఐక్యవేదిక పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు.

ఖరము పాలు.. ఖర్మ ఖర్మ

- భారీ ఆదాయం వస్తుందని ఆశపెట్టి తమిళనాడు వ్యక్తి కుచ్చుటోపీ
- ఏపీ, తెలంగాణలో కోట్లు వసూలు
- పాల వ్యాపారం పేరిట గాడిదలు కొనుగోలు చేయించిన వైనం
- ఫ్రాంచైజీ, ఫ్రీజర్ అంటూ వసూళ్లు
- ఒక్కొక్కరి నుంచి లక్షలు లాగి మోసం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'గంగిగోవు పాలు గరిటెడైనను చాలు.. కడివెడైననేమి ఖరము పాలు' అన్న వేమన పద్యాన్ని చిన్నప్పుడు మనం చదువుకున్నాం. అయితే.. 'లీటరైన చాలు ఖరము పాలు.. బిందెడైననేమీ గేదెపాలు' అంటూ తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి తెలుగు రాష్ట్రాల్లో వందలాది మందికి కోట్లాది రూపాయలు మోసం చేశాడు. గాడిద పాలతో భారీ లాభాలు వస్తాయని, కాస్మోటిక్స్, ఫేస్‌క్రీమ్ కోసం వాడతారంటూ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసి ఏపీ, తెలంగాణలో వందలాది మందిని బుట్టలో వేసుకున్నాడు. భారీ ధరకు పాలు కొనుగోలు చేస్తానని ఆశ చూపి, వారితో గాడిదలు కొనిపించాడు. పాలు నిల్వ ఉంచేందుకు హై కెపాసిటీ ఫ్రీజర్లు, ఫ్రాంచైజీలు అంటూ ఒక్కొక్కరి నుంచి లక్షలాది రూపాయలు గుంజేశాడు. చివరకు ముఖం చాటేశాడు. ఇప్పుడు వాటిని ఏం చేయాలో పాలుపోక బాధితులు లబోదిబో అంటున్నారు. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి తిరునల్వేలి జిల్లా ముక్కుడల్ గ్రామంలో డాంకీ ఫారమ్ పెట్టాడు. యూ ట్యూబ్‌లో వీడియోలు చేస్తూ, లీటరు గాడిద పాలను 1600 నుంచి 1800 రూపాయలకు కొంటానంటూ పలువురికి ఎర వేశాడు. తనకు వచ్చిన ఆర్డర్లకు తగినట్టు తన దగ్గరున్న గాడిదలతో పాలు సరఫరా చేయలేక పోతున్నామని, ఎవరైనా సప్లై చేస్తే తీసుకుంటామని, నెలకు కనీసం లక్షన్నర వరకూ సంపాదించుకోవచ్చంటూ ఆశ పెట్టాడు. తన యూట్యూబ్ చానల్ వీక్షకులకు ఫోన్లు చేసి మేలుజాతి గాడిదలు కొనుగోలు చేస్తే మంచి లాభాలు వస్తాయని గేలం వేశాడు. 2022, 2023లో విల్లుపురంలో డాంకీ సెమినార్లు పెట్టాడు. ఒక్కో గాడిదకు కనీస ధర 90 వేలు, మేలు రకమైతే లక్షన్నర వరకూ తీసుకుని విక్రయించాడు. గాడిద పాలు గంటకు మించి నిల్వ ఉండవని, సేకరించేందుకు 24 గంటలకు పైగా పడుతుందని చెప్పి హై కెపాసిటీ ఫ్రీజర్లు కొనాలంటూ 75 వేల నుంచి లక్షన్నర వరకూ వసూలు చేశాడు. తిరునల్వేలి నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి పంపించాడు. కొందరు గాడిదలకు గడ్డి పెంచేందుకని ఏకంగా పొలాలు లీజుకు తీసుకున్నారు. అక్కడే షెడ్లు నిర్మించి నెల జీతాలిచ్చి పనోళ్లను నియమించుకున్నారు. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పదుల సంఖ్యలో తమిళనాడు వ్యక్తి వలలో పడ్డారు. మొదట్లో పది, పాతిక మంది ఉన్నప్పుడు పాలను కొనుగోలు చేసి లీటరుకు 1600 నుంచి 1800 చెల్లించాడు. ఏపీతో పాటు తెలంగాణకూ ఈ వ్యాపారం పాకింది. దీంతో ఫ్రాంచైజీలు ఇస్తానంటూ ఒక్కొక్కరి నుంచి ఐదు లక్షల రూపాయల చొప్పున తీసుకున్నాడు. ఇలా రెండు రాష్ట్రాల్లో సుమారు 350 మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ధనికుల పిల్లలు ఫ్రాంచైజీలు తీసుకుని, పాల విక్రయాలు ప్రారంభించారు. ఆ తర్వాతే అసలు కథ ప్రారంభమైంది. పాలను సేకరించిన తమిళనాడు వ్యక్తి తనకు పైనుంచి బిల్లులు రాలేదంటూ వారికి పెండింగ్ పెట్టాడు. పాల నిల్వలు పెరిగి పోవడంతో ఫ్రాంచైజీలు తీసుకున్నవారు ఫోన్లు చేస్తున్నా ఎత్తకుండా ముఖం చాటేశాడు. కొత్త నంబర్‌తో ఫోను చేస్తే 'నేనూ నష్టపోయా.. నాతో అగ్రిమెంటు చేసుకున్న ఫార్మా పరిశ్రమ పాలు కొనట్లేదు' అంటూ బాంబు పేల్చాడు. మోసపోయామని గుర్తించిన ఫ్రాంచైజీ నిర్వాహకులు గాడిదలను మేపలేక, పనోళ్లకు జీతాలు ఇవ్వలేక వాటిని రోడ్డుపైకి వదిలేయడంతో ఎటో వెళ్లిపోయాయి. ఫ్రీజర్లకు కరెంటు బిల్లులు ఎలా చెల్లించాలో దిక్కు తెలియక కొందరు వందల లీటర్ల పాలు పారబోశారు.

సార్... పరువు పోతుంది..

కొందరు బాధితులు పోలీసు ఉన్నతాధికారులకు విషయం చెప్పి కేసు లేకుండా న్యాయం చేయాలంటూ వేడుకొంటున్నారు. విషయం బయటికి తెలిస్తే పరువు పోతుందని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ గాడిదలు మేపడం ఏంటని అడిగితే ఏం చెప్పాలని వాపోతున్నారు. తమిళనాడు వ్యక్తి నుంచి కొంతయినా ఇప్పించాలని కోరుతున్నారు. ఈ కేసు విన్న పోలీసు ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఏపీలో ఇప్పటి వరకూ 46 మంది బాధితులు ముందుకు రాగా, వారికి సుమారు 9 కోట్లు రావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

కొసమెరుపు

తమిళనాడు వ్యక్తికి బాధితులు కొత్త నంబరుతో ఫోన్ చేస్తే.. 'గాడిదలు కొనుక్కోండి.. లక్షలు సంపాదించండి... ఫ్రాంచైజీలు ఇస్తా' అంటూ మళ్లీ పాత కథ చెప్పి డబ్బులు అడుగుతున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అనగానే ఫోన్ కట్ చేస్తున్నాడు.

మున్సిపల్ టీచర్ల పదోన్నతులకు షెడ్యూలు

- నవంబరు 8లోగా ప్రక్రియ పూర్తి

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ టీచర్లకు పదోన్నతులు కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చల్లో ఏకాభిప్రాయం రావడంతో ఆ శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు పదోన్నతుల ప్రక్రియకు సోమవారం షెడ్యూలు విడుదల చేశారు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్, స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు పదోన్నతులు కల్పించనున్నట్లు తెలిపారు.

అభ్యంతరాలకు గడువు పెంచాలి

సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు తెలిపే గడువు 15 రోజులకు పెంచాలని పెంచాలని మున్సిపల్ టీచర్ల సమాఖ్య అధ్యక్షుడు రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించడంపై ఏపీటీఎఫ్-1938 అధ్యక్షుడు జి.హృదయరాజు హర్షం వ్యక్తం చేశారు.

ఆపార్ ఐడీల సమస్యలు పరిష్కరించాలి

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆపార్ ఐడీల తయారీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు. ఐడీల రూపకల్పనకు పాఠశాల రికార్డులను ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. ఇంటిపేరు, పేరు, పుట్టిన తేదీ, చిరునామాల్లో సవరణకు హెచ్‌ఎంల డిక్లరేషన్‌ను ఆప్షన్‌గా తీసుకోవాలన్నారు. చిన్నపాటి పొరపాట్ల సవరణ కోసం హెచ్‌ఎంకు లాగిన్ అవకాశం కల్పించాలన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన రిటైర్డ్ ఐపీఎస్ ఏఆర్ అనురాధ సోమవారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

గ్రహణం వీడిన 'గిరి' అభివృద్ధి

- రాజ్యాంగ బద్ధంగా కేంద్రం ఇవ్వాల్సిన నిధులు 30 కోట్ల నుంచి 154 కోట్లకు పెంపు
- అరకు, పాడేరులో కాఫీ, సాలూరులో జీడిపప్పు, రంపచోడవరంలో రబ్బరు ప్రాసెసింగ్ యూనిట్లు
- జగన్ ప్రభుత్వంలో వచ్చిన 60 కోట్లు ఇతర అవసరాలకు మళ్లింపు... నిధులు నిలిపివేత
- కూటమి సర్కారు రాకతో మారిన ముఖచిత్రం
- గిరిజన ప్రాంతాభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గిరిజనాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చినా చేయడానికి గత వైసీపీ ప్రభుత్వానికి మనస్సు రాలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 275(1) కింద ఇచ్చిన నిధులను ఇతర అవసరాలకు తరలించిన జగన్ ప్రభుత్వం... గిరిజన ప్రాంతాలపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. కూటమి ప్రభుత్వం రాకతో పరిస్థితులు మారుతున్నాయి. రాష్ట్రంలో గిరిజనులకు ఉపయోగపడే ముఖ్యమైన ప్రాజెక్టులకు నిధులిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఇటీవల కేంద్ర గిరిజన సంక్షేమశాఖ ప్రాజెక్టు అప్రైజల్ కమిటీ(పీఏసీ), రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై రూ.154 కోట్ల మేర నిధులు మంజూరుకు అంగీకరించింది. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా కన్నబాబు బాధ్యతలు తీసుకున్న తర్వాత అభివృద్ధి, నిధుల సమీకరణపై దృష్టి సారించారు. నిరంతర సమీక్షలుతో వివిధ పథకాల కింద నిధుల రాక, ప్రస్తుతం వాటి స్థితిగతులు వంటివాటిపై సమాచారాన్ని మదింపు చేశారు. రాజ్యాంగబద్ధంగా కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గిరి ఉత్పత్తులకు గిరాకీ పెరగాలంటే ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటే మంచి మార్గమని చెప్పి కేంద్రంలోని పీఏసీ అధికారులను ఒప్పించగలిగారు. దీంతో రబ్బరు, కాఫీ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు మార్గం సుగమమైంది.

నిధుల మంజూరులో భారీ పెరుగుదల

కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మన రాష్ట్రానికి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రతి ఏటా ఆర్టికల్ 275(1) కింద రూ.30 కోట్లు విడుదల చేసేవారు. ఈ నిధులతో రోడ్లు, వంతెనలు, పాఠశాలల భవనాలతో పాలు పలు మౌలికవసతులు కల్పిస్తారు. గత వైసీపీ హయాంలో కూడా మొదటి రెండేళ్లు ఇదే విధంగా నిధులు విడుదల చేశారు. అయితే ఆ నిధులను ఇతర అవసరాలకు వినియోగించడంతో కేంద్ర ప్రభుత్వం తదుపరి నిధులు విడుదల చేయలేదు. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత అధికారులు పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీంతో ఒకప్పుడు రూ.30 కోట్లకు పరిమితమైన ఆర్టికల్ 275(1) బడ్జెట్‌ను రూ.154 కోట్లకు పెంచి ఇచ్చేందుకు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ అంగీకరించింది.



రబ్బరు, కాఫీ ప్రాసెసింగ్ యూనిట్లు

గిరిజనులకు ఉపయోగకరమైన రబ్బరు, కాఫీ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. కాఫీ యూనిట్‌కు రూ.10 కోట్లు, రబ్బరు ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.5 కోట్లు ఖర్చు చేయనున్నారు. అరకు, పాడేరు ప్రాంతాల్లో నాణ్యమైన కాఫీ, అరుదైన రంపచోడవరంలో రబ్బరు పంటను పండిస్తున్నారు. ప్రాసెసింగ్ యూనిట్లు లేకపోవడంతో గిరి రైతు అయినకాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి. మంజూరైన ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులోకి వస్తే గిట్టుబాటు ధర లభించే అవకాశాలు మెండుగా ఉంటాయన్నది అధికారుల ఉవాచ.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం...

వైసీపీ హయాంలో పూర్తిగా వెనుకపట్టు పట్టిన గిరిజన ప్రాంతాల అభివృద్ధి ప్రక్రియను మళ్లీ పరుగులు తీయించే దిశగా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. పలు చోట్ల తారురోడ్లు, టూరిజం కాటేజ్ అభివృద్ధి, వంతెనల నిర్మాణాలు, కాజ్‌వేలు, సిమెంట్‌రోడ్లు, రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో యూపీఎస్‌లను ఏర్పాటు చేయనున్నారు. సాలూరులో జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు, వేపకుంటలో ఏపీ స్టడీ సర్కిల్ వద్ద మౌలిక వసతులు, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల నిర్మాణం, ఐటీడీఏ కార్యాలయాల వద్ద అదనపు వసతులు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ మేరకు పనులను 2025, మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలని భావిస్తున్నారు.

ఏఎంయూ ఏర్పాటుకపాదనలు

గిరిజన పాఠశాలలను మానిటర్ చేసేందుకు అకడమిక్ మానిటరింగ్ యూనిట్(ఏఎంయూ)ను ఏర్పాటుకు ఒక ప్రతిపాదనను గిరిజన సంక్షేమ శాఖ సిద్ధం చేసింది. ఆ ప్రతిపాదనకు పీఏసీ పచ్చజెండా ఊపితే గిరిజన ప్రాంతాల్లోని గురుకుల, ఆశ్రమ పాఠశాల స్థితిగతులను మార్చివేయవచ్చు.

జగన్.. సర్దుపోటుకు కారకుడివి నువ్వే

- చార్జీల పెంపుపై మాట్లాడే అర్హత నీకు లేదు
- తప్పులన్నీ చేసి కూటమిపై విమర్శలా?
- వాస్తవాలను అంగీకరించకుంటే ఈఆర్‌సీలో వేసిన అంగీకార పత్రాలను ప్రజల ముందు ఉంచుతాం: మంత్రి గొట్టిపాటి

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 'విద్యుత్ చార్జీల పెంపుపై మాట్లాడే కనీస అర్హత జగన్‌కు లేదు. తప్పులన్నీ వైసీపీ ప్రభుత్వంలో చేసి, కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం ఏంటి? ఇంధన సర్దుపోటుకు జగన్మోహన్‌రెడ్డే బాధ్యత వహించాలి' అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. 'చార్జీలు పెంచమంటూనే రూ.6,072 కోట్ల భారం వేశారు' అంటూ చంద్రబాబుపై ఎక్స్ వేదికగా జగన్ చేసిన విమర్శపై ఆయన ఓ ప్రకటనలో స్పందించారు. 'డిస్కమ్‌ల ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనలను 2022 జూన్‌లోనే సీఎం హోదాలో మీరు ఆమోదించలేదా? సార్వత్రిక ఎన్నికల ముందే... ఫిబ్రవరి, 2024లో ఇంధన సర్దుబాటుగా రూ.11,826 కోట్ల వసూలుకు డిస్కమ్‌లకు అనుమతి ఇచ్చింది మీరు కాదా? ముఖ్యమంత్రి హోదాలో మీరు అనుమతి ఇచ్చాకే అధికారులు విద్యుత్ నియంత్రణ మండలిలో ఇంధన చార్జీల సర్దుబాటుకు పిటిషన్ వేసినట్లు ప్రజల ముందు ఆధారాలు ఉంచుతాం. అంతా చేసి, ఇంధన సర్దుబాటు భారాన్ని కూటమి ప్రభుత్వమే భరించాలంటూ ప్రకటనలు చేస్తావా? ఏపీ జెన్కో ప్రాజెక్టులు పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి చేయకుండా ఆపేసి, బహిరంగ మార్కెట్లో భారీ ధరలకు కరెంటు కొనలేదా? ఆత్మపరిశీలన చేసుకోకుండా చార్జీలు పెంచారంటూ సిగ్గులేకుండా గగ్గోలు పెడుతూ ఎక్స్ వేదికగా విమర్శ చేస్తావా? ఇప్పటికైనా ఈ సర్దుపోటుకు నేనే కారకుడినంటూ ప్రజల ముందు అంగీకరించాలి. లేదంటే తేదీల వారీగా ఈఆర్‌సీలో వేసిన అఫిడవిట్‌లను రాష్ట్ర ప్రజల ముందు ఉంచుతాం' అని మంత్రి గొట్టిపాటి హెచ్చరించారు.

అవసరమున్న ప్రతి రైతుకూ బిందుసేద్యం

- పత్తి కొనుగోలుకు సీసీఐ కేంద్రాలు: మంత్రి అచ్చెన్న

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అవసరం ఉన్న ప్రతి రైతుకూ బిందు సేద్యాన్ని అమలు చేస్తామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. సోమవారం సచివాలయంలో ఉద్యాన, మార్కెటింగ్ శాఖలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'బిందు సేద్య కంపెనీలకు వైసీపీ ప్రభుత్వం రూ.1,167 కోట్లు బకాయిలు పెట్టి, పథకాన్ని నీరుగార్చింది. నాబార్డు అందించే బిందుసేద్య నిధిని కేటాయించాలని కేంద్రాన్ని కోరతాం. మామిడి, జీడిపప్పు పంటలకు ప్రత్యేక బోర్డులు, ఆయిల్ పామ్‌కు నూతన మండలాల కేటాయింపు, కోకోనట్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తాం. కర్నూలు యార్డులో ఉల్లి ఉత్పత్తిని వాహనాలతో తరలించడానికి, ఈ-నామ్‌లో సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి. పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేసేలా సీసీఐ కేంద్రాలను ప్రారంభించాం' అని మంత్రి అన్నారు.

అత్యాచార నిందితులకు బెయిల్ ఇప్పించొద్దు

- న్యాయవాదులకు మంత్రి సంధ్యారాణి అభ్యర్థన

విజయనగరం, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): చిన్నారులపై కొంత మంది మృగాళ్లు అత్యాచారానికి పాల్పడటం దారుణమని, అలాంటి వాళ్లకు న్యాయవాదులు బెయిల్ ఇప్పించొద్దని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. ఈ విషయంలో వారికి చేతులెత్తి మొక్కుతున్నానని అన్నారు. అత్యాచారానికి గురైన మూడేళ్ల చిన్నారిని విజయనగరం ఘోషా ఆస్పత్రిలో సోమవారం మంత్రి పరామర్శించారు. బాలిక తల్లిదండ్రులను ఓదార్చారు. బాధితురాలికి అందుతున్న చికిత్సపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గతంలో 6 నెలల వయసున్న ఒక చిన్నారిపై వరుసకు తాత అయ్యే వక్తి అఘాయిత్యానికి ఒడిగట్టాడని, ఇప్పుడు మూడేళ్ల చిన్నారిపై 27 ఏళ్ల యువకుడు ఆత్యాచారం చేశాడన్నారు. అంగన్వాడీ సెంటర్లలో గుడ్‌టచ్-బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి సంధ్యారాణి చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, ఆధారాలు సేకరిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు.

'సర్వే రాళ్ల'లో స్వాహాపర్వం

(మొదటి పేజీ తరువాయి)

సర్వే జరిపి వేసే రాళ్ల కొను...గోలుమాల్‌పై తెరవెనక వెంకటరెడ్డి, మరో ముగ్గురు అధికారుల కేంద్రంగా సాగిన దందాపై అవినీతి నిరోధకశాఖ సోమవారం విచారణ మొదలుపెట్టింది. తాటిగడప లోని ఖనిజాభివృద్ధి సంస్థ (ఎండీసీ) కార్యాలయంలో ఏసీబీ విచారణ చేసింది. కీలకమైన ఫైళ్లను దగ్గరపెట్టుకొని, సర్వేరాళ్ల కొనుగోలు తీరుపై ఆరాతీసింది. ఏసీబీ డీఎస్పీలు ప్రతాప్, రామచంద్రల నేతృత్వంలో ఆరుగురు సీఐలు, ఇతర అధికారుల బృందం ఎండీసీ ఆఫీసును పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకొన్నట్లు తెలిసింది. కొత్త వ్యక్తులను ఆఫీసులోకి రానివ్వకుండా ద్వారాలు మూసి ఇన్‌కెమెరా తరహాలో విచారణ చేసినట్లు తెలిసింది. సర్వేరాళ్ల టెండర్ కమిటీని సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ కమిటీలో ముగ్గురు అధికారులున్నారు. దీంతోపాటు ఈ ఫైలులో పలు అంశాలను లేవనెత్తిన వారు, ఫైలుతో సంబంధం ఉన్న అధికారులను ఒక్కొక్కరిని పిలిచి ప్రశ్నించినట్లు తెలిసింది. ఏసీబీ అధికారులు ముందుగా కొన్ని ప్రశ్నలను సిద్ధం చేసుకుని, వాటి ఆధారంగా అధికారులను ప్రశ్నించారు. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం ప్రకారం, ధన్వంతరీ అనే కంపెనీకి టెండరు ఎలా ఇచ్చారు? ఏ రూల్ ప్రకారం ఆ కంపెనీకి టెండరు అర్హత లభించింది? ఆ కంపెనీని ఎవరు తీసుకొచ్చారు? అది ఏ అధికారి బంధువు కంపెనీ? సురేశ్ అనే వ్యక్తి గనుల శాఖలో ఎవరికి సన్నిహిత బంధువు?" అంటూ ఏసీబీ ప్రశ్నించినట్లు తెలిసింది. ధన్వంతరీ కంపెనీకి టెండర్‌లో పాల్గొనే అర్హత వచ్చేలా నిబంధనలు మార్చిందెవరు? నిబంధనలు మార్చాలని సిఫారసు చేసిందెవరు? అని ప్రశ్నించినట్లు సమాచారం. వైద్య పరికరాలు అమ్ముకునే ధన్వంతరీ అసోసియేట్స్‌కు సర్వే రాళ్లతో ఏం పని? ఈ రంగంలో ఆ సంస్థకు అనుభవం లేకున్నా టెండర్ ఎలా ఇచ్చారు? గ్రానైట్ ఫ్యాక్టరీ, గనుల లీజులు లేని మరో అనామక సంస్థకు వందల కోట్ల విలువైన టెండర్ ఇవ్వాలని ఎలా నిర్ణయించారు? ఆ కంపెనీని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎవరు ప్రమోట్ చేశారు?" అని ఓ కీలక అధికారిని ఏసీబీ బృందం ప్రశ్నించింది. సర్వేరాళ్ల ఎంగ్రేవింగ్ (గ్రానైట్ రాయిపై పేరు, చిత్రాలు చెక్కడం), పాలిషింగ్ కోసం చైనా కంపెనీ మిషన్లు కొనమని చెప్పింది ఎవరు? ఆ మిషన్లను వాడాలని సిఫారసు చేసిందెవరు? ధన్వంతరీతో కాంట్రాక్ట్ రద్దుకాకుండా ఆ కంపెనీకి బ్యాంక్ గ్యారంటీ (బీజీ)లు విడుదల చేయించింది ఎవరు? కాంట్రాక్టు అగ్రిమెంటు రద్దుకాకుండా, ప్రభుత్వం నిర్ణయం తీసుకోకుండానే బీజీలు ఇవ్వమని ఒత్తిడి చేసిందెవరు? బీజీలు ఇవ్వకూడదని ఫైలుపై అనేక మంది పేర్కొన్నా....ఇవ్వాల్సిందే అని నిర్ణయం తీసుకోవడం వెనక ఎవరి ప్రయోజనాలు, ఒత్తిళ్లు ఉన్నాయి? అని మరో కీలక అధికారిని ప్రశ్నించినట్లు తెలిసింది.

అసలేం జరిగిందంటే....

జగన్ ప్రభుత్వం 2019లో భూముల సర్వేచేపట్టింది. తమకు 3.50 కోట్ల రాళ్లు కావాలని గనుల శాఖను సర్వేశాఖ కోరింది. గనుల శాఖ టెండర్లు పిలిచి గ్రానైట్ రాళ్ల సరఫరా ఏజెన్సీని ఎంపిక చేయాలి. ఆశాఖ పాత్ర అంతవరకే. కానీ నాటి గనుల అధికారి వెంకటరెడ్డి మూడు అడుగులు ముందుకేశారు. ఒక్కో గ్రానైట్ రాయికి 475 రూపాయల ధర నిర్ణయించినా ఏ ఒక్క కంపెనీ బిడ్ దాఖలు చేయలేదు. రెండుసార్లు టెండర్లు పిలిచినా కంపెనీలు ఆసక్తి చూపలేదు. ఇందుకు కారణం ఆ ధర తమకు గిట్టుబాటు కాదని, కానీ, ఓ ప్రైవేటు సంస్థ 475 రూపాయల ధరకే రాయిని సరఫరా చేసేందుకు ముందుకొచ్చింది. ఆ కంపెనీకే టెండర్ కట్టబెట్టారు. అయితే, ఆ కంపెనీకి గ్రానైట్ ఫ్యాక్టరీ లేదు. గనుల లీజులు లేవు. అయితే, అది ఓ అధికారి బంధువుది కావడంతో ఒకే చేశారు. కొనుగోలు చేసిన రాళ్లను పాలిష్‌చేసి దానిపై జగన్ పేరు రాయడానికి పలు చోట్ల ఎంగ్రేవింగ్, పాలిషింగ్ యూనిట్లు పెట్టాలనుకున్నారు. ఇందుకోసం చైనా మిషన్లు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. వైద్య పరికరాలు అమ్ముకునే ధన్వంతరీ అనే సంస్థకు టెండర్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ టెండర్ విలువ 520 కోట్లు. ఇది ఓ గనుల ఉన్నతాధికారి బినామీ కంపెనీ అని, ఎలాంటి అర్హతలు లేకున్నా టెండర్ ఇచ్చారని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. తొలుత 140 కోట్లతో 25 యంత్రాలు కొనాలని ప్లాన్‌వేశారు. నిబంధనల ప్రకారం 100 కోట్లు విలువచేసే ఏ టెండర్ అయినా న్యాయసమీక్షకు పంపాలి. కానీ ఈ పనిచేయలేదు. పైగా, ధన్వంతరీకే 100 కోట్ల రూపాయల అడ్వాన్స్ ఇవ్వాలనుకున్నారు. ఈమేరకు ఒప్పందం చేసుకున్నారు. వెంటనే అడ్వాన్స్ సొమ్ము విడుదల చేయాలని గనుల శాఖ నాటి డైరెక్టర్ వెంకటరెడ్డి...ఆర్థికశాఖ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' గత ఏడాది నవంబరు, డిసెంబరు మాసాల్లో వరుస వార్తలను ప్రచురించింది. ఈ పరిణామాలపై నాటి మంత్రి పెద్దిరెడ్డి విజిలెన్స్ విచారణ చేయాలని ఆదేశించారు. దీన్ని నాటి గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి అడ్డుకున్నారు పంచాయితీ జగన్ వద్దకు చేరగా, ఆయన వెంకటరెడ్డిని సమర్థించారు. కానీ, అప్పటికే లోకాయుక్త, విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఇప్పుడు ఏసీబీ అధికారులు ఇదే అంశంపై విచారణ జరుపుతున్నారు.

బ్యాంక్ గ్యారంటీల ఫైల్ ముందుపెట్టి..

సర్వేరాళ్ల కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని విజిలెన్స్ కమిషన్, లోకాయుక్తలకు ఫిర్యాదులు వెళ్లాయి. ఆ సంస్థల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు.. నాడు మీరేం చేశారని ఓ ఉన్నతాధికారిని ఏసీబీ ఆరాతీసినట్లు తెలిసింది. సర్వేరాళ్ల కొనుగోళ్లపై గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డికి, నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి నడుమ విబేధాలు ఎందుకు వచ్చాయి? అని ఏసీబీ బృందం నలుగురు గనుల శాఖ కీలక అధికారులను ప్రశ్నించింది. సర్వేరాళ్ల కొనుగోలు, ఓఅండ్ఎమ్ కాంట్రాక్టుల్లో జరిగిన గోల్‌మాల్‌పై మొత్తం ఏడుగురిని ప్రశ్నించారు. ఇందులో టెండర్ కమిటీలో కీలకంగా ఉన్న ముగ్గురు అధికారులున్నారు. మధ్యలో ఓ అధికారి ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందని ఏసీబీ టీమ్....బ్యాంక్ గ్యారంటీలకు సంబంధించిన ఫైలును తెప్పించి సంబంధిత అధికారి ముందు పెట్టినట్లు తెలిసింది. ఆ ఫైల్‌లో రాసిన దానికి, ఆ అధికారి చెప్పినదానికి తేడా ఉండటంతో ఫైలులోని అంశాల ఆధారంగా ప్రశ్నించినట్లు సమాచారం.

ప్రగతిపథంలో ఏపీ.. బలోపేతం దిశగా బీజేపీ: పురందేశ్వరి


విజయవాడలో జరిగిన బీజేపీ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 'కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి పుష్కలంగా నిధులు వస్తున్నాయి. రాష్ట్రాభివృద్ధితో పాటు ఏపీలో బీజేపీ బలపడుతోంది' అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. విజయవాడలో రాష్ట్ర బీజేపీ సంస్థాగత కార్యశాల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.12,500 కోట్లు, డయా ఫ్రమ్ వాల్ కోసం రూ.900 కోట్లు, ఇతర పన్నుల్లో వాటా రూ.7,800 కోట్లు ఇచ్చిన కేంద్రం... మరిన్ని ఇచ్చి ఏపీని ప్రగతిపథంలో తీసుకెళుతోంది. అమరావతి నుంచి ఉత్తరాది రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలకు రైల్ కనెక్టివిటీని పెంచుతోంది. రాష్ట్రంలోని బీజేపీ కార్యకర్తల కృషితో పార్టీ సభ్యత్వం 40 రోజుల్లోనే 25 లక్షలకు చేరింది' అని పురందేశ్వరి అన్నారు. ఏపీ బీజేపీలో ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా పాకా సత్యనారాయణను నియమిస్తూ సమావేశం తీర్మానించింది. కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్ యాదవ్, పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.


ఆర్థిక శాఖ సమీక్షలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఎమ్మార్పీ ఉల్లంఘనకు 5 లక్షల జరిమానా

మద్యం వ్యాపారంపై సీఎం ఆదేశాలు

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 'ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయిస్తే రూ.5 లక్షలు జరిమానా విధించాలి. రెండోసారి ఉల్లంఘనకు పాల్పడితే లైసెన్స్ రద్దు చేయాలి' అని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో మద్యం, ఇసుకపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. 'బెల్టు షాపులు ఎక్కడా ఉండకూడదు. బెల్టులకు మద్యం సరఫరా చేసే లైసెన్సీలకు మొదటిసారి రూ.5 లక్షలు జరిమానా విధించాలి. రెండోసారి పట్టుబడితే లైసెన్స్ రద్దు చేయాలి. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై కఠినంగా వ్యవహరించాలి. ప్రతి మద్యం షాపులో సీసీ కెమేరాలు ఉండాలి. ఫిర్యాదుల కోసం ఒక టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేయాలి. షాపులో ధరల పట్టిక ప్రదర్శించాలి. అలాగే ఇసుక పొరుగు రాష్ట్రాలకు ఒక్క లారీ ఇసుక వెళ్లకూడదు. ఇసుకలో ఎక్కడైనా అక్రమాలు జరిగితే సంబంధిత అధికారులే తొలి బాధ్యులు అవుతారు' అని అన్నారు.

స్వర్ణాంధ్ర సాకారానికి అదానీ

- సీఎం చంద్రబాబుతో ప్రతినిధి బృందం భేటీ
- వివిధ రంగాల్లో ప్రాజెక్టులకు ప్రతిపాదనలు

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు.. బెజవాడలో భవానీ ఐలాండ్, కనకదుర్గ గుడి, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్లను అనుసంధానం చేస్తూ రోప్‌వే.. విశాఖలో 100 ఎంఎల్‌డీ డీశాలినేషన్ ప్లాంట్... రాష్ట్రంలో ఓడరేవుల అభివృద్ధి.. పోర్ట్ బేస్డ్ ఇండస్ట్రీస్.. బీచ్ శాండ్ మైనింగ్... రెనూవబుల్ ఎనర్జీ రంగాలతోపాటు డిజిటల్ రంగంలో డేటాసెంటర్స్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఏఐ టెక్నాలజీతో ఫిల్మ్ మేకింగ్ వంటి భారీ ప్రాజెక్టులను రాష్ట్రంలో చేపట్టేందుకు అదానీ గ్రూప్ ముందుకు వచ్చింది. ఐదు నుంచి పదేళ్లలో లక్షలాది ఉద్యోగావకాశాలు సృష్టించేందుకు తోడ్పడే సమగ్ర రోడ్ మ్యాప్‌తో అదానీ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ ఎండీ రాజేష్ అదానీ, అదానీ సిమెంట్ అండ్ పోర్ట్స్, సెజ్ లిమిటెడ్ ఎండీ అదానీ కిరణ్ నేతృత్వంలోని అదానీ గ్రూప్ ప్రతినిధి బృందం సోమవారం సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యింది. రాజధాని అమరావతితోపాటు రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి బలమైన పునాదులు వేసే సామర్థ్యంతో కూడిన కీలక రంగాల్లో భారీస్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఇప్పటికే గుర్తించిన కీలక రంగాల్లో ప్రాజెక్టులను చేపట్టి.. స్వర్ణాంధ్ర విజన్‌ను సాకారం చేయడంలో తమ వంతుపాత్ర పోషిస్తామంటూ ముందుకు వచ్చారు. అదానీ పోర్ట్ సీఈవో ప్రణవ్‌చౌదరి, అదానీ థర్మల్ బిజినెస్ సీఈవో ఎస్.బి.ఖ్యాలియా, అదానీ బీచ్ శాండ్ బిజినెస్ సీఈవో రాజేంద్రసింగ్, అదానీ పవర్ టీడీ హెడ్ రాజ్‌కుమార్ జైన్, అదానీ గ్రూప్ ఛైర్మన్ అడ్వయిజర్ సుదీప్త భట్టాచార్య, ఏపీ, తెలంగాణ కార్పొరేట్ ఎఫైర్స్ హెడ్ పి.అంజిరెడ్డి.. ప్రతినిధి బృందంలో ఉన్నారు.

నందిగం ప్రోద్బలంతోనే రాళ్ల దాడి!

- రాజకీయ పెద్దలు, పోలీసు అధికారులు దర్యాప్తును తప్పుదోవ పట్టించారు
- విచారణ కీలక దశలో ఉంది బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయండి
- మరియమ్మ హత్య కేసులో హైకోర్టుకు పీపీ వినతి
- సురేశ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ ప్రోద్బలంతోనే వెలగపూడి గ్రామంలో రెండు వర్గాల మధ్య రాళ్ల దాడి జరిగిందని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఘటనకు ముందు ఓ వర్గంవారితో సమావేశం నిర్వహించి దాడికి ప్రణాళిక రచించారని.. మద్యం, డబ్బు సమకూర్చారని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సురేశ్ ఓ వర్గం వారిని రెచ్చగొట్టి మరో వర్గం వారిపై దాడి చేయించారని సాక్షులు కూడా వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. 'మృతురాలు మరియమ్మ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదులో సురేశ్ పేరు ఉంది. మహిళ హత్యకు సంబంధించి తనపై కేసు ఉందని ఆయన కూడా ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత కేసులో ఇరికించారన్న వాదనలో వాస్తవం లేదు. ఘటనలో సురేశ్ పాత్ర గురించి మృతురాలి కుమారుడు తన ఫిర్యాదులో సవివరంగా పేర్కొన్నా.. అప్పటి దర్యాప్తు అధికారి ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరు చేర్చలేదు. అప్పటి రాజకీయ పెద్దలు, పోలీసు ఉన్నతాధికారులు కేసు దర్యాప్తును తప్పుదోవ పట్టించారు. కేసు దర్యాప్తును ట్యాంపర్ చేయడంతో పాటు సాక్షులను ప్రభావితం చేసేందుకు పిటిషనర్ ప్రయత్నించారని దిగువ కోర్టు సైతం గుర్తించింది. దర్యాప్తు ముగిసిందని అప్పటి దర్యాప్తు అధికారి చెప్పిన వివరాల ఆధారంగా ట్రయల్ కోర్టు నిందితులకు బెయిల్ మంజూరు చేసింది. కేసులో ఇప్పటివరకు చార్జిషీటు దాఖలు చేయలేదు. కేసు దర్యాప్తునకు సురేశ్ సహకరించడం లేదు. దర్యాప్తు కీలక దశలో ఉంది. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే కేసు విచారణకు ఆటంకం కలిగించే ప్రమాదం ఉంది. అందుచేత ఆయన బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయండి' అని కోరారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. రెండు వర్గాల మధ్య జరిగిన రాళ్ల ఘటనలో సురేశ్‌ను ఉద్దేశపూర్వకంగా ఇరికిస్తున్నారన్నారు. ఒక ఎఫ్ఐఆర్ ప్రతిలో పిటిషనర్ పేరు ఉందని, మరో ప్రతిలో లేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. ఒకే నేరానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ ప్రతుల్లో ఒకదానిలో పేరు ఉండి, మరోదానిలో లేకపోవడంపై వివరణ ఇవ్వాలని ప్రాసిక్యూషన్‌ను ఆదేశించింది. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెలగపూడికి చెందిన మరియమ్మ 2020 డిసెంబరు 27న హత్యకు గురయ్యారు. ఆమె కుమారుడి ఫిర్యాదుతో తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. నందిగం సురేశ్‌ను 78వ నిందితుడిగా చేర్చారు. ఇటీవల ఆయన్ను ఈ కేసులో అరెస్టు చేశారు. బెయిల్ పిటిషన్‌ను గుంటూరు ప్రత్యేక కోర్టు కొట్టివేయడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం సోమవారం మరోసారి విచారణకు రాగా.. పొన్నవోలు వాదనలు వినిపించారు.

హే రఘురాం!



(మొదటి పేజీ తరువాయి)

కంపెనీకి జగన్ యజమాని అయ్యారు. నాడు తనయుడి కోసం వైఎస్ అడ్డదారులు తొక్కగా, జగన్ క్విడ్ ప్రోకోకు పాల్పడి పెట్టుబడులు పెట్టించుకున్నారు. కడప జిల్లాలోనే దాల్మియా సిమెంట్స్‌కు వెయ్యి ఎకరాల సున్నపురాయి గనులు లీజుకిచ్చి ప్రతిఫలం పొందారు. భారతి సిమెంట్స్‌లో దాల్మియా 50 కోట్ల పెట్టుబడి పెట్టింది. ఇలా స్వల్ప వ్యవధిలోనే జగన్ వేల కోట్లు సంపాదించారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నాడు జగన్ అక్రమాస్తుల కేసులో దాఖలు చేసిన చార్జిషీటులో పేర్కొన్న అంశాలివీ. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడే 2008లో రఘురాం సిమెంట్స్ పేరును భారతి సిమెంట్స్‌గా మార్చేశారు.

45 కోట్ల నుంచి 6,500 కోట్లకు

రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు జగన్ అక్రమాస్తులను భారీగా సంపాదించారు. జగన్ కంపెనీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు క్యూ కట్టేవారు. మార్కెట్లో జగన్ కంపెనీ షేర్లు అమాంతం పెరిగేవి. పెట్టుబడిదారులు ఉదారంగా అత్యధిక మొత్తంతో వాటాలు కొనేవారు. అంతా క్విడ్ ప్రోకో వ్యవహారం అన్నమాట. రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో 'మేళ్లు' పొందినవారు జగన్‌కు లబ్ధి చేకూర్చడానికి ఆయన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేవారు. రఘురాం సిమెంట్స్ వ్యవహారం కూడా ఇలాంటిదే. రఘురాం సిమెంట్స్‌ను 1999లో స్థాపించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 2006లో ఈ కంపెనీ జగన్ చేతికి వచ్చింది. ఈ కంపెనీలో జగన్ అండ్ కో పెట్టిన పెట్టుబడి రూ.45 కోట్లే. అయితే రెండేళ్లలోనే కంపెనీలో వాటాల విలువ ఏకంగా రూ.6,500 కోట్లకు చేరింది. కంపెనీలో ఒక్కొక్కటి రూ.10 ముఖ విలువ కలిగిన ఐదున్నర కోట్ల షేర్లు ఉండగా... ఇందులో 82 శాతం వాటాకు జగన్ అండ్ కో కేవలం రూ.45 కోట్లు సమకూర్చగా... మిగిలిన 18 శాతం వాటాకు దిగ్గజ పారిశ్రామికవేత్తలు పెట్టిన పెట్టుబడి మొత్తం రూ.129 కోట్లు. దాల్మియా సిమెంట్స్, మ్యాట్రిక్స్ నిమ్మగడ్డ ప్రసాద్‌కు చెందిన జీ2 కార్పొరేట్ సర్వీసెస్ దాదాపు రూ.112 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. నిమ్మగడ్డ ప్రసాద్ వ్యక్తిగత హోదాలో మరో రూ.8 కోట్లు పెట్టారు. దాల్మియా సిమెంట్స్ 2007 మార్చి 29వ తేదీన 16.66 లక్షల షేర్లను ఒక్కోదాన్ని రూ.110 ముఖ విలువకు కొనుగోలు చేసింది. ఆ తర్వాత మరోసారి 2008 ఫిబ్రవరి 26న దాల్మియా 1,37,931 షేర్లను ఒక్కోదాన్ని రూ.1440 చొప్పున కొనుగోలు చేసింది. ఏడాదిలోనే షేర్ విలువ ఏకంగా 13 రెట్లు పెరిగిపోవడం గమనార్హం. ఒకవైపు రఘురాం సిమెంట్స్‌లో అధిక ధరలకు షేర్లు కొంటూనే... అదే సమయంలో కడప జిల్లాలోనే జగన్ కంపెనీకి సమీపంలో దాల్మియా కూడా సిమెంట్ కంపెనీని స్థాపించింది. ఇదే గమ్మత్తైన విషయం. దీని వెనుక క్విడ్ ప్రోకో జరిగిందన్నది ఆరోపణ. 2007 ఏప్రిల్ 9వ తేదీన జీ2 కార్పొరేట్ సంస్థకు రూ.94 చొప్పున 64.42 లక్షల షేర్లను జగన్ కేటాయించారు. 2007సెప్టెంబరులో ఇండియా సిమెంట్స్ రూ.110 చొప్పున 12.5 లక్షల షేర్లను కొనుగోలు చేసింది. మరో రెండు నెలలకు నిమ్మగడ్డ ప్రసాద్ రూ.175 చొప్పున 4.59 లక్షల షేర్లను కొన్నారు. ఇలా భారీ ధరలకు షేర్లు కొనుగోలు చేయడంతో కంపెనీ విలువ, జగన్ వాటా అమాంతం పెరిగిపోయాయి. రఘురాం/భారతి సిమెంట్స్ ప్రధాన ప్రమోటర్ జగన్, ఆయన బంధువుల (నికర పెట్టుబడి రూ.45 కోట్లు) విలువ 2008నాటికి ఏకంగా రూ.6,500 కోట్లకు చేరింది.

2000 ఎకరాల్లో సున్నపురాయి నిక్షేపాలు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ముడిసరుకు కోసం నిక్షేపాలను కేటాయించాలంటే గనుల శాఖ గింగిరాలు తిప్పుతుంది. కానీ నాడు రఘురాం సిమెంట్స్‌కు గనుల శాఖ రెడ్‌కార్పెట్ పరచిమరీ కడప జిల్లాలో 2000 ఎకరాల సున్నపురాయి నిక్షేపాలను కట్టబెట్టింది. కడప జిల్లా నవాబుపేట, తాలమంచిపట్నం గ్రామాల్లోని 1017 ఎకరాల సున్నపురాయి నిక్షేపాల ప్రాస్పెక్టింగ్ లీజు కోసం 1997లో జయా మినరల్స్ గనుల శాఖకు దరఖాస్తు చేసుకుంది. దీన్ని పరిశీలించిన గనుల శాఖ జేడీ మేనకేతనరెడ్డి జయా మినరల్స్‌కు సిమెంట్ ఫ్యాక్టరీని స్థాపించేంత ఆర్థిక స్థోమత లేదని భావించారు. దరఖాస్తుదారుడి నుంచి వివరణ కోరుతూ పలుమార్లు లేఖలు రాసినా... ఆ కంపెనీ స్పందించలేదు. దీంతో ఈ ఫైలును గనుల శాఖ తిరస్కరించింది. అయితే 2004లో ముఖ్యమంత్రిగా రాజశేఖర రెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఈ ఫైలుకు రెక్కలు వచ్చాయి. కంపెనీ ఆర్థిక స్థోమతను వివరిస్తూ సమాచారం ఇవ్వాలంటూ జయా మినరల్స్‌కు గనుల శాఖ లేఖ రాసింది. చాలా ఏళ్లుగా స్పందించని జయా మినరల్స్ ఈ లేఖకు వెంటనే స్పందించింది. ఈ కంపెనీకి ప్రాస్పెక్టింగ్ లీజు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ గనుల శాఖ డైరెక్టర్ రాజగోపాల్ ఫైలు పంపారు. ఈ సంస్థకు ప్రాస్పెక్టింగ్ లీజు ఇవ్వాలంటే కచ్చితంగా ఈశ్వర్ సిమెంట్స్‌కు లీజు భూములు బదిలీ చేయాలంటూ రాజగోపాల్ షరతు విధించారు. అలా కుదరదని గనుల శాఖ సంయుక్త కార్యదర్శి దయాకరరెడ్డి ఫైలులో రాశారు. అయినా ఈశ్వర్ సిమెంట్స్‌కు ప్రాస్పెక్టింగ్ లీజు ఇవ్వాలని ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి రాజగోపాల్ నోట్‌ఫైల్‌ను పంపారు. ఈ నోట్ ఫైల్‌కు గనులశాఖ కార్యదర్శి శ్రీలక్ష్మి ఆమోద ముద్ర వేశారు. గనుల శాఖ మంత్రి కూడా ఓకే చేశారు. 2006 జూలై 14న 183 జీవో నంబరుతో తొలుత జయా మినరల్స్‌కు.. తర్వాత 236 జీవో నంబరుతో ఈశ్వర్ సిమెంట్స్‌కు గనులు కేటాయిస్తూ ఉత్తర్వు జారీ చేశారు. లీజు పొందనున్న ప్రాంత సమీపంలోనే ఈశ్వర్ సిమెంట్స్ కంపెనీ స్థాపించనుందని రాజగోపాల్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనల మేరకు 2008 జనవరిలో 30 ఏళ్లకు మైనింగ్ లీజు మంజూరు చేస్తూ 10వ నంబరు జీవో జారీ చేశారు. అసలు విషయం ఏంటంటే.. ఈ ప్రతిపాదలు పంపే నాటికి ఈశ్వర్ సిమెంట్స్ ఏర్పాటు కాలేదు. తర్వాత గనుల శాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి మరో ప్రతిపాదన పంపుతూ ఈశ్వర్ సిమెంట్స్‌కు కేటాయించిన మైనింగ్ లీజును దాల్మియా సిమెంట్ (భరత్ లిమిటెడ్)కు బదిలీ చేయాలని సిఫారసు చేశారు. ఈశ్వర్ సిమెంట్స్ దాల్మియా సిమెంట్స్‌కు 100 శాతం అనుబంధ సంస్థగా ఉందని గనుల శాఖ ఈ లేఖలో పేర్కొంది. వీటి ఆధారంగా 2008లో జీవో నంబర్ 321 జారీ చేశారు.

ఏ1 జగన్.. ఏ2 విజయసాయి

రఘురాం/భారతి సిమెంట్స్ కేసులో సీబీఐ ఏ1గా జగన్‌ను, ఏ2గా విజయసాయి రెడ్డిని చేర్చింది. ఇదే కేసులో నాటి గనుల శాఖ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, జగన్ సన్నిహితుడు జేజే రెడ్డి, పరిశ్రమల శాఖ మాజీ కార్యదర్శి కృపానందం తదితరులు నిందితులుగా ఉన్నారు. కుట్రలో జగన్, విజయసాయి రెడ్డి కీలకంగా వ్యవహరించినట్టు సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొంది.

విజయలక్ష్మే ఈ సమస్యను పరిష్కరించాలి



- వైఎస్ మరణంలో బాబు పాత్ర ఉందనడం సిగ్గుచేటు: బాలినేని

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఆడపడుచుతో కన్నీరు పెట్టిస్తే ఇంటికి అరిష్టమని మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి మాజీ సీఎం జగన్‌నుద్దేశించి అన్నారు. ఆయన సోమవారం మాదాపూర్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఆస్తుల వివాదం నాలుగేళ్ల నుంచి జరుగుతోందని.. రాజశేఖర్‌రెడ్డి బతికున్నప్పుడు సంపాదించిన ఆస్తులనే షర్మిల అడుగుతోందని చెప్పారు. వైఎస్ కుటుంబం గురించి మాట్లాడే అర్హత లేని వ్యక్తులు (వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి) ఈ విషయంలో బహిరంగంగా మాట్లాడడం బాధ కలిగిస్తోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించగలిగింది విజయలక్ష్మి మాత్రమేనని.. ఆమె త్వరితగతిన పరిష్కరించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తమ కుటుంబాన్ని చీలుస్తున్నారని జగన్ మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. రాజశేఖర్‌రెడ్డిని చంపిన కుట్రలో చంద్రబాబు పాత్ర ఉందనడం సిగ్గుచేటని స్పష్టం చేశారు. ఆయన మరణంలో కుట్ర ఉంటే గత ఐదేళ్లలో ఎందుకు విచారణ చేయించలేదని నిలదీశారు.

షర్మిలకిచ్చిన 200 కోట్లు జగన్‌కు ఎక్కడివి?

- ఎన్‌సీఎల్‌టీలో తల్లి, చెల్లిపై కేసు ఆత్మహత్యా సదృశ్యమే
- ఆయన చేయి పట్టుకున్నోళ్లంతా పాతాళానికే: యనమల



అమరావతి, తుని రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 'రాజకీయాల్లో హత్యలు ఉండవు... ఆత్మహత్యలే ఉంటాయి... అనడానికి జగన్మోహన్‌రెడ్డి రాజకీయ జీవితమే తాజా ఉదాహరణ' అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంటలో టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతరం ఓ ప్రకటన చేశారు. 'ఎన్‌సీఎల్‌టీలో తల్లి, చెల్లిపై కేసు వేయడంతో జగన్ పూర్తిగా పాతాళానికి కూరుకుపోయాడు. జగన్ చేయి పట్టుకున్నోళ్లంతా పాతాళంలోకే. ఇది రాజకీయ ఆత్మహత్యే. వాళ్ల కుటుంబ తగాదాలను వాళ్లే రోడ్డుకీడ్చుకొని ఆ బురద మీడియాపైకి నెట్టడం హాస్యాస్పదం. షర్మిలకిచ్చిన రూ.200 కోట్లు జగన్‌కు ఎక్కడివి? 10 ఏళ్లలో రూ.200 కోట్లు ఇచ్చానని జగన్ పేర్కొన్నా... ఇప్పటికీ ఐటీ, ఈడీ ఎందుకు స్పందించడం లేదు? క్విడ్ ప్రోకో 1.0 క్విడ్ ప్రో కో 2.0 కేసులన్నీ ఇప్పటికైనా ఒక కొలిక్కి తేవాలి. ఒక ఆర్థిక నేరస్తుడు 11 ఏళ్లుగా బెయిల్‌పై ఉండడమేంటి? 136 డిశ్చార్జి పిటిషన్లు వేసి తనపై కేసుల విచారణను ముందుకు సాగకుండా అడ్డుకుంటున్న ఆర్థిక ఉగ్రవాది. న్యాయవ్యవస్థకే కొరుకుడు పడని కొయ్యగా మారి, దర్యాప్తు సంస్థలకే పెను సవాళ్లు విసురుతుండడం రాజ్యాంగం ఉనికికే ప్రమాదం. భారత శిక్షాస్మృతికే అవమానం. ఇక భవిష్యత్తులో జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారనుకోవడం పగటికలే. వైసీపీ సగం మునిగిపోయిన నావ. పూర్తిగా మునిగిపోకముందే అందరూ దూకేయడం బెటర్. ఇవాళ కాకపోతే రేపైనా జగన్ జైలుకెళ్లడం ఖాయం. చిన్నమ్మ సౌభాగ్యమ్మ, చెల్లి సునీత ఉసురు పోసుకున్నాడు. వాళ్ల కన్నీళ్లే వైసీపీకి శాపాలయ్యాయి. ఇప్పుడు ఏకంగా తల్లినీ, చెల్లిని ఏడిపిస్తున్నాడు' అని యనమల మండిపడ్డారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మాత్రమే క్రెడిబిలిటీ: షర్మిల

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మాత్రమే క్రెడిబిలిటీ ఉందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. సోమవారం ఆమె ఎక్స్‌లో స్పందించారు. 'వైసీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన... ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేశాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి పార్టీ నేతలతో సమావేశాలను నిర్వహిస్తున్నా. మత రాజకీయాలు చేస్తున్నందుకు బీజేపీని, హామీలు ఇచ్చి మోసం చేసినందుకు వైసీపీని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చేతులెత్తేసిన కూటమి పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీలకు క్రెడిబిలిటీ లేదని ప్రజలకు అర్థమైంది. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై ఉన్న నమ్మకం ఆసరాగా వారి సమస్యలపై అనునిత్యం పోరాటాలు చేయాలి' అని షర్మిల అన్నారు.

సీఎంకాగానే మమ్మల్ని పక్కన పడేశారు

- న్యాయంగా దక్కాల్సిన వాటా ఎందుకు ఇవ్వరు?
- ఈడీ జప్తులో ఉన్న 'సాక్షి'ని వాడుకోవడం లేదా?
- జగన్‌పై షర్మిల భర్త అనిల్ కుమార్ ధ్వజం



అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల్లో వాటాల పంపిణీకి ఈడీ కేసులు, జప్తు కారణమనే వాదనను పీసీసీ అధ్యక్షురాలు షర్మిల భర్త అనిల్ కుమార్ తోసిపుచ్చారు. ఈడీ జప్తులో ఉన్న 'సాక్షి'ని జగన్ ఉపయోగించుకోవడంలేదా అని ప్రశ్నించారు. షర్మిలకు న్యాయంగా రావాల్సిన వాటాను ఎందుకు ఇవ్వడంలేదని నిలదీశారు. బ్రదర్ అనిల్ ఒక టీవీ చానల్‌తో మాట్లాడుతూ ఈ అంశాలపై స్పందించారు. ఆస్తుల పంపకం విషయంలో ఎటూ చెప్పలేక విజయలక్ష్మి నలిగిపోతున్నారని అన్నారు. చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్టును చదవాల్సిన అవసరం షర్మిలకు ఏమిటని ప్రశ్నించారు. దానివల్ల వచ్చే లాభమేమిటని అడిగారు. అప్పట్లో పాదయాత్ర చేయాలని షర్మిలను భారతి కోరారని చెప్పారు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టినప్పుడు అందులోకి ఎవరూ వెళ్లకుండా జగన్ కట్టడి చేశారన్నారు. "తెలంగాణలో పార్టీ పెట్టాలని రాజకీయ విశ్లేషకుడు ప్రశాంత్ కిశోర్ షర్మిలకు సూచించారు. ఇదేవిషయాన్ని జగన్ వద్ద ప్రస్తావిస్తే.. అక్కడ కేసీఆర్ ఉన్నారని, ఆస్తులన్నీ తెలంగాణలోనే ఉన్నందున అక్కడ పార్టీ పెట్టొద్దని షర్మిలతో అన్నారు. అప్పటి నుంచే విబేధాలు ఎక్కువయ్యాయి" అని అనిల్ చెప్పారు. జగన్ 2019 ఎన్నికల్లో గెలిచేదాకా ఒకలా.. గెలిచాక మరోలా మారిపోయారన్నారు. ముఖ్యమంత్రి అయ్యాక తమను జగన్ పక్కన పడేశారన్నారు. బీజేపీతో 'దోస్తీ' నేపథ్యంలో తనను క్రైస్తవ ప్రచారం చేయవద్దని జగన్ చెప్పారన్నారు.






హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా కె.మహేశ్వరరావు, చల్లా గుణరంజన్, టి.చంద్ర ధనశేఖర్‌లతో ప్రమాణం చేయిస్తున్న చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

ముగ్గురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణం

- కుంచం మహేశ్వరరావు, టీసీ ధనశేఖర్, చల్లా గుణరంజన్‌తో ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్ ఠాకూర్
- ఆ వెంటనే హైకోర్టు బెంచ్‌పై కేసులు విన్న జడ్జీలు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా కుంచం మహేశ్వరరావు, టీసీ ధనశేఖర్, చల్లా గుణరంజన్ సోమవారం ప్రమాణం చేశారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ వారితో ప్రమాణం చేయించారు. అంతకుముందు వీరి నియామకానికి రాష్ట్రపతి జారీ చేసిన నియామక ఉత్తర్వులను రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు చదివి వినిపించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా ఈ ముగ్గురు పేర్లు ఈనెల 15న సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టులో 37మంది జడ్జీల నియామకానికి ఆమోదం ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య 26గా ఉంది. ముగ్గురు అదనపు న్యాయమూర్తుల చేరికతో ఆ సంఖ్య 29కి చేరింది. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేశ్, విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ చల్లా కోదండరామ్, జస్టిస్ ఎం.గంగారావులతో పాటు ప్రమాణం చేసిన న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, హైకోర్టు రిజిస్ట్రార్‌లు, న్యాయవాదులు, అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం అనంతరం జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ చల్లా గుణరంజన్ వేర్వేరుగా సింగిల్ బెంచ్‌లో కేసులు విచారించారు. జస్టిస్ జి.నరేందర్ నేతృత్వంలోని ధర్మాసనంలో జస్టిస్ టీసీ ధనశేఖర్ కేసులు విచారించారు.

కొలువు దక్కేలా నైపుణ్య శిక్షణ

- యువతకు ఏడాదిలో 1.24 లక్షల ఉద్యోగాలు
- సీడాప్ వార్షిక ప్రణాళికలో వెల్లడి
- తాడిపత్రిలో అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్
- స్కిల్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దుతాం: దీపక్‌రెడ్డి



అమరావతి, వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో గాడితప్పిన నైపుణ్య శిక్షణ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ(సీడాప్) అందుకు అనుగుణంగా వార్షిక ప్రణాళిక రూపొందించింది. జాతీయ నైపుణ్య మండలిలో అంతర్భాగంగా ఉన్న 36 స్కిల్ కౌన్సిళ్లతో సీడాప్ పలు దఫాలుగా చర్చలు జరిపింది. రాష్ట్రంలోను, సరిహద్దు రాష్ట్రాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను కౌన్సిళ్లు సీడాప్‌కు అందించాయి. 33 రంగాల్లో 1,24,325 ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని, అయితే ఆ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలున్న యువత అందుబాటులో లేరని సీడాప్ అంచనా వేసింది. వచ్చే ఏడాది కాలంలో రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఆయా రంగాల్లో శిక్షణ ఇప్పించి, ఆ ఉద్యోగాలు పొందేలా చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

12 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు

సీడాప్ 36 స్కిల్ కౌన్సిళ్లతో చర్చలు జరపగా 12 కౌన్సిళ్లు ఏపీలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి వ్యక్తంచేశాయి. విదేశాల్లో డ్రైవింగ్ అవకాశాలు పొందేలా శిక్షణ ఇచ్చేందుకు తాడిపత్రిలో అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేయాలని మరో కీలక నిర్ణయం సీడాప్ తీసుకుంది. కౌన్సిళ్ల ద్వారా శిక్షణ, రాయితీలు ఇప్పించి మరో 92,425 మందికి స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యం పెట్టుకున్నారు. నైపుణ్య శిక్షణ అందిస్తున్న భాగస్వామ్య సంస్థలకు గత వైసీపీ ప్రభుత్వం దాదాపు రూ. 300 కోట్లు బకాయిలు పెట్టింది. అయితే ఇందులో కేంద్రం వాటా రూ. 200 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. వంద కోట్లు. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను సకాలంలో ఇవ్వకపోవడంతో కేంద్రం నిధులు విడుదల కాలేదు. దీంతో ఇప్పుడు ఈ నిధుల విడుదల చేసి, తిరిగి శిక్షణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని నిర్ణయించారు.

ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు

వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన తమ ప్రభుత్వ లక్ష్యమని సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి గుణపాటి అన్నారు. సోమవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌ను అత్యుత్తమ నైపుణ్యాలు కలిగిన యువతకు గమ్యస్థానంగా మార్చాలన్న కృతనిశ్చయంతో పనిచేస్తున్నామన్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ సెన్సస్ పేరుతో నైపుణ్యగణన చేపడుతున్నామన్నారు. సీడాప్ ద్వారా ఐదేళ్లలో 5లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇప్పిస్తామన్నారు. స్కిల్ కౌన్సిళ్ల ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుంచుతామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను స్కిల్ హబ్‌గా చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో శిక్షణ ఇచ్చిన పీఐఏలపై విచారణ చేస్తామన్నారు. ఎల్ అండ్ టీ, జాగ్వార్ లాంటి సంస్థలు కూడా ఉద్యోగాలపై ముందుకొస్తున్నాయని సీడాప్ సీఈవో శ్రీనివాసులు తెలిపారు.

ఉచిత సిలిండర్లకు కోట్ల రాయితీ



[redacted]

- నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతి
- నేటి నుంచే బుకింగ్‌కు అవకాశం
- దీపావళి నాడు ముఖ్యమంత్రి చేతులమీదుగా పంపిణీకి శ్రీకారం
- 1.48 కోట్ల మందికిపైగా లబ్ధిదారులు
- ఉచిత పథకానికి ఏటా 2,684 కోట్ల వ్యయం
- ఐదేళ్లలో 13,423 కోట్ల భారం
- సబ్సిడీ మొత్తం ముందుగానే కంపెనీల ఖాతాల్లో జమ
- సిలిండర్ తీసుకున్న 48 గంటల్లో ఆ మొత్తం లబ్ధిదారుల అకౌంట్లకు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు దీపావళి కానుకగా ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు అందించాలని నిర్ణయించిన టీడీపీ కూటమి ప్రభుత్వం.. లబ్ధిదారులకు రాయితీ నిధుల విడుదలకు పరిపాలనా పరమైన అనుమతి ఇచ్చింది. ఎన్డీయే కూటమి ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన సూపర్ 6 హామీల్లో భాగంగా ప్రతి ఇంటికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని దీపావళి పండగను పురస్కరించుకుని ఈ నెల 31న ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 సిలిండర్లను ఉచితంగా అందించడానికి ప్రభుత్వంపై రూ. 2,684.75 కోట్ల రాయితీ భారం పడుతుందని పౌరసరఫరాలశాఖ అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. దీనికి రాష్ట్ర మంత్రివర్గం ఇటీవలే ఆమోదం తెలిపింది. ఉచిత గ్యాస్ సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లోనే రాయితీ మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. తొలివిడత వంట గ్యాస్ సిలిండర్లను పొందే లబ్ధిదారులకు చెల్లించాల్సిన రాయితీ మొత్తం రూ.895 కోట్ల విడుదలకు రాష్ట్ర ఆర్థిక శాఖ అంగీకారంతో ప్రభుత్వం పరిపాలనాపరమైన అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ రాయితీ నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు వీలుగా హెచ్‌పీ, భారత్, ఇండేన్ గ్యాస్ కంపెనీల అకౌంట్లకు ముందుగానే మళ్లిస్తారు. లబ్ధిదారులు ఈనెల 29 నుంచే ఉచిత గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకోవచ్చని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. రాష్ట్రంలో ఎల్పీజీ కనెక్షన్, తెల్ల రేషన్‌కార్డు (బియ్యం కార్డు), ఆధార్ కార్డు ఉన్నవారందరూ మంగళవారం నుంచి ఎప్పటిలాగే ముందుగా గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకుంటే.. తర్వాత పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న డేటాబేస్ ఆధారంగా 24 గంటల్లోపు ఆయా గ్యాస్ కంపెనీలు లబ్ధిదారుల ఆధార్ లింక్‌తో కూడిన బ్యాంకు ఖాతాల్లో రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన రాయితీ మొత్తాన్ని జమ చేస్తాయి. ప్రస్తుతం ఒక్కో సిలిండర్ రిటైల్ మార్కెట్ ధర రూ.876 కాగా.. కేంద్ర ప్రభుత్వం ప్రతి సిలిండర్‌కు రూ.25 చొప్పున సబ్సిడీ ఇస్తుంది. అది పోగా మిగిలిన రూ. 851 పూర్తి సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు చెల్లిస్తుంది. దీపావళి నుంచి ప్రారంభించే తొలివిడత ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్‌లను వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగించనున్నారు. తర్వాత నుంచి నాలుగు నెలలకు ఒకటి చొప్పున (బ్లాక్ పీరియడ్స్) సరఫరా చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

'ఉజ్వల'లో విలీనంపై స్పందించని కేంద్రం

ఉజ్వల యోజన కింద మంజూరు చేసిన గ్యాస్ కనెక్షన్లకు మాత్రమే కేంద్రం రూ.300 చొప్పున రాయితీ ఇస్తోంది. రాష్ట్రంలో ఉన్న 'దీపం' కనెక్షన్లను 'ఉజ్వల' స్కీంలో విలీనం చేయాలని కూటమి ప్రభుత్వం ప్రతిపాదించింది. వీటిని కేంద్రం ఆమోదించి.. రాష్ట్రంలోని 58 లక్షలకుపైగా 'దీపం' కనెక్షన్లను 'ఉజ్వల' స్కీంకు మార్చితే.. ఒక్కో కనెక్షన్‌కు రూ.300 చొప్పున రూ.180 కోట్ల వరకు రాయితీ లభిస్తుంది. ఈ మొత్తాన్ని మూడు ఉచిత సిలిండర్ల పథకానికి వినియోగించుకుంటే రాష్ట్రప్రభుత్వంపై ఏడాదికి రూ.540 కోట్ల మేర భారం తగ్గుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో 'దీపం' కనెక్షన్లను 'ఉజ్వల' పథకంలో విలీనం చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబు ఇటీవలే కేంద్ర పెట్రోలియం మంత్రికి లేఖ రాశారు. కానీ కేంద్రం ఇంతవరకు సానుకూలంగా స్పందించలేదు.

మొత్తం కనెక్షన్లు 1.55 కోట్లు

రాష్ట్రంలో మొత్తం 1,55,84,270 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 1.48 కోట్ల మందికిపైగా తెల్లకార్డుదారులు ఉన్నారు. వీరంతా ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులే. ఇక రాష్ట్రంలో 'దీపం' కనెక్షన్లు 58,42,354, ట్రైబల్ ఎల్పీజీ ప్యాకేజీ కింద ఇచ్చిన కనెక్షన్లు 73,936 కలిపి.. మొత్తం 59,16,290 కనెక్షన్లు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబాల్లోనే ఉన్నాయి. 2016లో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై)ను ప్రారంభించింది. దీని కింద రాష్ట్రంలో 9,65,361 పేద కుటుంబాలకు వంట గ్యాస్ కనెక్షన్లను మంజూరు చేసింది. సామాజిక బాధ్యత కింద మరో 6,23,831 పేద కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయి. ఇవిగాకుండా మరో 80,78,788 సాధారణ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం పౌరసరఫరాల శాఖ వద్దనున్న డేటా ఆధారంగా రాష్ట్రంలోని అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లకు సబ్సిడీ కింద రూ.2,684 కోట్ల మేర ప్రభుత్వంపై అదనపు భారం పడుతుంది. ఐదేళ్లలో రూ.13,423 కోట్ల భారాన్ని మోయాల్సి ఉంటుంది.

పూర్తి పవర్ ఇవ్వకపోతే ఫైన్!

- విద్యుత్ సంస్థలకు ఈఆర్‌సీ ఆదేశాలు
- యూనిట్‌కు 5-15 పైసలు తగ్గించుకోండి
- డిస్కమ్‌లకు మండలి అనుమతి

అమరావతి,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుదుత్పత్తి సంస్థలు పూర్తిస్థాయిలో కరెంటు ఉత్పత్తి చేయలేకపోతే అపరాధ రుసుం తప్పదని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి స్పష్టం చేసింది. దీనికింద.. విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి కొనే విద్యుత్‌లో యూనిట్‌కు ఐదు పైసల నుంచి పదిహేను పైసలు వరకు తగ్గించాలని డిస్కమ్‌లకు నిర్దేశించింది. సహజంగా ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ 85 శాతం ఉంటే .. గరిష్ఠస్థాయిలో విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నట్లుగా పరిగణిస్తారు. అదేగనుక విద్యుత్తు ఉత్పత్తి 80 శాతమే వస్తే జరిమానా తప్పదు. డిస్కమ్‌లు తాము కొనుగోలు చేసిన విద్యుత్తుకు యూనిట్‌కు ఐదు పైసలు తగ్గించాలని ఈఆర్‌సీ ఆదేశించింది. అదేగనుక 70 శాతమే ఉత్పత్తి వస్తే, యూనిట్‌కు పదిపైసలు చొప్పున, అంతకంటే తక్కువ ఉత్పత్తి వస్తే 15 పైసలు చొప్పున తగ్గించాలని స్పష్టం చేసింది. విజయవాడ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్కేంద్రం .. కృష్ణపట్నం శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్కేంద్రంలో కొత్తగా చెరో 800 మెగావాట్ల చొప్పున రెండు యూనిట్లు బహిరంగ మార్కెట్లో కరెంటును అమ్మేందుకు(సీవోడీ) సిద్ధంగా ఉన్నాయని ఈఆర్‌సీకి..ఆ విద్యుత్కేంద్రాల ప్రతినిధులు నివేదించారు. ఈ మేరకు విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్)లతో కొనుగోలు ఒప్పందాలు చేసుకునేందుకు ఆమోదించాలని కోరగా, ఈఆర్‌సీ సమ్మతించింది. దామోదరం సంజీవయ్య థర్మల్ యూనిట్ నిర్మాణ పెట్టుబడి వ్యయం రూ.8,951.31 కోట్లని ఈఆర్‌సీకి.... ఆ విద్యుత్కేంద్రం ప్రతినిధులు దరఖాస్తు చేశారు. అయితే.. రూ.7,516.41 కోట్లకే ఈఆర్‌సీ ఆమోదించింది. అదేవిధంగా వీటీపీఎస్‌కు సంబంధించి.... రూ.8,800.61 కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని ఆమోదించాలని కోరగా, రూ.6,295.42 కోట్లకు ఈఆర్‌సీ ఆమోదించింది. తాము ఇచ్చిన ఆదేశాలపై అభ్యంతరాలు ఉంటే .అడ్మినిస్ట్రేషన్ పవర్ ట్రైబ్యునల్‌లో సవాల్ చేసుకోవచ్చని ఈఆర్‌సీ స్పష్టం చేసింది. ఈఆర్‌సీ ఆదేశాలపై జెన్కో వర్గాలు మిశ్రమ స్పందనను వ్యక్తం చేస్తున్నాయి.

జగన్ చీకటి జీవోలకు మోక్షం

- ప్రజలకు అందుబాటులోకి నాటి జీవోలు
- సర్కారు నిర్ణయం.. జీఏడీ ఉత్తర్వులు
- జీవోఐఆర్‌ను నిలిపేసిన వైసీపీ ప్రభుత్వం

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో రహస్యంగా ఇచ్చిన చీకటి జీవోలకు మోక్షం కలగనుంది. ఏ విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నారో.. ఏవిధమైన జీవో ఇచ్చారో తెలుసుకునే అవకాశం లేకుండానే జగన్ ఏలుబడి సాగింది. జీవోలను దాచిపెట్టి నియంత తరహా పాలన చేసింది. టీడీపీ నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు జీవోలు అందుబాటులోకి వచ్చాయి. సాధారణంగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను గవర్నమెంట్ ఆర్డర్ ఇష్యూ రిజిస్టర్(జీవోఐఆర్) ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వం విడుదల చేసే ఉత్తర్వుల ద్వారా ప్రజలకు సమాచారం చేరుతుంది. వీటిద్వారా తాము ఎన్నుకున్న ప్రభుత్వం ఏచేస్తోందన్న విషయంపై వారికి స్పష్టత వస్తుంది. అయితే.. జగన్ పాలన అంతా రహస్యంగానే సాగింది. జీవోఐఆర్ వెబ్‌సైట్‌ను నిలిపివేయడంపై చాలా మంది హైకోర్టును ఆశ్రయించగా, ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోర్టు ఆదేశించింది. అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం మొండిగానే వ్యవహరించింది. జీవోఐఆర్‌ను పునరుద్ధరించకుండా ఏపీ గెజిట్‌లో ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేసేది. దీనిలోనూ కొన్ని జీవోలను మాత్రమే అప్‌లోడ్ చేసి, ముఖ్యమైన జీవోలను దాచిపెట్టేవారు. ఇలా గత ప్రభుత్వం చివరి రెండేళ్ల పాటు చీకటి పాలన సాగించింది. ఇక, ఇప్పుడు కూటమి ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో వైసీపీ చీకటి జీవోలను యథాతథంగా ప్రజల ముందు ఉంచాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా 2021, ఆగస్టు 15 నుంచి 2024, ఆగస్టు 28 వరకు విడుదల చేసిన జీవోలను జీవోఐఆర్‌లో పొందుపరచనున్నారు. ఈ మేరకు జీఏడీ పొలిటికల్ సెక్రటరీ సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాత జీవోలను మొత్తం జీవోఐఆర్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యతను ఐటీ విభాగానికి అప్పగించారు. దీనికిగాను ఐటీ విభాగం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసి, ఎస్‌వోపీని సిద్ధం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రతి విభాగంలోని ఒక ఏఎస్‌కు శిక్షణ ఇప్పించి, నోడల్ అధికారిగా నియమించాలని సూచించారు.

రెండు నెలల్లో వెలుగులోకి

రెండు నెలల వ్యవధిలో ప్రభుత్వంలోని అన్ని విభాగాలకు సంబంధించి వైసీపీ ఇచ్చిన జీవోలను జీవోఐఆర్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. ఆయా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు నోడల్ అధికారితో సమన్వయం చేసుకుని రోజుకు ఎన్ని జీవోలు అప్‌లోడ్ చేశారన్న సమాచారాన్ని ఐటీ విభాగానికి అందిస్తారు. పాత జీవోలు మొత్తం అప్‌లైడ్ చేయడం వల్ల గత ప్రభుత్వంలో ఏయే జీవోలు ఇచ్చారన్న సమాచారం తెలుస్తుంది. దీంతో పాటు వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అడ్డగోలు నిర్ణయాలు కూడా వెలుగులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వం మాది.. నీ అంతు చూస్తా

- గతంలో పాస్టర్‌ను బెదిరించిన బోరుగడ్డ అనిల్
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన పాస్టర్ మరియదాసు
- వెలుగులోకి వస్తున్న మరిన్ని దందాలు

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగేతర శక్తిగా చెలరేగిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ సాగించిన మరో దందా తాజాగా వెలుగులోకి వచ్చింది. చర్చి నిర్మాణానికి విదేశీ నిధులు ఇప్పిస్తానని పాస్టర్ నల్లపు మరియదాసు వద్ద రూ. 5 లక్షలు తీసుకొని మోసగించాడు. డబ్బు తిరిగివ్వాలని అడిగితే.. "ప్రభుత్వం మాది డబ్బులు అడిగావంటే నీ అంతు చూస్తాను" అంటూ బోరుగడ్డ బెదిరించాడు. బాధిత పాస్టర్ సోమవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన నల్లపు మరియదాసు పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో పాస్టర్‌గా పని చేస్తున్నారు. బోరుగడ్డ అనిల్ బంధువులు చిలకలూరిపేటలోని చర్చికి వచ్చి వెళుతుంటారు. వారిచ్చిన సమాచారం మేరకు చర్చి నిర్మాణానికి విదేశీ విరాళాలు ఇప్పిస్తాడని తాను 2020 మేలో అనిల్‌ను కలిశానన్నారు. విదేశీ విరాళాలు కావాలంటే రూ. 10 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడని, రూ. 5 లక్షలు అప్పుగా తెచ్చి అనిల్‌కు ఇచ్చానని తెలిపారు. నెలలు గడుస్తున్నా విదేశీ నిధులు రాకపోవడంతో తానిచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగానన్నారు. ఈ క్రమంలో తనను అనిల్ బెదిరించాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బోరుగడ్డ అనిల్ ఫోన్ చేసి డబ్బు ఇచ్చేస్తాను పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని కోరాడన్నారు. ఆ తర్వాత ఆయన ఫోను స్విచ్ ఆఫ్ అయిందన్నారు. ఇదే తరహాలో అనేకమంది పాస్టర్లను బోరుగడ్డ మోసం చేసినట్లు తెలుస్తోంది. అయితే బాధితులు ఫిర్యాదు చేసేందుకు నేటికి భయపడుతుండడం గమనార్హం. మరోపక్క విశాఖలో రూ. కోట్ల విలువైన 15 ఎకరాల భూవివాదం పరిష్కరిస్తానని చెప్పి విజయవాడకు చెందిన ఓ బాధితుడి నుంచి కారు తీసుకుని వెనక్కి ఇవ్వకుండా మోసం చేయడమే కాకుండా, బాధితుడిని బెదిరించినట్లు తెలిసింది.

ఇదీ.. అంతర్రాష్ట్ర రహదారి దుస్థితి!



ఇది ఏపీలోని పార్వతీపురం, ఒరిసాలోని రాయగడలను కలిపే అంతర్రాష్ట్ర రహదారి. ఈ రోడ్డుపై భారీ గోతులు ఏర్పడి తరచూ వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. సోమవారం భద్రగిరి వైద్యశాల నుంచి పార్వతీపురానికి వెళ్లేందుకు కొమరాడ నుంచి బయల్దేరిన 108 వాహనం గుమడ గ్రామ సమీపంలోని గోతిలో దిగబడిపోయింది. స్థానికుల సాయంతో వాహనం ముందుకు కదిలింది. కాసేపటికి అదే గోతిలో ఇసుక లారీ దిగబడిపోయింది. సుమారు పది గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. - ఆంధ్రజ్యోతి, పార్వతీపురం

సిరులు కురిపించిన చీరమీను



యానాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యానాం, గోదావరి జిల్లావాసులు ఎంతో ఇష్టంగా తినే చీరమీను.. మత్స్యకారులకు సిరుల వర్షం కురిపించింది. యానాంలోని రాజీవ్ బీచ్, పుష్కర్‌ఘాట్ ప్రాంతాల్లో రెండు రోజులుగా కనివినీ ఎరుగని రీతిలో చీరమీను ఒక తెట్టులాగా కనిపించింది. మత్స్యకారులు ప్రత్యేక వలలతో వాటిని ఒడ్డుకు చేర్చి విక్రయాలు చేశారు. సుమారు 600కిపైగా బకెట్లు, బిందెల్లో (బకెట్ ఒకటి 10 లీటర్లు) చీరమీను లభ్యమైందని అంచనా. సేరు (1లీటరు) రూ.3 వేలకు అమ్మారు. పులస తర్వాత ఆ రేటు పలికే చిరుచేపలివే!



కాంట్రాక్టు డ్రైవర్‌ను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలంటూ మంత్రి చేసిన ట్వీట్

మంత్రి లోకేశ్ చొరవ
'డ్యాన్స్' డ్రైవరు సస్పెన్షన్ రద్దు

- విధుల్లోకి తీసుకోవాలని లోకేశ్ ఆదేశం
- స్వయంగా వచ్చి కలుస్తానంటూ ట్వీట్

తుని రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ లోవరాజు సస్పెన్షన్ విషయంలో మంత్రి లోకేశ్ చొరవ చూపారు. ఆయనను విధుల్లోకి తీసుకోవాలంటూ డిపో అధికారులను ఆదేశిస్తూ..'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. కాకినాడ జిల్లా తుని డిపోలో నేతల లోవరాజు అనే కాంట్రాక్టు డ్రైవర్ విధులు నిర్వహిస్తున్నారు. నాలుగురోజుల క్రితం ఆయన విద్యార్థులకు ఉద్దేశించిన స్పెషల్ బస్సులో వారిని ఎక్కించుకుని తునికి బయలుదేరారు. అది సింగిల్‌రోడ్డు కావడంతో కోడూరు సమీపంలో బస్సుకు ఎదురుగా భారీవాహనం నిలిచిపోయింది. బస్సు ముందుకు వెళ్లక, వెనక్కు రాలేని పరిస్థితి. ఆ భారీ వాహనాన్ని కదిలించి... రోడ్డును క్లియర్ చేయడానికి కనీసం గంట పడుతుందని భావించారు. ఈ లోపు డ్రైవర్ బస్సుకు ఎదురుగా 'దేవర' సినిమా పాటకు డ్యాన్స్ వేశారు. ఆ డ్యాన్స్ వీడియో వైరల్ కావడంతో లోవరాజు ప్రతిభ మంత్రి లోకేశ్ దృష్టికి వెళ్లింది. ఆయన అభినందిస్తూ శనివారం రాత్రి 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. కాగా, అప్పటికే... లోవరాజును ఆర్టీసీ అధికారులు విధుల నుంచి తొలగించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వార్త కూడా వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్.. సోమవారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. సస్పెన్షన్ ఆదేశాలు రద్దు చేస్తున్నామని, మళ్లీ ఆయన విధులకు హాజరుకావొచ్చని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. త్వరలో ఆ డ్రైవర్‌ను కలుస్తానని కూడా అన్నారు. 'ఉద్యోగికి క్రమశిక్షణ అవసరమే. అయితే, హాని కలిగించని వినోదాన్ని నేరంగా పరిగణించలేం' అరాంరరు.

పెరిగిన ఎండ తీవ్రత

- కావలిలో 37.6 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సమీపిస్తున్నా రాష్ట్రంలో వేసవిని తలపించేలా ఎండ తీవ్రత కొనసాగుతోంది. కొన్నిచోట్ల తెల్లవారుజామున చలి, మంచు కురుస్తుండగా, మిగిలిన చోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత ఉన్నాయి. రెండు రోజుల నుంచి వాయవ్య భారతం నుంచి వేడిగాలులు వీస్తుండడంతో ఎండ తీవ్రత పెరిగిందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. సోమవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. కావలిలో 37.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. తూర్పుగాలులు ప్రారంభమయ్యేంత వరకూ రాష్ట్రంలో ఉక్కపోత, ఎండ తీవ్రత కొనసాగుతాయని వాతావరణ నిపుణుడు తెలిపారు. ఒడిశాలో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తర కోస్తాలో అక్కడక్కడా వర్షాలు పడ్డాయి. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బాతుపురంలో తొమ్మిది సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

వరద బాధితులకు
'రేమాండ్' విరాళం 2 కోట్లు

- రూ.కోటి అందించిన 'బ్యాంక్ ఆఫ్ బరోడా'



రూ.రెండు కోట్ల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న రేమాండ్ గ్రూప్ చైర్మన్ గౌతం సింఘానియా

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు చేయూతనిచ్చేందుకు దాతలు పెద్ద సంఖ్యలో ముందుకొస్తున్నారు. సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన పలువురు తమ విరాళాలను చెక్కుల రూపంలో అందజేశారు. రేమాండ్ గ్రూప్ చైర్మన్ గౌతమ్ సింఘానియా రూ.2 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా జోనల్ హెడ్ జీఎం రితేష్‌కుమార్, డిప్యూటీ మేనేజర్ సుధాకర్ రూ.కోటి చెక్కులను సీఎంకు ఇచ్చారు. గంగవరపు విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రూ.65లక్షలు, రాష్ట్రీయ సేవా సమితి తరఫున జనరల్ సెక్రటరి వెంకటరత్నం, జాయింట్ సెక్రటరీ మమత, ప్రాజెక్ట్ డైరెక్టర్లు నాగరాజు, సాయిబాబా రూ.50లక్షలు అందజేశారు. ఎన్నారై మద్దిపట్ల కృష్ణా రూ.10లక్షలు, థామస్య రూ.లక్షా75వేలు, కొర్రపాటి సురేంద్ర రూ.లక్షన్నర, తులసీ కృష్ణమూర్తి రూ.1.18లక్షలు, కే రమేష్ రూ.లక్షా, కే నారాయణ రూ.లక్ష అందించారు.

పేదలకు ఇళ్లు నిర్మించండి.. నేను స్థలం ఇస్తా

- కోరిన వృద్ధురాలు.. చంద్రబాబు అభినందన



సీఎం చంద్రబాబుకు రూ.50 వేల చెక్కును అందజేస్తున్న రాజమ్మ

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ ఊరిలో ఉన్న పేదల కోసం ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తే అందుకు అవసరమైన స్థలాన్ని ఇచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఓ వృద్ధురాలు ముందుకొచ్చారు. నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈ విషయాన్ని తెలియజేశారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన నరిశెట్టి రాజమ్మ అనే వృద్ధురాలు.. సోమవారం సీఎం చంద్రబాబును కలిసి వరద బాధితుల సహాయార్థం చెక్కు అందించారు. తమ గ్రామంలోని 15 పేద కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇస్తే.. అందుకు తన సొంత స్థలాన్ని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని రాజమ్మ ముఖ్యమంత్రికి చెప్పారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం ఉదారంగా స్థలం ఇచ్చేందుకు ముందుకొచ్చిన రాజమ్మను సీఎం అభినందించారు.



సంపద సృష్టించి పేదలకు పంచి ఇచ్చే పెన్నిధికి ఒక పేద విద్యార్థి కానుక... అంటూ తాను గీసిన బొమ్మను చంద్రబాబుకు అందజేస్తున్న విజయవాడ పటమటకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని లాస్య

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.